శుక్రవారం 2-8-2024


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 132



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
శుక్రవారం ॥ 2-8-2024

మెడిసిన్ వదిలేసి మెడల్ కోసం...

సిఫ్ట్ కౌర్ సమ్రా

మెడికల్ కాలేజీ నుంచి ప్యారిస్ ఒలింపిక్స్ వరకు

ఒలింపిక్స్‌కు సంబంధించి 'పతకాల వేట' మాట ఎలా ఉన్నా... స్ఫూర్తిదాయక కథలు ఎన్నో ఉన్నాయి. ఆ కథల్లో ఒకటి... సిఫ్ట్ కౌర్ సమ్రా ప్రయాణం. డాక్టర్ కాబోయి యాక్టర్ కాలేదు కౌర్.

షూటర్ అయింది. ఆసియా క్రీడల్లో బంగారు పతకంతో మెరిసి దేశం దృష్టిని ఆకర్షించింది.

'టైమ్ మేనేజ్‌మెంట్'పై గట్టి పట్టు ఉన్న కౌర్ ఒలింపిక్స్ వరకూ వచ్చింది...



పంజాబ్‌లోని వ్యవసాయ కుటుంబంలో పుట్టిన సిఫ్ట్ కౌర్ సమ్రాకు చిన్నప్పటి నుంచి చదువు అంటే ఎంత ఇష్టమో, ఆటలూ అంతే ఇష్టం. తొమ్మిది సంవత్సరాల వయసులో కౌర్‌కు కరణ్ అనే కజిన్ షూటింగ్‌లో ఓనమాలు నేర్పించాడు. గురి చూసి కొట్టే నైపుణ్యం అప్పటి నుంచే అబ్బింది. ఎంబీబీయస్ చేయాలన్న ఆమె లక్ష్యం కూడా గురి తప్పలేదు. ఫరీద్‌కోట్‌లోని జీజీఎస్ మెడికల్ కాలేజీలో చేరింది. చదువు సంగతి ఎలా ఉన్నా... షూటింగ్ గేమ్స్ ఎక్కడ జరిగినా తంచనుగా ఫాలో అయ్యేది. భోపాల్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో కాంస్య పతకం గెలుచుకోవడం తో 'మెడికలా? మెడలా?' అనే సందిగ్ధంలోకి వచ్చింది కౌర్. 'మెడల్' అనేది 'షూటింగ్'కు ప్రతీక.

చివరికి ఆమె మెడల్ వైపే మొగ్గింది. 'కాలేజీలో 80 శాతం అటెండెన్స్' నియమం వల్ల ప్రాక్టీస్ చేయడానికి, పోటీల్లో పాల్గొనడానికి ఇబ్బందిగా ఉండేది. తాను పూర్తిగా షూటింగ్ వైపు రావాలనుకోవడానికి ఇదొక కారణం. అందరూ కౌర్‌ను 'కాబోయే డాక్టరమ్మ' అని పిలుచుకుంటున్న రోజుల్లో...'చదువు మానేసి పూర్తి సమయం షూటింగ్‌కే కేటాయించాలి అనుకుంటున్నాను' అని తల్లిదండ్రులకు చెప్పినప్పుడు వారు షాక్ అవ్వకుండా 'అలాగే అమ్మా! నీ ఇష్టం' అని చెప్పారు. అలా చెప్పడానికి ఎంతో గుండె ధైర్యం కావాలి. కూతురుపై అంతకుమించిన నమ్మకం కావాలి. ఆ నమ్మకం వారికి ఉంది. ఆ నమ్మకం పునాదిపై షూటింగ్‌లో తన కెరీర్‌ను నిర్మించుకుంది కౌర్.

2023 ఆసియా క్రీడల్లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో వరల్డ్ రికార్డ్ స్కోర్‌తో బంగారు పతకాన్ని గెలుచుకున్న సిఫ్ట్ కౌర్ సమ్రా పేరు మారుమోగిపోయింది.

50 మీ. ఎయిర్ రైఫిల్ 3 పొజిషన్స్‌లో పర్‌ఫెక్ట్ స్కోర్ కోసం టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా ముఖ్యమైనది. టైమ్ మేనేజ్‌మెంట్‌పై కౌర్‌కు మంచి అవగాహన ఉంది. ఆ అవగాహనే ఆమె విజయ కారణాలలో ఒకటి. ఒత్తిడికి గురవుతున్నప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలి...అనే టెక్నిక్ కూడా కౌర్‌కు బాగా తెలుసు. తన గురించి 'యాక్సిడెంటల్ షూటర్' అని చెప్పుకుంటుంది కౌర్. అయితే ఆమె విజయాలు యాక్సిడెంటల్‌గా రాలేదు. చెమట చిందించి సాధించిన విజయాలు అవి.

'మీ సక్సెస్ మంత్ర ఏమిటి.' అని అడిగితే...'మ్యాచ్‌లు అనేవి ప్రాక్టిస్ సెషన్‌లకు రీ నేమ్‌డ్ వెర్షన్‌లు మాత్రమే...అని ఒకసారి కోచ్ నాతో చెప్పారు. ఇక అప్పటి నుంచి ఆ మంత్రాన్ని అనుసరిస్తూ ఒత్తిడికి దూరంగా ఉండే ప్రయత్నం చేస్తున్నాను' అంటుంది సిఫ్ట్ కౌర్ సమ్రా.

ఫ్యాషన్

మై వార్డ్‌రోబ్

మీరూ మీ వార్డ్రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్రోబ్ శీర్షికన ప్రచురిస్తాం. మా చిరునామా: మై వార్డ్‌రోబ్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. sakshifamily3@gmail.com



టీనేజర్‌కు బెస్ట్ 5

'అమ్మా!, ఈ డ్రెస్ సరిగా లేదు, ఈ డిజైన్ ఓల్డ్.. అందరిలోనూ డల్‌గా కనిపిస్తాను, అందుకే నేను ఫంక్షన్‌కు రాను' అనే మాటలు టీనేజ్ అమ్మాయిలు ఉన్న ఇంట్లో తరచూ వినిపిస్తుంటాయి. ఎంపిక చేసిన డ్రెస్ సరిగా లేదనో, మ్యాచింగ్ కుదరలేదనో ... చెప్పే మాటలు అమ్మలకు పెద్ద సవాల్‌గా ఉంటాయి. "మరో అకేషన్‌కి బెస్ట్ ది సెలక్ట్ చేద్దాం. ఇప్పటికి ఇలా రెడీ అయి పో" అని కూతుళ్లకు సర్దిచెబుతూ ఉంటారు అమ్మలు. 'ఇలాంటి ఇబ్బందికర సందర్భాలు ఎదురవకుండా సందర్భానికి తగినట్టు రెడీ అవడానికి మా అమ్మాయి విషయంలో సింపుల్‌గా అనిపించే కొన్ని టెక్నిక్స్ ఫాలో అవుతుంటాను' అని చెబుతున్నారు సంయుక్తా మరపడగ. హైదరాబాద్‌లో ఫ్యాషన్ డిజైనర్‌గానూ రాణిస్తున్న సంయుక్త చెబుతున్న విశేషాలు.

'సాధారణంగా అమ్మాయిల డ్రెస్సింగ్ కోసం తరచూ షాపింగ్ చేస్తుంటాం. బాగున్నవీ, బాగోలేనివీ వార్డ్రోబ్‌లో చాలా డ్రెస్సులు వచ్చి చేరుతుంటాయి. ప్రతీసారీ కొత్తగా అనిపించేలా డ్రెస్సింగ్ ఉండేలా చూసుకోవడం కూడా ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. ప్రతీ ఈవెంట్‌కి సందర్భానికి తగినట్టు డ్రెస్సింగ్ అవడం తప్పనిసరి కాబట్టి ఈ జాగ్రత్తలు తీసుకుంటాను.

బెస్ట్ ఆఫ్ 5

క్యాజువల్‌గా బయటకు, రోజూ కాలేజీకి, పండగలు, గెట్ టు గెదర్స్, పెళ్ళిళ్ల.. ఇలా సందర్భాలను బట్టి మన డ్రెస్సింగ్ ఎలా ఉంటుందో చూసుకోవాలి. వాటిలో బెస్ట్ 5 అనేవి ఎంపిక చేసుకోవాలి.

1. సాధారణంగా బయటకు వెళ్లినప్పుడు ఫంకీ స్టైల్ ఉంటే బాగుంటుంది. అందుకు మోడర్న్ వేర్‌ని ఎంపిక చేసుకోవచ్చు. వీటిలోనే స్ట్రీట్ స్టైల్ మిక్స్ అండ్ మ్యాచ్ డ్రెసింగ్ అయితే బాగుంటుంది.

2. పండగలకు, ఎంగేజ్‌మెంట్స్‌కి సంప్రదాయ లుక్‌లో కనిపించాలి. ఇందుకు ఫ్యాన్సీ టచ్ ను మిక్సప్ చేయచ్చు. ఇండోవెస్ట్రన్ డ్రెస్సింగ్ కూడా ఈ సందర్భాలలో బాగుంటుంది.

3. కాలేజీలో ప్రత్యేకమైన ఈవెంట్స్ ఉన్నా ఫంకీ లుక్‌తో ఉండే ప్లెయిన్ ఫ్యాబ్రిక్స్ బాగుంటాయి. వీటిలోనే ముదురు, లేత రంగుల కాంబినేషన్స్ ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో డార్క్ కలర్ టాప్స్, లైట్ షేడ్స్ స్కర్ట్స్‌ని వార్డ్రోబ్‌లోకి చేర్చుకోవచ్చు. పూర్తి వెస్ట్రన్ స్టైల్స్ కూడా కాలేజీ ఈవెంట్స్‌కు బాగుంటాయి.

4. వివాహ వేడుకలకు బెనారస్, పైథానీ, ఇకత్, పట్టుతో తయారైన ఏ ఫ్యాబ్రిక్‌తో అయినా లెహంగా, శారీ, చుడీదార్ డిజైన్స్.. ఎంపిక చేసుకోవచ్చు. వీటిలోనూ జాకెట్స్, టాప్స్.. వెస్ట్రన్ స్టైల్‌లో డిజైన్ చేయించుకోవచ్చు.

5. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో స్టైల్‌లో కనిపించేలా కనీసం 5 నుంచి 6 డ్రెస్‌లు సిద్ధంగా ఉంటే వాటినే మిక్స్ అండ్ మ్యాచ్ కూడా చేసుకోవచ్చు. లెహంగా ప్లెయిన్ ఉంటే డార్క్ బ్లౌజ్ క్రాప్ టాప్స్, వెస్ట్రన్ టాప్స్‌తో మిక్సప్ చేయచ్చు.

మా అమ్మాయి వార్డ్రోబ్‌లో ఇలా సందర్భానికి తగినట్టు డ్రెస్సులు ఉండేలా చూసుకోవడం వల్ల ఎంత పెద్ద అకేషన్ వచ్చినా పెద్దగా ఇబ్బందిగా అనిపించదు. దీనివల్ల టైమ్ ఆదా అవుతుంది. అనవసర షాపింగ్‌కూడా తగ్గుతుంది.''

ఆభరణాల ఎంపిక

కాలేజీ ఈవెంట్స్‌కి పెద్ద పెద్ద ఇయర్ రింగ్స్ బాగుంటాయి. ముదురు రంగు డ్రెస్సుల మీదకు ముత్యాలు లేదా పెండెంట్ ఉండే సన్నని చెయిన్ ధరిస్తే చాలు.

ఫ్యాన్సీ డ్రెస్సింగ్ అయితే ఇయర్ రింగ్స్‌తో మేనేజ్ చేయచ్చు. పూర్తి సంప్రదాయ లుక్ అయితే సందర్భాన్ని బట్టి టెంపుల్ జ్యువెలరీని ఎంపిక చేసుకుంటే చాలు.

– సంయుక్త మరపడగ

– నిర్మలారెడ్డి

మెనూ కొద్దిగా మారుద్దాం!

బ్రేక్‌ఫాస్ట్ కోసం ఇడ్లీ చేస్తే... 'అమ్మో! డెడ్లీ' అంటారు పిల్లలు. కూరగాయలతో కూరలు వండితే... 'అన్నీ పిచ్చి కూరలే' అంటారు. అందుకే... జస్ట్ ఫర్ చేంజ్. కూరగాయలతో బ్రేక్‌ఫాస్ట్... ఇడ్లీతో ఈవెనింగ్ స్నాక్ చేద్దాం. హ్యాపీగా తినకపోతే అడగండి.

వీట్ వెజిటబుల్ దోసె



కావలసినవి: గోధుమపిండి – ఒకటిన్నర కప్పులు; ఉప్పు – పావు టీ స్పూన్; నీరు – పావు కప్పు; టొమాటో ముక్కలు – పావు కప్పు; ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు; క్యారట్ తురుము – పావు కప్పు; పచ్చిమిర్చి ముక్కలు – అర టీ స్పూన్; కొత్తిమీర తరుగు– 2 టేబుల్ స్పూన్‌లు; నూనె – 6 టీ స్పూన్‌లు. **తయారీ:** ● ఒక పాత్రలో గోధుమపిండి, ఉప్పు, నీరు పోసి ఉండలు లేకుండా కలపాలి. ఇందులో నూనె మినహా మిగిలిన పదార్థాలన్నింటినీ వేసి కలపాలి. ● ఇప్పుడు పెనం వేడి చేసి దోసెలు పోసుకోవడమే. ఈ దోసెలు ఊతప్పంలా మందంగా ఉండాలి. మీడియం మంట మీద కాలనిస్తే కూరగాయ ముక్కలు చక్కగా మగ్గుతాయి. ఒకవైపు దోరగా కాలిన తర్వాత తిరగేసి రెండో వైపు కాల్చి తీస్తే హోల్ వీట్ వెజిటబుల్ దోసె రెడీ.

వంటిల్లు

చిల్లీ ఇడ్లీ



కావలసినవి: ఇడ్లీ ముక్కలు – 2 కప్పులు; రెడ్ చిల్లీ సాస్ – 2 టీ స్పూన్‌లు; తరిగిన అల్లం – 2 టీ స్పూన్‌లు; తరిగిన వెల్లుల్లి– 2 టీ స్పూన్‌లు; తరిగిన పచ్చి మిర్చి – 2 టీ స్పూన్‌లు; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు; టొమాటో కెచప్ – 2 టేబుల్ స్పూన్‌లు; చక్కెర– అర టీ స్పూన్; వినెగర్– టీ స్పూన్; సోయాసాస్ – టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – 3 టేబుల్ స్పూన్‌లు. **తయారీ:** ● పెనంలో రెండు టేబుల్ స్పూన్‌ల నూనె వేడి చేసి ఇడ్లీ ముక్కలు వేసి అంచులు రంగు మారే వరకు వేయించి పక్కన పెట్టాలి ● ఇప్పుడు అదే పెనంలో మిగిలిన నూనె వేడి చేసి అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు, వేసి వేయించాలి. ఇప్పుడు టొమాటో కెచప్, చక్కెర, వినెగర్, సోయాసాస్, రెడ్ చిల్లీ సాస్, ఉప్పు వేసి ఒక నిమిషం పాటు బాగా కలుపుతూ వేయించాలి. ఉల్లిపాయ, క్యాప్సికమ్ బాగా మగ్గిన తర్వాత ముందుగా వేయించి పెట్టుకున్న ఇడ్లీ ముక్కలు వేసి కలిపితే చిల్లీ ఇడ్లీ రెడీ. దీనిని వేడిగా సర్వ్ చేయాలి.



మెమరీ లేన్ ఈ పయనం సామాజికం

'మహిళలు ఐఏయస్ కావడం కష్టం' అనుకునే ఆ రోజుల్లో తొలి ప్రయత్నంలోనే ఐఏయస్ సాధించింది. 'ఎంత పెద్ద ఉద్యోగమైనా సరే, ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగపడనప్పుడు ఆ ఉద్యోగం చేయడం వృథా' అనుకొని ఉద్యోగాన్ని వదులుకొని ప్రజాక్షేత్రంలోకి వచ్చింది అరుణా రాయ్. గ్రామీణ మహిళలతో కలిసి పోయి ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసింది. తాజా విషయానికి వస్తే... తన జ్ఞాపకాలను 'ది పర్సనల్ ఈజ్ పొలిటికల్' పేరుతో పుస్తకంగా తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ఆమె ఉద్యమ ప్రయాణం గురించి...

మనం పుట్టి, పెరిగిన వాతావరణం ఏదో రకంగా బలమైన ప్రభావం చూపుతుంది. కాలం కంటే కాస్త ముందుగా ఆలోచించే కుటుంబంలో చెన్నైలో పుట్టి పెరిగింది అరుణ. 'యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ'లో పోస్ట్-గ్రాడ్యుయేషన్ చేసింది.

'మహిళలు ఐఏఎస్‌కు సెలెక్ట్ కాలేరు' అని బలంగా అనుకునే కాలంలో తొలి ప్రయత్నంలోనే ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ పరీక్ష రాసి ఎంపికైంది. సబ్-డివిజనల్ మెజిస్ట్రేట్ నుంచి 'లెఫ్టినెంట్ గవర్నర్ ఆఫ్ ఢిల్లీ' సెక్రెటరీ వరకు ఎన్నో పదవులు నిర్వహించినప్పటికీ తనలో ఏదో అసంతృప్తి ఉండేది. వ్యవస్థీకృతమైన అవినీతికి సంబంధించిన అసంతృప్తి అది. ఈ అసంతృప్తులు తారస్థాయికి చేరి ఉద్యోగానికి రాజీనామా చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఉద్యోగానికి ఆరు నెలలు సెలవు పెట్టి భర్త సంజిత్ రాయ్ నిర్వహిస్తున్న సోషల్ వర్క్ రిసెర్చ్ సెంటర్(బేర్‌ఫుట్ కాలేజీ)లో చేరింది. రాజస్థాన్‌లోని తిలోనియ గ్రామంలో ఉన్న 'బేర్‌ఫుట్ కాలేజీ'లో పని చేయడం అరుణకు ఎంతో సంతృప్తి ఇచ్చింది. ఉద్యోగానికి రాజీనామా చేసి సేవాపథంలోకి వచ్చింది.


గ్రామాల్లో విద్యుత్ సరఫరా, తాగు నీటి సౌకర్యం, రోడ్డు సౌకర్యం... మొదలైనవి లేని కాలం అది. కిలోమీటర్ల కొద్దీ దూరం నడవాల్సి వచ్చేది. అయితే ఈ అసౌకర్యాలేవీ ఎప్పుడూ అరుణకు కష్టంగా అనిపించలేదు. మహిళలు ఒక బృందంగా ఏర్పడి గ్రామ అభివృద్ధికి పాటుపడేలా కృషి చేసింది. కెన్యాలో జరిగే అంతర్జాతీయ మహిళా సదస్సుకు ఆహ్వానం అందినప్పటికీ అక్కడికి వెళ్లకపోగా దానికి ప్రత్యామ్నాయంగా రాజస్థాన్‌లో మహిళా మేళ (మహిళల పండగ) నిర్వహించింది. కెన్యాలో జరిగే అంతర్జాతీయ మహిళా సదస్సుకు, ఈ స్థానిక సదస్సుకు తేడా ఏమిటంటే... మొదటి దానిలో మధ్యతరగతి, ఆ పై తరగతి విద్యాధికులైన మహిళలే ఎక్కువగా పాల్గొనే సదస్సు. ఇక రెండోది పూర్తిగా గ్రామీణ మహిళలు, శ్రామిక మహిళల కోసం నిర్వహించిన సదస్సు. ఈ తరహా పండగ జరగడం దేశంలో మొదటిసారి.

'మహిళ మేళ' ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక-రాజకీయ చర్చలకు వేదిక అయింది. మహిళలపై జరిగే హింసను నిరోధించడానికి జరిగిన తొలి బహిరంగ చర్చావేదిక అయింది. ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రజాక్షేత్రంలోకి వచ్చిన అరుణారాయ్ బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడింది. 'మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్' ఆర్గనైజేషన్ ద్వారా సోషల్ యాక్టివిస్ట్‌గా మరింత క్రియాశీలంగా పనిచేయడం ప్రారంభించింది.

స్థూలంగా చెప్పాలంటే... అరుణా రాయ్ అంటే ఒక నామం కాదు. అనేకానేక ఉద్యమాల సమాహారం. సమాజహితాన్ని కోరుకునే వారికి స్ఫూర్తిదాయక ఉత్తేజం.

పేద మహిళల కోసం...

'జ్ఞానం యొక్క ఉద్దేశం జ్ఞానం కాదు. కార్యాచరణ' అంటాడు అరిస్టాటిల్. జ్ఞానం అనేది బుర్రలో భద్రపరుచుకొని మురిసిపోవడానికి కాదు. ఆ జ్ఞాన ఫలాలను ఆచరణలోకి, పదిమంది ఉపయోగంలోకి తీసుకురావడం ముఖ్యం. విశ్వవిద్యాలయాల నుంచి మారు మూల పల్లెల వరకు జ్ఞానమార్గంలో పయనించిన అరుణా రాయ్ ఆ జ్ఞానాన్ని పేద మహిళల సంక్షేమం, చైతన్యం కోసం వినియోగించింది. ఉద్యోగ, ఉద్యమ జ్ఞాపకాల 'ది పర్సనల్ ఈజ్ పొలిటికల్' ఆమె వ్యక్తిగతం కాదు. సామాజికం. ఉద్యమ బాటలో పయనించడానికి ఉపకరించే ఇంధనం.



జ్ఞాపకశక్తి

బ్రాహ్మి ప్రభావవంతమైన ప్రయోజనాలను కలిగిస్తోందని 'జర్నల్ ఆఫ్ కాంప్లిమెంటరీ మెడిసిన్' వెల్లడించింది. బ్రాహ్మితోపాటు మరో నాలుగింటిని కూడా తెలిపింది. బ్రాహ్మిని క్యాప్సూల్ రూపంలో, పౌడర్‌గానూ, నీటిలో మరిగించి టీ గా కూడా తీసుకోవచ్చు. ఇది దెబ్బతిన్న న్యూరాన్‌లను ఆరోగ్యవంతం చేసి నాడీ వ్యవస్థ నుంచి సాగాల్సిన సమాచార ప్రసారాన్ని మెరుగుపరుస్తుంది.



మెదడుకు మేత

● **అశ్వగంధ:** మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి లక్షణాల నుంచి స్వస్థత పరిచి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందని 'జర్నల్ ఆఫ్ డైటరీ సప్లిమెంట్స్' అధ్యయనంలో వెల్లడైంది. కార్టిసోల్ స్థాయులు పెరగడం వల్లనే ఒత్తిడి పెరుగుతుంది. అశ్వగంధ కార్టిసోల్ స్థాయులను తగ్గించి మైండ్‌ను ప్రశాంతంగా ఉంచుతుంది. సమాచారాన్ని అందుకున్న తర్వాత మెదడు వేగంగా స్పందించి చేయాల్సిన పని మీద శ్రద్ధ, కార్యనిర్వహణ సమర్థతను మెరుగుపడుతుంది. అయోమయానికి గురికావడం తగ్గి ఆలోచనల్లో స్పష్టత చేకూరుతుంది. ఇది టాబ్లెట్, పౌడర్‌గా దొరుకుతుంది. నిద్రపోయే ముందు పాలతో లేదా తేనెతో కలిపి తీసుకోవాలి.

● **పసుపు:** పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సుగుణాలుంటాయి. యాంటీబయాటిక్‌గా పని చేస్తుంది. బ్రెయిన్ హెల్త్‌ని కూడా మెరుగుపరుస్తుందని 'అమెరికన్ జర్నల్ ఆఫ్ జీరియాట్రిక్ సైకియాట్రీ' పేర్కొన్నది. దీనిని కూరల్లో వేసుకోవడం, జలుబు చేసినప్పుడు పాలల్లో కలుపుకుని తాగడం తెలిసిందే. నీటిలో పసుపు, మిరియాల పొడిని మరిగించి తాగితే జీవక్రియలు మెరుగుపడతాయి.

● **గోతుకోలా:** దీనిని సెంటెల్లా ఏషియాటికా అంటారు. ఈ ఆకును ఆసియాలోని చాలా దేశాల్లో సలాడ్, సూప్, కూరల్లో వేసుకుంటారు. ఈ ఆకును నీటిలో మరిగించి టీ తాగవచ్చు. క్యాప్సూల్స్ కూడా దొరుకుతాయి. ఇది మెదడుకు రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది. దాంతో రక్తప్రసరణ తగ్గడం వల్ల ఎదురయ్యే జ్ఞాపకశక్తి లోపం నివారణ అవుతుందని 'జర్నల్ ఆఫ్ ఎథ్నోఫార్మకాలజీ' చెప్పింది. మధ్య వయసు నుంచి దీనిని వాడడం మంచిది.

● **గింకో బిలోబా:** దీనిని చైనా వాళ్లు మందుల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. వార్ధక్యంలో ఎదురయ్యే మతిమరుపు (డిమెన్షియా) ను నివారిస్తుందని 'కోక్రానే డాటాబేస్ ఆఫ్ సిస్టమిక్ రివ్యూస్' తెలియ చేసింది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ ప్రాపర్టీస్ మెదడు కణాల క్షీణతను అరికడతాయి. ఇవి కూడా మాత్రలు, పొడి రూపంలో దొరుకుతాయి. రోజూ ఈ పొడిని నీటిలో మరిగించి తాగితే వయసు మీరుతున్నా సరే మతిమరుపు సమస్య దరి చేరదు.

త్రినేత్రం

ప్రయాణ దారులలో ప్రకృతి గీతాలతో...



థార్‌లోని ఇసుక దిబ్బల గుండె సవ్వడి విన్నది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పర్వతశ్రేణులతో ఆత్మీయ స్నేహం చేసింది. అస్సాంలోని వరద మైదానాలలో అంతర్లీనంగా ప్రవహిస్తున్న కన్నీళ్లను చూసింది. కేరళ, గోవా తీరాలలో ఎన్నో కథలు విన్నది. కొద్దిమందికి ప్రయాణం ప్రయాణం కోసం మాత్రమే కాదు. ఆనందమార్గం మాత్రమే కాదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఒక అన్వేషణ. తన అన్వేషణలో అందం నుంచి విధ్వంసం వరకు ప్రకృతికి సంబంధించి ఎన్నో కోణాలను కళ్లారా చూసింది బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్, రైటర్, ఆర్టిస్ట్ ఆరతి కుమార్ రావు....



రాజస్థాన్‌లో ఒక చిన్న గ్రామానికి చెందిన చత్తర్ సింగ్ గుక్కెడు నీటి కోసం పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పశ్చిమబెంగాల్‌లో ఒక బ్యారేజ్ నిర్మాణం వల్ల నిర్వాసితుడు అయిన తర్కిల్ భాయి నిలదొక్కుకోవడానికి పడ్డ కష్టాలు తక్కువేమీ కాదు. సుందర్‌బన్ ప్రాంతానికి చెందిన ఆశిత్ మండల్ వేట మానుకొని వ్యవసాయం వైపు రావడానికి ఎంతో కథ ఉంది. బంగ్లాదేశ్‌లోని మత్స్యకార్మికుడి పిల్లాడిని సముద్రపు దొంగలు కిడ్నాప్ చేస్తే ఆ తండ్రి గుండెలు బాదుకుంటూ ఏడ్చే దృశ్యం ఎప్పటికీ మరవలేనిది.

ఒకటా... రెండా ఆరతి కుమార్ ఎన్నెన్ని జీవితాలను చూసింది! ఆ దృశ్యాలు ఊరకే పోలేదు. అక్షరాలై పుస్తకంలోకి ప్రవహించాయి. ఛాయాచిత్రాలై కళ్లకు కట్టాయి. ఒక్కసారి గతంలోకి వెళితే... 'ఉద్యోగం మానేస్తున్నావట ఎందుకు?' అనే ప్రశ్నకు ఆరతి కుమార్ నోట వినిపించిన మాట అక్కడ ఉన్నవాళ్లను ఆశ్చర్యానికి గురి చేసింది.


'ప్రకృతి గురించి రాయాలనుకుంటున్నాను. అందుకే ఉద్యోగం మానేస్తున్నాను' అని చెప్పింది ఆమె. యూనివర్శిటీ ఆఫ్ పుణెలో ఎంఎస్సీ, థండర్ బర్డ్ స్కూల్ ఆఫ్ గ్లోబల్ మేనేజ్‌మెంట్-ఆరిజోనాలో ఎంబీఏ, ఆరిజోనా యూనివర్శిటీలో మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ చేసిన ఆరతి అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఇన్‌టెల్‌లో ఉద్యోగం చేసింది.

కొంత కాలం తరువాత తనకు ఉద్యోగం కరెక్ట్ కాదు అనుకుంది. సంచారానికే ప్రాధాన్యత ఇచ్చింది.

బ్రహ్మపుత్ర నది పరివాహక ప్రాంతాలకు సంబంధించిన అనుభవాలను బ్లాగ్‌లో రాసింది. పంజాబ్ నుంచి రాజస్థాన్ వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగిన ఆరతి 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' పేరుతో రాసిన పుస్తకానికి మంచి పేరు వచ్చింది. ప్రకృతి అందాలే కాదు వివిధ రూపాల్లో కొనసాగుతున్న పురా జ్ఞానం వరకు ఎన్నో అంశాల ప్రస్తావన ఈ పుస్తకంలో కనిపిస్తుంది.

ప్రకృతికి సంబంధించిన అందం నుంచి వైవిధ్యం వరకు, వైవిధ్యం నుంచి వైరుధ్యం వరకు తన ప్రయాణాలలో ఎన్నో విషయాలను తెలుసుకుంది. తాను తెలుసుకున్న విషయాలను అక్షరాలు, ఛాయాచిత్రాలతో ప్రజలకు చేరువ చేస్తోంది ఆరతి కుమార్ రావు.

భూమాత మాట్లాడుతోంది విందామా!



ఆరతి కుమార్ రావు రాసిన 'మార్జిన్‌ల్యాండ్స్' పుస్తకం కాలక్షేప పుస్తకం కాదు. కళ్లు తెరిపించే పుస్తకం. ఇది మనల్ని మనదైన జల సంస్కృతిని, వివిధ సాంస్కృతిక కళారూపాలను పరిచయం చేస్తుంది.

● 'ప్రకృతి దృశ్యాన్ని అర్థం చేసుకోవడానికి మనం తగినంత సమయాన్ని తప్పకుండా వెచ్చించాలి. దానిలో జీవించాలి. దానితో ఏకం కావాలి' అంటుంది ఆరతి ● ఈ పుస్తకం ద్వారా మన సంస్కృతిలోని అద్భుతాలను మాత్రమే కాదు తెలిసో తెలియకో మనం అనుసరిస్తున్న హానికరమైన విధానాలు, ప్రకృతి విపత్తుల గురించి తెలియజేస్తుంది ● 'మన సంప్రదాయ జ్ఞానంలో భూమిని వినండి అనే మాట ఉంది. భూమాత చెప్పే మాటలు వింటే ఏం చేయకూడదో, ఏం చేయాలో తెలుస్తుంది' అంటుంది ఆరతి కుమార్ రావు.

బ్యూటిప్




యాక్నే పోవాలంటే...

మాయిశ్చరైజర్‌లో రెండు చుక్కల టీట్రీ ఆయిల్ కలిపి ముఖానికి రాయాలి. రోజూ చేస్తుంటే వారం– పది రోజుల్లోనే మచ్చలు తొలగిపోయి చర్మం కాంతివంతమవుతుంది.

చర్మం పొడిబారుతుంటే...

కలబంద గుజ్జును ముఖం, మెడ, చేతులకు, పాదాలు రాయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమను గ్రహించి కాంతివంతమవుతుంది. ఇన్‌ఫెక్షన్‌లు, దద్దుర్లు కూడా తగ్గిపోతాయి.


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 132

శుక్రవారం 2-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇక వన్డే సమరం

నేడు భారత్, శ్రీలంక జట్ల మధ్య తొలిపోరు జరగనుంది. అయితే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే టి20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టు వన్డే ఫార్మాట్‌లోనూ మరో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్, కోహ్లి రాకతో టీమిండియా మరింత పటిష్టంగా మారింది. మధ్యాహ్నం గం. 2:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

–స్పోర్ట్స్‌లో


యువర్స్

● క్వీన్ ఆఫ్ హార్ట్స్

ఇతిహాసాల్లో స్త్రీ పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఎంత?! భగవంతునికే పునర్జన్మను ఇచ్చిన స్త్రీ అంటే ఆమె ఎంత గొప్పదై ఉండాలి?! మానవ భావోద్వేగాలైన కోపం, అసూయ, ఆనందం, దుఃఖం, సంతృప్తి.. వ్యక్తిత్వాలలో నలుపు-తెలుపుల వడబోతలో వుండే షేడ్స్ ఎన్ని?! ఇలా ఎన్నో సందేహాలకు సమాధానాలు వెతుకుతూ 'కౌసల్య'ను మన ముందుకు తెచ్చింది విభా సంగీత కృష్ణకుమార్.

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో బయాలజీలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ చేస్తున్న విభా సంగీత 'కౌసల్య- క్వీన్ ఆఫ్ హార్ట్స్' పుస్తకాన్ని రచించింది. రామాయణంలో కొడుకు జీవితంలో స్త్రీ పాత్రకు ఉన్న ప్రాధాన్యత గురించి రాసిన 'కౌసల్య' పుస్తకం విభాకు మంచి పేరు తెచ్చింది. శాస్త్రీయ సంగీతంలోనూ ప్రావీణ్యురాలైన విభా సంగీతను కలిస్తే ఎన్నో విషయాలు ఇలా మన ముందుంచారు.

హృదయ కౌసల్యం





"నేను పుట్టి పెరిగింది చెన్నై. యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో బయాలజీ ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్‌లో రెండవ సంవత్సరం చదువుతున్నాను. మా అమ్మానాన్నలు సీత, కృష్ణకుమార్ ఇద్దరూ ఉద్యోగస్తులే. రామాయణాన్ని రకరకాల కథనాల ద్వారా వింటూ పెరిగాను. అవన్నీ చాలా ఆసక్తిగా అనిపించేవి. ఈ క్రమంలోనే రామాయణంలోని స్త్రీల పాత్రల గురించి, వారి మనస్తత్వాల గురించి బాగా ఆలోచించేదాన్ని. అందులో కౌసల్య ప్రస్తావన గురించి వచ్చినప్పుడు చాలా ధర్మబద్ధమైన మహిళలలో ఒకరిగా, క్లుప్తంగా ఆమె పాత్ర ఉంది. భగవంతునికి పునర్జన్మను ఇచ్చిన స్త్రీ అంటే ఆమె ఎంత గొప్పదై ఉండాలి. ఆమెకు ఇవ్వాల్సిన గౌరవం దక్కిందా అనిపించింది. ఆ ఆలోచన నుంచి పుట్టుకువచ్చిందే 'కౌసల్య'. ఈ పుస్తకాన్ని పూర్తిగా కౌసల్య దృష్టి కోణం నుండే తీసుకున్నాను.

మొదటి పుస్తకం

పుస్తకం రాయడం పూర్తయ్యేవరకు ఈ విషయం ఎవ్వరికీ తెలియదు. 'రామాయణం స్ఫూర్తితో ఎన్నో పుస్తకాలు, సినిమాలు, సీరియల్స్ వచ్చాయి. వాటికి భిన్నంగా ఏం రాసుంటుంది ఈ అమ్మాయి' అని అనుకుంటారు. నా పుస్తకంలో నా పాత్రలన్నీ మనుషులే. వారిని అతిగా పొగడలేదు. అలాగని, వారి ప్రాధాన్యతలను తగ్గించలేదు. మానవ భావోద్వేగాలు అన్నీ ఉంటాయి. వ్యక్తిత్వాలలో నలుపు-తెలుపు మాత్రమే కాదు వివిధ రకాల షేడ్స్ కూడా ఉంటాయి. ఇంతకు ముందు కొన్ని పుస్తకాలు రాశాను. కానీ, అవి ప్రచురించలేదు. 'కౌసల్య-క్వీన్ ఆఫ్ హార్ట్స్' నా మొదటి పుస్తకం. ఆంగ్ల భాషా పత్రిక 'శృతి' మ్యాగజీన్‌కు కరస్పాండెంట్‌గా ఉన్నాను. ఈ మ్యాగజీన్‌లో నా వ్యాసాలు, సమీక్షలు ప్రచురించారు. ఆ విధంగా నా గురించి చాలామందికి తెలిసింది.

మార్పులు చేసుకుంటూ..

ఈ పుస్తకాన్ని రెండేళ్ల క్రితం జూలై 2022లో ప్రారంభించాను. అలాగని నిరంతరాయంగా రాయలేదు. దీంతో పాటు అకడమిక్ బాధ్యతలు కూడా ఉన్నాయి. కిందటేడాది 84,000 పదాలతో పూర్తి చేసి అనేక మార్పులు చేశాను. ఈ నవల ప్రస్తుత వెర్షన్‌లో 65,000 పదాలు ఉంటాయి. జేకె పేపర్స్ ఆథర్స్ అవార్డ్ రావడం, ఢిల్లీకి చెందిన పబ్లిషర్, ఎడిటర్ రీటొమానియ నాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చారు. నేను చదువుకుంటున్నది సైన్స్‌కు సంబంధించినది. కథలు రాయడాన్ని ఇష్టపడతాను. శాస్త్రీయ సంగీతం నాకున్న మరో అభిరుచి.

సామాన్యులకు సైన్స్

'సమాజ శ్రేయస్సుకు పాటుపడటమే నా ముందున్న లక్ష్యం. రకరకాల వ్యాధుల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉంది. నా చదువును కొనసాగిస్తూనే వాటికి సంబంధించిన అధ్యయనం కూడా చేయాలనుకుంటున్నాను.

కర్ణాటక సంగీతంలో చూపించిన ప్రతిభకు గానూ వందకు పైగా బహుమతులు అందుకున్నాను. భారత ప్రభుత్వం నుండి సిసిఆర్‌టి స్కాలర్‌షిప్ పొందాను. నా రచనకు వచ్చిన మొదటి అవార్డును మాత్రం ఎప్పటికీ మరిచిపోలేను' అంటుంది విభా సంగీత

– పరియాద రామ్మోహన్, సాక్షి, హైదరాబాద్

● సక్సెస్ స్టోరీ

ఇష్టానికి కష్టం తోడైతే చిన్న వయసులోనే పెద్ద విజయం సాధించవచ్చు... అని చెప్పడానికి ఉదాహరణ కేరళలోని ఎర్నాకుళంకు చెందిన ఉదయ్ శంకర్. పదిహేనేళ్ల వయసులోనే ఏఐ స్టార్టప్ మొదలు పెట్టి ఔరా అనుకునేలా చేశాడు. ఇప్పటి వరకు 10 ఏఐ యాప్‌లు, 9 కంప్యూటర్ ప్రోగ్రామ్స్, 15 రకాల గేమ్స్ డిజైన్ చేశాడు....

శభాష్ శంకర్



పదిహేనేళ్ల వయసులోనే ఏఐ స్టార్టప్

కోచిలో జరిగిన అంతర్జాతీయ జెన్‌ఏఐ సదస్సులో ఉదయ్‌శంకర్ స్టార్టప్ 'ఉరవ్'కు సంబంధించి ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. చిన్న వయసులోనే రోబోటిక్స్‌పై ఆసక్తి పెంచుకున్నాడు ఉదయ్.

బహిరంగ ప్రదేశాలలో వృద్ధులకు ఉపకరించే 'థర్డ్ ఏఐ' యాప్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ఉదయ్.'యస్, మా వాడు సాధించగలడు' అనే నమ్మకం తల్లిదండ్రులకు కలిగింది. ఏఐ స్టార్టప్ 'ఉరవ్'తో మరో అడుగు ముందు వేశాడు.



అది పాషన్‌గా మారడానికి ఎంతోకాలం పట్టలేదు. కోవిడ్ కల్లోల సమయంలో ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. సమయాన్ని వృథా చేయకుండా ఆన్‌లైన్‌లో పైథాన్ ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాడు.

యాప్ డెవలప్‌మెంట్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. పట్టు సాధించాడు.

ఒకరోజు తన బామ్మకు కాల్ చేశాడు ఉదయ్.'కొద్దిసేపటి తరువాత నీకు ఫోన్ చేస్తాను' అని ఫోన్ పెట్టేసింది బామ్మ. అంతవరకు వేచి చూసే ఓపిక లేని ఉదయ్ బుర్రలో 'బామ్మ డిజిటల్ అవతార్'ను సృష్టించాలని, ఆ అవతార్‌తో ఏఐ ఉపయోగించి మాట్లాడాలనే ఐడియా తట్టింది. ఆ ఐడియాను సాకారం చేసుకున్నాడు. బహిరంగ ప్రదేశాలలో వృద్ధులకు ఉపకరించే 'థర్డ్ ఏఐ' యాప్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు ఉదయ్.'యస్, మా వాడు సాధించగలడు' అనే నమ్మకం తల్లిదండ్రులకు కలిగింది.

ఏఐ స్టార్టప్ 'ఉరవ్' మరో అడుగు ముందు వేశాడు. ఏఐ రిమోట్ టీచర్ మిస్ వాణి, ఏఐ పర్సనలైజ్‌డ్ మెడికల్ అండ్ క్లినికల్ అసిస్టెంట్ మెడ్‌ఆల్కా, ఏఐని ఉపయోగించి ఫొటో నుంచి 3డీ ఇమేజెస్ సృష్టించే మల్టీటాక్ అవతార్ ఏఐ సూట్... మొదలైనవి కంపెనీ ప్రాడక్ట్స్.


తండ్రి డా.రవి కుమార్, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన తల్లి శ్రీకుమారి ఉదయ్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకొని మంచి పేరు తెచ్చుకున్నాడు ఉదయ్ శంకర్.

● గేమింగ్

భయాన్నే భయపెట్టేలా...

'వన్స్ హ్యూమన్' థర్డ్ పర్సన్ ఓపెన్ వరల్డ్ మల్టీప్లేయర్ సర్వైవల్ గేమ్. ఈ గేమ్ కథ విషయానికి వస్తే... ఒకానొకచోట వెండి తలుపు తెరవడంతో స్టార్‌డస్ట్ అనే పదార్థం బయటికి వచ్చి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తుంది. కొత్త కొత్త జీవులు భూలోకంలోకి అడుగుపెడతాయి. ఈ క్రమంలో దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడడం, ఆ పోరాటానికి అవసరమైన ఆయుధాలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కనిపించే శత్రువు, కనిపించని శత్రువుతో పోరాడే సత్తాను సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

ప్లాట్‌ఫామ్స్: ఆండ్రాయిడ్, ఐవోఎస్, మైక్రోసాఫ్ట్ విండోస్ **జానర్:** థర్డ్-పర్సన్ ఓపెన్ వరల్డ్ సర్వైవల్ గేమ్
మోడ్: మల్టీప్లేయర్



● పర్యావరణం

గ్రీన్ చాయిసెస్ ఎంపవర్ వాయిసెస్



వస్తువులకు సంబంధించిన మన ఎంపిక పర్యావరణంపై ప్రభావం చూపుతుంది. ఈ విషయంలో వినియోగదారులకు 'బి ఎర్త్ లీ' సహాయకారిగా ఉంటుంది.
– మానస

పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను వినియోగదారులకు చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.
– స్పందన

విశాఖపట్టణం పీ.ఎం పాలెంలోని ఈస్టర్న్ ఘాట్స్ బయోడైవర్సిటీ సెంటర్‌లో మానస తిన్ననూరి, స్పందన అంచల చేతుల మీదుగా పురుడు పోసుకుంది 'బి ఎర్త్‌లీ' అంకుర సంస్థ. కోటి మంది జీవితాలకు చేరువ కావాలనే లక్ష్యంతో వీరు తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఇటీవల తమ సొంత స్టోర్ 'వన సంపద'ను తూర్పు కనుమల జీవవైవిధ్య కేంద్రంలో ప్రారంభించారు. డిఎఫ్‌ఓ అనంత్ శంకర్ అందించిన సహకారంతో తమ కలను సాకారం చేసుకున్నారు.

మానస బయోకెమిస్ట్రీలో పీజీ, ఎంబిఏ పూర్తిచేసి హార్వర్డ్ యూనివర్శిటీలో ఇంటర్నేషనల్ హెల్త్ సిస్టమ్‌పై కోర్సు చేసింది. స్పందన ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఎంబిటి బూట్ క్యాంప్ ప్రోగ్రామ్ చేసింది. గత పదమూడు సంవత్సరాలుగా ఈ ఇద్దరు సామాజికసేవా రంగంలో పనిచేస్తున్నారు. కోవిడ్ సమయంలో వాలెంటీలుగా పనిచేస్తూ పరిచయమయ్యారు. 'ప్లాస్టిక్‌ను నిరోధించాలి' అనే నినాదంతో ఆగిపోకుండా ప్రత్యామ్నాయాలను అన్వేషించడానికి పరిశోధన చేసారు.


దీనిలో భాగంగా చెట్ల నుంచి లభించే వివిధ ఉత్పత్తులను ఉపయోగించి, కార్యాలయాలు, ఇంటిలో ఉపకరించే వస్తువులను తయారుచేస్తున్నారు. రీసైకిల్డ్ పేపర్‌తో నోట్ పాడ్స్, డైరీలు, క్యాలెండర్లు తయారు చేస్తున్నారు. వీటిలో కంటికి కనిపించని చిన్న విత్తనాలను ఉంచుతారు. పెన్నులు, పుస్తకాలు వినియోగించిన తరువాత బయట పారవేసినా వాటిలో ఉండే విత్తనాలు సహజంగా మొలకెత్తుతాయి. రాఖీ పౌర్ణమి కోసం కొబ్బరి పెంకుతో సహజసిద్ధమైన రాఖీలు తయారుచేశారు. వెదురుతో టూత్ బ్రష్‌లు, దువ్వెనలు, పెన్‌స్టాండ్, మొబైల్ స్టాండ్, అందమైన రంగులతో కాటన్ చేతి సంచులు, మట్టి ప్రమిదలు, సీడ్ గణేష్, మట్టి, ఆవు పేడతో తయారు చేసిన కుండీలు...ఇలా పర్యావరణహితమైన ఎన్నో ఉత్పత్తులను వీరు తయారు చేసి విక్రయిస్తున్నారు. సంస్థ నినాదం గ్రీన్ చాయిసెస్.. ఎంపవర్ వాయిసెస్. వివిధ సందర్భాలలో బహుమతులుగా ఇవ్వడానికి ఉపయోగపడే ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఈ వస్తువులను విశాఖకు అతి చేరువలో ఉన్న ఆదివాసీ గ్రామం శంభువానిపాలెంకు చెందిన ఆదివాసీ మహిళలతో చేయిస్తు వారికి ఉపాధి కల్పిస్తున్నారు.

– వేదుల నరసింహం, ఫోటోలు: ఎం.డి నవాజ్, విశాఖపట్నం

గిల్ట్-ఎడ్జెడ్

ఏదైనా ఇన్వెస్ట్‌మెంట్, ఆస్తికి సంబంధించి 'ఎలాంటి రిస్క్ లేదు. పూర్తిగా భరోసా పెట్టవచ్చు' అని చెప్పే సందర్భంలో, ఒక వ్యక్తి ప్రతిభ, ఒక సంస్థ సామర్థ్యం గురించి చెప్పేటప్పుడు వాడే మాట... గిల్ట్-ఎడ్జెడ్.

ఉదా: హిజ్ గిల్ట్-ఎడ్జెడ్ రెప్యుటేషన్ ఇన్ ది ఇండస్ట్రీ మేక్స్ హిమ్ ది గో-టు కన్సల్టెంట్ ఫర్ హై-స్టేక్స్ ప్రాజెక్ట్స్.




కిడ్ గ్లోవ్స్

ఎవరితోనైనా సున్నితంగా వ్యవహరించే, ఒక విషయాన్ని చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేసే సందర్భంలో వాడే మాట... కిడ్ గ్లోవ్స్.

ఉదా: హీ హ్యాండిల్డ్ ది సెన్సిటివ్ ఇష్యూ విత్ కిడ్ గ్లోవ్స్.

● ఏఐ ఏరియా

స్కెచ్ టు ఇమేజ్



శాంసంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, జెడ్ ఫ్లిప్ 6లో 'స్కెచ్ టు ఇమేజ్' టూల్ అందుబాటులో ఉంది. 'రఫ్ స్కెచ్'ను క్రియేట్ చేయడానికి ఆ తరువాత డిటైల్డ్ ఇమేజ్‌ను క్రియేట్ చేయడానికి ఈ ఫీచర్ యూజర్‌లకు ఉపయోగపడుతుంది.

యూజర్‌లు తమ డూడుల్స్‌ను మెరుగుపరుచుకోవడానికి 'త్రీడీ కార్టూన్' 'ఇలస్ట్రేషన్'లాంటి స్టైల్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. 'పోర్ట్రయిట్ స్టూడియో' అనే గెలాక్సీ ఏఐ ఫీచర్‌తో యూజర్‌లు స్కెచ్, వాటర్‌కలర్, 3డీ కార్టూన్, కామిక్‌లాంటి డిఫరెంట్ స్టైల్ పోర్ట్రయిట్స్‌ను క్రియేట్ చేయవచ్చు. 'స్కెచ్ టు ఇమేజ్' కోసం ఇలా.... ● నోట్స్ యాప్‌ను ఓపెన్ చేయాలి ● నోట్స్ యాప్‌లో మీకు నచ్చిన వాటిని గీయండి. ● డ్రా చేస్తున్నప్పుడు 3డీ కార్టూన్, జెనరేట్ అనే రెండు బటన్‌లు కనిపిస్తాయి ● డ్రాయింగ్ పూర్తయిన తరువాత స్టైల్ కోసం 3డీ కార్టూన్ బటన్ నొక్కాలి ● జెనరేట్ బటన్ నొక్కాలి.

సినిమా

ఆ పెయిన్ నాకు తెలుసు

– అల్లు శిరీష్



"ఒకేసారి రెండు మూడు సినిమాలు చేయడాన్ని ఇష్టపడను. ఒక సినిమా తర్వాత మరో సినిమా చేయడానికి ఆసక్తి చూపిస్తుంటాను. అందుకే నా సినిమాలు కాస్త ఆలస్యంగా థియేటర్స్‌లోకి వస్తున్నాయి. కొంత బ్యాడ్ ప్లానింగ్ కూడా కారణం అనిపిస్తోంది. సాధారణంగా చిన్న, పెద్ద... ఏ సినిమా అయినా సరే అనుకున్న సమయానికి దాదాపు పూర్తి కావడం లేదు. ఎంతో కొంత ఆలస్యం అవుతున్నాయి" అని అల్లు శిరీష్ అన్నారు. అల్లు శిరీష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బడ్డీ'. కేఈ జ్ఞానవేల్ రాజా, అధనా జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో అల్లు శిరీష్ చెప్పిన సంగతులు.

● 'బడ్డీ' కథను దర్శకుడు శామ్ చెప్పినప్పుడు టెడ్డీ బేర్ పాయింట్‌తో ఆల్రెడీ తమిళంలో 'టెడ్డీ', ఇంగ్లిష్‌లో మరో మూవీ ఉందని చెప్పాను. 'బడ్డీ' కథ విన్నాక ఓటీటీలో 'టెడ్డీ' చూడండి... కచ్చితంగా 'బడ్డీ' కొత్తగా అనిపిస్తుందని శామ్ అన్నారు. దీంతో 'బడ్డీ' కథ విన్నాను. టెడ్డీ బేర్‌లోకి ప్రాణం రావడం అనే పాయింట్ తప్ప మిగతా అంతా కొత్తగా అనిపించింది. హీరో, విలన్‌కు మధ్య ఉండే ఘర్షణ, హీరో క్యారెక్టరైజేషన్, లవ్ స్టోరీ... అంతా కొత్తగా డిజైన్ చేసినట్లనిపించింది. అందుకే 'బడ్డీ' ఒప్పుకున్నాను. ● 'బడ్డీ' పోస్టర్ బయటకు రాగానే ఇది తమిళ మూవీ 'టెడ్డీ'కి రీమేక్ కదా అనే కామెంట్స్ వినిపించాయి. 'కాదు... మేం కష్టపడి స్ట్రయిట్‌గా చేసిన తెలుగు సినిమా' అని చెప్పడమే మాకు సవాల్‌గా అనిపిస్తోంది. మేం ఎంత చెప్పినా రీమేక్ అని కామెంట్స్ చేసేవారు చేస్తూనే ఉన్నారు. అలాంటి వారిని మార్చలేం. ● 'బడ్డీ'ని గతేడాది డిసెంబరులోనే రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ టెడ్డీ బేర్ ఎమోషన్స్, లుక్స్‌తో పాటు సినిమాలో మూడువేలకు పైగా గ్రాఫిక్స్ షాట్స్ ఉన్నాయి. వీటిని కరెక్ట్‌గా చేయించాలంటే చేసే ఆర్టిస్టులకు సమయం ఇవ్వాలి. అందుకే రిలీజ్ ఆలస్యమైంది. ● కథగా చెప్పాలంటే 'బడ్డీ' లవ్‌స్టోరీ. హీరో పైలట్. హీరోయిన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్. హీరోయిన్‌కు హీరో తెలుసు. కానీ హీరోకు హీరోయిన్ తెలియదు. ఫైనల్‌గా వీరి లవ్‌స్టోరీ ఏమైంది? మధ్యలో 'బడ్డీ' క్యారెక్టర్ ఏంటి? అన్నది కథ. ● జ్ఞానవేల్ రాజాగారు సినిమాను రిచ్‌గా నిర్మించారు. నాకు ప్రొడక్షన్‌లో కాస్త అనుభవం ఉంది. కానీ నేను హీరోగా చేసే సినిమాల ప్రొడక్షన్ విషయాల్లో జోక్యం చేసుకోవాలనుకోను. ఓ ప్రముఖ నిర్మాత (అల్లు అరవింద్) తనయుడిగా, ప్రొడక్షన్ గురించి అవగాహన ఉన్న వ్యక్తిగా వేస్ట్ ప్రొడక్షన్ వల్ల కలిగే పెయిన్ నాకు తెలుసు. అందుకే వృథా ఖర్చుని ప్రోత్సహించను.

బన్నీ... హనీ... భారీ ఫైట్

పేరు హనీ... అంత మాత్రాన స్వీట్ గాళ్ అనుకుంటే పొరపాటే. శత్రువులను రఫ్ఫాడించేటప్పుడు గరమ్ గాళ్ అయిపోతుంది. ఈ పవర్‌ఫుల్ రోల్‌లో సమంత కనిపించనున్న సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ. బన్నీగా వరుణ్, హనీ పాత్రలో సమంత కనిపిస్తారు. గురువారం ఈ సిరీస్ టీజర్ విడుదలైంది. ఒకవైపు వరుణ్ ధావన్... మరోవైపు సమంత.... ఇద్దరూ పోటాపోటీగా విలన్లను రఫ్ఫాడిన దృశ్యాలు ఈ టీజర్‌లో కనిపించాయి. ఈ భారీ ఫైట్‌ని సమంత అవలీలగా చేసినట్లు టీజర్ చూస్తే తెలుస్తుంది. హాలీవుడ్ టీవీ సిరీస్ 'సిటాడెల్'కి ఇండియన్ వెర్షన్ ఇది. సమంత ఓ లీడ్ రోల్‌లో 'ది ఫ్యామిలీ మేన్ 2' సిరీస్‌కి దర్శకత్వం వహించిన రాజ్ – డీకే 'సిటాడెల్'కి దర్శకులు. ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది.



● సమంత

మేకోవర్ సవాల్‌గా అనిపించింది

– వరుణ్ సందేశ్



"నేను ఫలానా తరహా పాత్రలే చేయాలని పరిమితులేవీ పెట్టుకోలేదు. కథ, అందులోని నా క్యారెక్టర్ నచ్చితే ఏ సినిమా అయినా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. 'మైఖేల్' సినిమాలో విలన్‌గా చేశాను. మంచి కథ కుదిరితే వెబ్ సిరీస్‌లోనూ నటించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని వరుణ్ సందేశ్ అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం 'విరాజి'. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో వరుణ్ సందేశ్ పంచుకున్న విశేషాలు.

● 'విరాజి' మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. మెంటల్ హాస్పిటల్ దగ్గర ఉన్న కొంతమంది దగ్గరకు ఆండీ (వరుణ్ సందేశ్ పాత్ర పేరు) వచ్చాక అక్కడ గందరగోళ వాతావరణం ఏర్పడుతుంది. ఎందుకు? అనేది సినిమాలో చూడాలి. ఓ సందేశం కూడా ఉంది. ఇలాంటి కథను సినిమాల పట్ల ప్యాషన్ ఉన్న మహేంద్రగారిలాంటి వారే నిర్మించగలరు. మా సినిమాను మైత్రీవారు డిస్ట్రిబ్యూట్ చేయడం సంతోషంగా ఉంది. ● 'విరాజి'లోని నా పాత్ర లుక్, మేకోవర్‌ను కొత్తగా డిజైన్ చేశారు హర్ష. రెండు డిఫరెంట్ కలర్స్‌లో హెయిర్ స్టైల్, ముక్కుపుడక, ఓ స్నేక్ టాటూ... ఇలా ఆండీ కొత్తగా కనిపిస్తాడు. ఈ మేకోవర్ నాకు కాస్త చాలెంజింగ్‌గా అనిపించింది. హెయిర్ కలరింగ్ కోసం ఏడు గంటలు, ట్యాటూస్ కోసం దాదాపు గంట పట్టేది. ప్రతి రోజూ ఒక స్నేక్ ట్యాటూ వేసుకోవాల్సి వచ్చేది. 'విరాజి' సినిమా చూసి ఎమోషనల్ అయ్యాను. మంచి సినిమా చేశామనే కాన్ఫిడెన్స్‌తో ఉన్నాం. ● నాకు 18 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు 'హ్యాపీ డేస్' సినిమా చేశాను. 17 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నాను. ఓ నటుడిగా నా ప్రయాణంలో విమర్శలు సహజమని నాకు తెలుసు. కానీ నా భార్య వితిక కాస్త ఫైర్ బ్రాండ్. అందుకే నా లుక్ గురించి వచ్చిన నెగటివ్ కామెంట్స్‌పై ఆమె అలా స్పందించారు. వితికలాంటి భార్య దొరకడం నా లక్‌గా భావిస్తున్నాను. ప్రస్తుతం 'కానిస్టేబుల్' సినిమాలో నటిస్తున్నాను. 'రాచరికం' సినిమాలో పెద్ద మీసాలతో చిత్తూరు యాస మాట్లాడే వ్యక్తిగా డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపిస్తాను.



● ప్రియదర్శి

చాణక్య మాస్టారు

పిల్లలకు లెక్కలు చెప్పడానికి నీట్‌గా రెడీ అయి స్కూల్‌కి వెళ్లారు లెక్కల మాస్టారు చాణక్య వర్మ. ఒక విద్యార్థి హాయిగా నిద్రపోతుంటే గుర్రున చూశారు మాస్టారు. మరో ఇద్దరు బాలురు నేచురల్ కాల్ అంటూ చిటికెన వేలు చూపిస్తారు. ఇలా చదువు పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఈ విద్యార్థుల లెక్కలు ఎలా తేల్చాలా అన్నట్లు ముఖం పెడతారు మాస్టారు. చాణక్య వర్మగా ప్రియదర్శి నటించిన చిత్రం '35-చిన్న కథ కాదు'. గురువారం విడుదల చేసిన ఈ పాత్ర తాలూకు వీడియో గ్లింప్స్‌లో పైన చెప్పిన దృశ్యాలు కనిపించాయి. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో రూపొందిన చిత్రం '35-చిన్న కథ కాదు'. నంద కిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

నిర్మాతగా దర్శకుడు ముత్యాల సుబ్బయ్య



'అరుణ కిరణం, ఎర్ర మందారం, అమ్మాయి కాపురం' తదితర చిత్రాలతో దర్శకుడిగా ప్రశంసలు అందుకుని, ఆ తర్వాత చిరంజీవితో 'హిట్లర్, అన్నయ్య', వెంకటేశ్‌తో 'పవిత్రబంధం, పెళ్ళి చేసుకుందాం', బాలకృష్ణతో 'పవిత్రప్రేమ, కృష్ణబాబు' వంటి చిత్రాలతో మరింతగా పాపులర్ అయ్యారు దర్శకుడు ముత్యాల సుబ్బయ్య. దాదాపు యాభై చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు. 'ఆలయం' (2008) తర్వాత ఆయన దర్శకుడిగా మరో సినిమా చేయలేదు. కాగా ముత్యాల సుబ్బయ్య నిర్మాణరంగంలోకి అడుగుపెడుతున్నారు. సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై ఓ సినిమా నిర్మించనున్నారు. వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. ఈ నెల 9న ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభిస్తామని ముత్యాల సుబ్బయ్య తెలిపారు. రఘుబాబు, శుభలేఖ సుధాకర్, సాహిత్య, వైష్ణవి, దేవిప్రసాద్, ఆదర్శ్ బాలకృష్ణ తదితరులు నటించనున్న ఈ చిత్రానికి కథా విస్తరణ: ముత్యాల సుబ్బయ్య, మరుధూరి రాజా, సంగీతం: కోటి, కెమెరా: ఎస్. సుధాకర్ రెడ్డి.

మెడికో థ్రిల్లర్‌లో...



● అశ్విన్

అశ్విన్‌బాబు హీరోగా ఓ మెడికో థ్రిల్లర్ మూవీ రూపొందుతోంది. అగస్ట్ 1న అశ్విన్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రంలోని తన స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వంలో అరుణశ్రీ ఎంటర్ టైన్మెంట్స్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా ఈ చిత్రాన్ని టి. గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. "ఇప్పటివరకూ హైదరాబాద్, వైజాగ్, కొడైకెనాల్‌లో జరిపిన షూటింగ్‌తో 75 శాతం సినిమా పూర్తయింది. అన్ని వర్గాలవారినీ ఆకట్టుకునేలా ఈ మూవీని రూపొందిస్తున్నాం. ఈ సంవత్సరం చివరిలో సినిమాని రిలీజ్ చేస్తాం" అని చిత్రబృందం పేర్కొంది. అశ్విన్‌బాబుకి జోడీగా రియా సుమన్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గౌర హరి, కెమెరా: ఎం. ఎస్ బాల్ రెడ్డి.

విజిల్స్ వేస్తూ చూడాలి

– పవన్ కుమార్



పవన్ కుమార్ కొత్తూరి స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాల్వియ, సాహిబా బాసిన్ హీరోయిన్లుగా నటించారు. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ – "ఇది స్టూడెంట్ లైఫ్ స్టోరీ. కథ ప్రకారం హీరో డీ-గ్లామరస్‌గా ఉండాలని ముందే ఫిక్స్ అయ్యా. నేను షార్ట్ ఫిల్మ్స్ చేసే సమయంలో హీరో, డైరెక్షన్... ఇలా అని క్రాఫ్ట్స్‌ను హ్యాండిల్ చేశాను. కానీ ఫీచర్ ఫిల్మ్ విషయంలో మల్టీపుల్ డిపార్ట్మెంట్స్‌ని హ్యాండిల్ చేయడం కష్టం అనిపించింది. ఇది థియేటర్స్‌లో విజిల్స్ వేస్తూ చూడాల్సిన సినిమా" అన్నారు.

గద్దర్ అవార్డ్స్‌కు టీఎఫ్‌సీసీ సహకారం ఉంటుంది

– ప్రతాని రామకృష్ణ గౌడ్


"ప్రభుత్వం అవార్డ్స్ ఇచ్చి కొన్నేళ్లయిన నేపథ్యంలో ఇప్పుడు చిత్ర పరిశ్రమలోని అన్ని విభాగాలకు ప్రజా గాయకుడు, నాయకుడు గద్దర్ పేరిట అవార్డు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం గొప్ప విషయం. మా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) తరఫున ఈ అవార్డు వేడుకకు పూర్తి సహకారం ఉంటుంది" అని టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "గద్దర్ అవార్డ్స్ ఇవ్వాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిగారికి సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారికి మా ధన్యవాదాలు" అంటూ టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు జేవియర్, గురురాజ్, కార్యదర్శి సాగర్, సలహాదారు ఏయం రత్నం ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమోషన్స్‌కు కనెక్ట్ అవుతారు

– కృష్ణవంశీ



కృష్ణవంశీ, మోక్ష హీరో హీరోయిన్లుగా చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వంలో హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. నేడు ఈ సినిమా విడుదలవుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ ఈ మూవీని రిలీజ్ చేస్తోంది. గురువారం విలేకర్ల సమావేశంలో కృష్ణవంశీ మాట్లాడుతూ– "నాకు సినిమాలంటే ఆసక్తి. కాలేజీలో ఓ షార్ట్‌ఫిల్మ్‌లో కూడా నటించాను. ఇంజనీరింగ్ పూర్తయ్యాక క్యాంపస్‌లో ఉద్యోగం వస్తే కొంతకాలం చేశాను. కానీ సినిమాలపై ఆసక్తితో కోవిడ్ సమయంలో వైజాగ్‌లో సత్యానంద్‌గారి దగ్గర యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఆకాశ్‌గారు పరిచయం అయ్యారు. ఆయన 'అలనాటి రామచంద్రుడు'కి ఆడిషన్ చేసి, నన్ను తీసుకున్నారు. ఈ చిత్రంలో నేను ఇంట్రోవర్ట్‌గా ఉండే సిద్ధు పాత్ర చేశాను. ఏ మూవీలో అయినా ఎమోషన్స్ ఉంటే ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఈ సినిమాలో తండ్రి-కూతురు, తల్లి-కొడుకుల అనుబంధం నేపథ్యంలో మంచి ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. మా సినిమాని సపోర్ట్ చేస్తున్న 'దిల్' రాజుగారికి థ్యాంక్స్" అన్నారు.


‘సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 132


శుక్రవారం 2-8-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నిఫ్టీ @ 25,000



దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఓ మరపురాని అద్భుతం చోటు చేసుకుంది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ ఎన్ఎస్ఈ తొలిసారి 25,000 పాయింట్ల శిఖరాన్ని అధిరోహించింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. - 15లో



ఉత్తరభారతంపై వరుణాగ్రహం

ఉత్తరాదిపై వరుణుడు ప్రకోపం చూపించాడు. ఉత్తరాఖండ్ మొదలు రాజస్తాన్‌దాకా ఉత్తర భారత రాష్ట్రాల్లో ఎడతెగని వానలు పడ్డాయి. - వివరాలు 6లో



ఆగని మరణ మృదంగం

కేరళలో ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య 289కి పెరిగింది. - వివరాలు 6లో



పేపర్ లీకేజీ.. వాటర్ లీకేజీ

ప్రశ్నపత్రాల లీకేజీలను పార్లమెంటులో వాటర్ లీకేజీతో ముడిపెడుతూ విపక్షాలు భవన నిర్మాణ పటిష్టతను ఎత్తిచూపాయి. - వివరాలు 6లో



ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష యుద్ధమే!

హమాస్ అగ్రనేత హనియేను పొట్టన పెట్టుకున్న ఇజ్రాయెల్ దుశ్చర్య పట్ల ఇరాన్ నాయకుడు ఖమేనీ ఆగ్రహంతో రగిలిపోతున్నారు. - వివరాలు 6లో

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు

సుప్రీం గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రాలు ఈ రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయొచ్చు ● రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు


- అంతర్గత వివక్ష కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలు అభివృద్ధి చెందలేకపోతున్నాయి
- వీటిలో ఉప వర్గాల ఏర్పాటుకు ఆర్టికల్ 14 అనుమతిస్తోంది
- ఈ మేరకు ఉప వర్గీకరణ చేసుకునేందుకు రాష్ట్రాలకు అనుమతిస్తున్నాం
- ఒకే సబ్‌క్లాస్‌కు మొత్తం రిజర్వేషన్‌ను కేటాయించకూడదు
- ఏయే సబ్‌క్లాస్‌లకు రిజర్వేషన్ ఫలాలు అందడం లేదన్న డేటా ఆధారంగా వర్గీకరణ చేయాలని సూచన
- 2004 నాటి ‘ఈవీ చిన్నయ్య’ కేసులోని తీర్పును పక్కనపెట్టిన ధర్మాసనం
- ఏడుగురు జడ్జీలలో ఆరుగురు అనుకూలంగా.. ఒకరు వ్యతిరేకంగా తీర్పు
- రాష్ట్రాలు తగిన మార్గదర్శకాలు రూపొందించుకోవచ్చని సూచన

16లో

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలు చేయాలన్న జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ

రిజర్వేషన్లు ఒక్క తరానికే పరిమితం చేయాలన్న జస్టిస్ పంకజ్ మిత్తల్

రాష్ట్రాలకు ఉప వర్గీకరణ చేసేందుకు అర్హత లేదన్న జస్టిస్ బేలా ఎం.త్రివేది



➤ ‘‘ఎస్సీ, ఎస్టీ వర్గాలు అంతర్గత వివక్ష కారణంగా అభివృద్ధి చెందలేకపోతున్నాయి. అందుకే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసుకోవడానికి రాష్ట్రాలకు అనుమతి ఇస్తున్నాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కూడా ఒక వర్గంలో ఉప వర్గాలను ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తోంది. ఈ క్రమంలో 2004 నాటి ఈవీ చిన్నయ్య కేసులోని తీర్పును వ్యతిరేకిస్తున్నాం. అయితే ఉప వర్గీకరణ సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఏదో ఒక సబ్‌క్లాస్‌కు మొత్తం రిజర్వేషన్‌ను కేటాయించకూడదు. అంతేగాకుండా ఏయే ఉప వర్గాలు రిజర్వేషన్ ఫలాలు అందుకోలేక పోతున్నాయన్న డేటా ఆధారంగా వర్గీకరణ జరగాలి’’

- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పు రాష్ట్రాలకే పరిమితం!

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలకు వర్తించదంటున్న నిపుణులు

వర్గీకరణ అమల్లో ముందుంటాం అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటన

బీఆర్ఎస్ మనఃస్ఫూర్తిగా స్వాగతిస్తోంది: హరీశ్‌రావు

- వివరాలు 11లో

మోదీ పలుమార్లు మద్దతు పలికారు: ఈటల రాజేందర్

సుప్రీం తీర్పుతో రిజర్వేషన్లకు భంగం: చెన్నయ్య

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

ప్రతి కులానికి రిజర్వేషన్ ఫలం



ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దశాబ్దాల కల నెరవేరిందని ఆయా వర్గాల నేతలు చెబుతుండగా.. వాస్తవంగా ఏమేరకు లబ్ధి జరుగుతుందనే చర్చ మరోవైపు మొదలైంది.

- వివరాలు 12లో

కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉన్నారు



‘అసెంబ్లీలో పాతమిత్రులు కనిపిస్తే వెళ్లి మాట్లాడినంత మాత్రాన పార్టీ మారినట్లు మీడియా రాయడం సరైంది కాదు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు’ అని మంత్రి జూపల్లి అన్నారు.

- వివరాలు 3లో

వృద్ధురాలిని పీక్కుతిన్న కుక్కలగుంపు



వీధికుక్కలు బాలుడిని చంపిన ఘటన మరువకముందే మరో దారుణం చోటు చేసుకుంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో అచేతన స్థితిలో అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధురాలిపై కుక్కలు దాడి చేసి ప్రాణాలు తీశాయి.

- వివరాలు 5లో

రూ.4.27 కోట్ల విలువైన ఆభరణాలు.. కోటి నగదు



ఏపీ మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మనీలాండరింగ్ కేసులో భాగంగా జరిపిన సోదాల్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు పట్టుబడినట్టు ఈడీ అధికారులు తెలిపారు.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



సహాయక చర్యలు ముందు ఇక్కడి నుండే ప్రారంభించాలి సార్!

మళ్లీ అట్టుడికిన అసెంబ్లీ

రేవంత్‌రెడ్డి క్షమాపణ కోసం పట్టుబట్టిన విపక్షం

నల్లబ్యాడ్జీలతో నిరసన.. స్పీకర్ పోడియం వద్ద బైఠాయింపు

- సభ కొనసాగినంత సేపూ నిలబడే ఉన్న సబిత, సునీత
- గందరగోళం మధ్యే సభ నడిపించిన స్పీకర్
- మాట్లాడనివ్వండి లేదా సస్పెండ్ చేయండి.. రూల్ పొజిషన్ లేవనెత్తిన అక్బర్
- సభ ముగిశాక సీఎం చాంబర్ ఎదుట ధర్నాకు దిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- మార్షల్స్‌తో అసెంబ్లీ బయటికి తరలింపు
- అక్కడా బైఠాయించడంతో బలవంతంగా తెలంగాణ భవన్‌కు తీసుకెళ్లిన పోలీసులు



అసెంబ్లీ నుంచి కేటీఆర్‌ను బయటకు తీసుకెళ్తున్న మార్షల్స్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం కూడా శాసనసభ అట్టుడికింది. బీఆర్ఎస్ సభ్యులు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పదేపదే స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. అక్కడే బైఠాయించారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి ఇద్దరూ అసెంబ్లీ కొనసాగినంత సేపూ తమ సీట్ల వద్ద నిలబడే ఉండి నిరసన వ్యక్తం చేశారు. తమకు మాట్లాడే అవకాశమివ్వాలని స్పీకర్‌ను కోరారు. ప్రతిపక్షం నిరసనను అధికార పక్షం పట్టించుకోలేదు. గందరగోళం మధ్యే కీలకమైన స్కిల్ వర్సిటీ బిల్లును ప్రవేశపెట్టి, చర్చ చేపట్టారు. సభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు సభ నిర్వహణకు సహకరించాలంటూ పలుమార్లు బీఆర్ఎస్ సభ్యులను కోరారు.

నల్లబ్యాడ్జీలతో వచ్చి..

గురువారం బీఆర్ఎస్ సభ్యులంతా నల్లబ్యాడ్జీలతో శాసనసభకు వచ్చారు. సభ ప్రారంభం కాగానే సబితను ఉద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టారు. సబితకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని వారు కోరినా స్పీకర్ అనుమతించలేదు. అదే సమయంలో స్కిల్స్ యూనివర్సిటీ బిల్లును ప్రవేశపెట్టాలని మంత్రికి స్పీకర్ సూచించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేస్తూ.. స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారు. ‘సీఎం డౌన్ డౌన్.. సీఎం అహంకార పూరిత వైఖరి నశించాలి’ అంటూ నినాదాలు చేశారు. సభ గందరగోళంగా ఉండగానే.. సీఎం రేవంత్ ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణపై ప్రకటన చేశారు. ఆ సమయంలో కాసేపు శాంతించిన విపక్ష సభ్యులు తర్వాత మళ్లీ నిరసన మొదలుపెట్టారు.

గందరగోళం మధ్య చర్చ ఎలా?: అక్బరుద్దీన్

సభలో గందరగోళం కొనసాగుతున్న సమయంలో ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ జోక్యం చేసుకున్నారు. సభలో ఎవరిపై అయినా వ్యాఖ్యలు చేసినప్పుడు.. స్పష్టత ఇచ్చే

మిగతా 2వ పేజీలో ▶

సీఎం కుర్చీ విలువను తగ్గించారు

- రేవంత్‌పై బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ధ్వజం
- గతంలో మహిళా సభ్యులు అడిగితే సీఎంలు స్పందించేవారు
- ప్రస్తుతం సీఎం మైక్ ఇచ్చేందుకు భయపడుతున్నారు
- టీడీపీ రేవంత్ సీఎం పదవి లాక్కున్నా భట్టికి బాధ లేదు

2లో

ఉద్యమ స్ఫూర్తితో ఉపాధి



మీర్‌ఖాన్‌పేటలో ‘యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ’కి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి

- స్కిల్స్ వర్సిటీలో అడ్మిషన్ పొందితే ఉద్యోగం గ్యారంటీ: సీఎం రేవంత్
- నాలుగేళ్లలో న్యూయార్క్ కంటే మెరుగైన నగరంగా బేగరికంచె
- హెల్త్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హాస్పిటాలిటీ టూరిజం అభివృద్ధి
- ప్రపంచ స్థాయి వర్సిటీలు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు తెస్తాం
- మీర్‌ఖాన్‌పేటలో ‘యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ’కి సీఎం శంకుస్థాపన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ స్ఫూర్తితో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోతున్న వర్సిటీలో ప్రవేశం పొందిన ప్రతి ఒక్కరికీ గ్యారంటీగా ఉపాధి లభిస్తుందని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో 57 ఎకరాల విస్తీర్ణంలో రూ.150 కోట్లతో

మిగతా 3వ పేజీలో ▶

గురువారం సుప్రీంకోర్టు వద్ద మంద కృష్ణమాదిగ. చిత్రంలో రఘునందన్




అడ్డంకులు అధిగమించాం.. విజయం సాధించాం

- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం
- ఈ తీర్పు ఎమ్మార్పీఎస్ కార్యకర్తల పోరాట ఫలితమే
- ‘సాక్షి’తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

- వివరాలు 11లో

స్వప్నం సాకారం



ఒలింపిక్స్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో స్వప్నిల్‌కు కాంస్య పతకం

● పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం లభించింది. మూడో పతకం కూడా షూటింగ్ క్రీడాంశంలోనే రావడం విశేషం. గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో స్వప్నిల్ కుసాలే మూడో స్థానంలో నిలిచి భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. ఫైనల్లో స్వప్నిల్ 451.4 పాయింట్లు స్కోరు చేశాడు. స్వప్నిల్ పతకంతో ఒకే ఒలింపిక్స్‌లో ఒకే క్రీడాంశంలో భారత్‌కు తొలిసారి మూడు పతకాలు లభించాయి. మరోవైపు కచ్చితంగా పతకాలు సాధిస్తారనుకున్న బ్యాడ్మింటన్ స్టార్స్ పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ... మేటి బాక్సర్ నిఖత్ జరీన్ అనూహ్యంగా ఓడిపోయి పారిస్ ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించారు.

- వివరాలు 14లో

నేడే జాబ్ కేలెండర్

- అసెంబ్లీలో ప్రకటించనున్న సర్కార్
- ఏటా యూపీఎస్సీ తరహాలో కేలండర్ తేదీల ప్రకారం ఉద్యోగ ప్రకటనలు
- గ్రూప్–1, 2, 3 నోటిఫికేషన్లకు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వర్తింపజేసేలా త్వరలో ఆర్డినెన్స్
- అర్హులకు రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు
- విధివిధానాల ఖరారుకు ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమేర్ అలీఖాన్ పేర్లు మళ్లీ ప్రతిపాదన
- సిరాజ్, నిఖత్‌కు గ్రూప్–1 జాబ్స్.. 600 గజాల చొప్పున స్థలం
- కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు..



కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నిరుద్యోగులంతా ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న జాబ్ కేలెండర్ మరికొన్ని గంటల్లో వెలువడనుంది. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం శాసనసభ వేదికగా జాబ్ కేలెండర్‌ను ప్రకటించనుంది. ఇకపై ఏటా యూపీఎస్సీ తరహాలో ప్రణాళికాబద్ధంగా తేదీలవారీగా ఉద్యోగ నియామకాల ప్రకటనలు జారీ చేయనుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో జాబ్ కేలెండర్‌ను ప్రకటించనున్నారు. సీఎం రేవంత్ అధ్యక్షతన గురువారం సాయంత్రం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో జాబ్ కేలండర్ సహా కొత్త రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీ, మూసీ నది ప్రక్షాళన, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం తదితర అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరాలను వెల్లడించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన జాబ్ కేలండర్‌కు చట్టబద్ధత కల్పించడానికి శాసనసభలో ప్రకటిస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఈ అంశంపై చర్చలో ప్రతిపక్షాలు చేసే సూచనలను పరిగణనలోకి తీసుకొని తగిన మార్పులు చేసేందు కు సిద్ధమన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు జారీ చేసిన తీర్పును ఇప్పటికే ప్రకటించిన గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 నోటిఫికేషన్లకు వర్తింపజేసేందుకు త్వరలో ఆర్డినెన్స్ తీసుకురావాలని సీఎం నిర్ణయించినట్లు చెప్పారు.

త్వరలో తెల్లరేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు

ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ మేరకు త్వరలో అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ

మిగతా 5వ పేజీలో ▶

ముంబై, ఢిల్లీ సరసన హైదరాబాద్!



శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాల విలీనం దిశగా సర్కారు అడుగులు

- మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, సీతక్కతో కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం
- వీలైనంత త్వరగా నివేదిక సమర్పించనున్న కమిటీ
- ఈ ప్రక్రియ పూర్తయితే దేశంలో మరో పెద్ద నగరంగా ఆవిర్భవించనున్న హైదరాబాద్

జీహెచ్ఎంసీలో ఉన్న ఉప్పల్ పక్కనే పీర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్లు.. వాటి పక్కనే కొర్రెముల గ్రామ పంచాయతీ... ఆ తరువాత పోచారం మున్సిపాలిటీ. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పరిస్థితి ఇది. ఒక దగ్గర 60 ఫీట్ల రోడ్డు ఉంటే ఆ వెంటనే 40 ఫీట్ల రోడ్డు, డ్రైనేజీ.. ఆయా రోడ్లలో వరదనీటి కాలువల అనుసంధానమే లేదు. వివిధ సంస్థలు చేపట్టే పనులకు పొంతన ఉండట్లేదు. అందుకే ఔటర్ రింగురోడ్డు లోపల ఉన్న అర్బన్ పరిధిని ఒకే సంస్థ పరిధిలోకి తేవాలని నిర్ణయించాం.

- ఇటీవల మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ముంబై, ఢిల్లీ వంటి అతిపెద్ద నగరాల సరసన హైదరాబాద్ చేరబోతోంది. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) లోపల ఉన్న ప్రాంతాన్ని ఒకే గొడుగు కిందకు తేవాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. జీహెచ్ఎంసీని

మిగతా 5వ పేజీలో ▶

అక్కలను అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ రాజకీయం

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మండిపాటు

- మీరు నమ్ముకున్న వ్యక్తి సొంత చెల్లెలే తిహార్ జైలులో ఉన్నారు
- సొంత చెల్లెల్ని జైల్లో పెట్టినా ఢిల్లీ వెళ్లి రాజకీయ ఒప్పందం చేసుకున్న నీచులు
- సీతక్కను అవమానించేలా మీమ్స్ పెట్టిన వారిని చెప్పుతో కొట్టాలి
- అక్కా.. మీరు వాళ్ల ఉచ్చులో పడొద్దంటూ సబితను ఉద్దేశించి వ్యాఖ్య
- హరీశ్‌రావుకు మంత్రి పదవి ఇచ్చింది నాటి సీఎం వైఎస్సార్ అని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీపై చర్చ జరగకూడదని బీఆర్ ఎస్ నేతలు అక్కలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని, కావాలనే సభను స్తంభింపజేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను తాను సొంత అక్కలుగానే భావించానని.. కానీ వారు దొర పన్నిన కుట్రలో బందీ అయ్యారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలకు రాజకీయ ప్రయోజనమే తప్ప.. ప్రజల ప్రయోజనం పట్టదని మండిపడ్డారు. గురువారం అసెంబ్లీలో సీఎం రేవంత్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను నేను సొంత అక్కలుగానే భావించా. ఒక అక్క నన్ను నడిబజారులో వదిలేసింది. ఇంకొక అక్క కోసం ఎన్నికల ప్రచారానికి వెళ్లి.. అప్పుడు నమోదైన కేసుల్లో ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాను. తన కోసం ప్రచారానికి వచ్చిన తమ్ముడిపై కేసులు ఎత్తివేయాలని ఆమె ఎప్పుడైనా చెప్పారా? నన్ను నమ్ముకున్న సీతక్క, సురేఖ అక్క ఇద్దరూ మంత్రులై ముందు వరుసలో ఉన్నారు.

సొంత చెల్లెల్ని జైల్లో పెట్టినా రాజకీయాలు



బీఆర్ఎస్ వాళ్లు సోషల్ మీడియాలో సీతక్కను అవమానించేలా మీమ్స్ పెడుతున్నారు. ఆ మీమ్స్‌ను ఇక్కడ చూపిస్తే సభా గౌరవం పోతుంది. అలా మీమ్స్ పెట్టిన వాళ్లను చెప్పుతో కొట్టాలి. వారు ఆదివాసీ ఆడబిడ్డను అవమానించినట్టు కాదా? సొంత చెల్లెల్ని జైల్లో పెట్టినా.. ఢిల్లీ వెళ్లి రాజకీయాలు చేస్తున్న నీచులు వారు. సొంత చెల్లెల్ని ఏడాదిపాటు జైల్లో ఉంచినా ఫర్వాలేదు. మా జోలికి రాకండి అన్నవిధంగా వారి వ్యవహారశైలి ఉంది. మైక్ ఇస్తే శాపనార్థాలు.. ఇవ్వకపోతే పోడియం దగ్గర నిరసనలు చేస్తున్నారు. నా చెల్లెలు జైల్లో ఉంటే నేను రాజకీయాల కోసం బజార్‌లో తిరిగే వాడిని కాదు. నేను అక్కను అవమానించే నీతిలేని వాడిని కాదు. దొర పన్నిన కుట్రతో మా అక్కలు బందీ అయ్యారు. అక్కా మీరు వాళ్ల ఉచ్చులో పడొద్దు.

కేసీఆర్ చర్చలో పాల్గొంటే బాగుండేది..

ఎస్సీ వర్గీకరణపై అందరూ పండుగ చేసుకుంటుంటే.. బీఆర్ఎస్ వాళ్లకు అదేమీ పట్టడం లేదు. దేవతలు యజ్ఞాలు చేస్తుంటే.. రాక్షసులు భగ్నం చేయడానికి వచ్చినట్టుగా బీఆర్ఎస్ నేతల వైఖరి ఉంది. దళిత బిడ్డలు సంతోషపడే రోజు వస్తే నిలబడాల్సిన అవసరం ఉంది. కానీ ప్రధాన ప్రతిపక్షం వాకౌట్ చేసి వెళ్లిపోయింది. వాళ్లకు దేవుడు జ్ఞానం ప్రసాదించాలని కోరుకుంటున్నా. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అందరి అభిప్రాయాలు తీసుకోవాలి. కేసీఆర్ కూడా దీనిపై మాట్లాడితే బాగుండేది. ఇంత కీలక అంశం సభలో చర్చకు వస్తున్నప్పుడు స్వయంగా కేసీఆర్ చర్చలో పాల్గొంటే బాగుండేది. స్పీకర్ దళితుడు కాబట్టే ఆయన ముందు కింద కూర్చోకూడదనే కేసీఆర్ సభకు రావడం లేదు..''అని రేవంత్ పేర్కొన్నారు. అసలు కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీయే రాజకీయ భిక్ష పెట్టిందన్నారు. హరీశ్‌రావుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రి పదవి ఇచ్చారని పేర్కొన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ భూమిపూజకు అందరూ రావాల్సిందిగా రేవంత్ కోరారు.

మరో ఏడాదిలోగా మాస్టర్ ప్లాన్ 2050

రీ ఇమాజినింగ్ హైదరాబాద్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మరో ఏడాదిలోగా మాస్టర్ ప్లాన్ 2050 అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గురువారం క్రెడాయ్ అధ్వర్యంలో జరిగిన రీ ఇమాజినింగ్ హైదరాబాద్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా చారిత్రక హైదరాబాద్ నగర అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలను పాలకులంతా కొనసాగించారని.. అందుకే ప్రపంచంలోనే హైదరాబాద్ నగరానికి గుర్తింపు వచ్చిందన్నారు. అలాగే హైదరాబాద్ 4.0 అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. స్కిల్స్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసిన ప్రాంతమైన బ్యాగరి కంచె పేరును పలకడానికి కొందరు ఇబ్బంది పడొచ్చని... కానీ ఒకప్పుడు బంజారా హిల్స్‌ను కూడా అలాగే అనుకొనేవారని పేర్కొన్నారు. మరో నాలుగైదేళ్లలో బ్యాగరి కంచె గురించి గొప్పగా చెప్పుకొనే స్థాయికి అభివృద్ధి చేస్తామన్నారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్‌తో ఇక పెట్టుబడులంటే హైదరాబాద్ గుర్తొచ్చేలా చేస్తామని రేవంత్ ప్రకటించారు. సర్ఫేస్, ఎలివేటెడ్ కారిడార్‌లతో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని, మూసీలో కలుషితం లేని నీటి ప్రవాహం ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. బిల్డర్లు రాజకీయ నాయకులుగా మారితే వారిని ప్రత్యర్థులుగానే చూడాల్సి వస్తుందని.. వ్యాపారాలు మాత్రమే చేస్తే ప్రభుత్వం వారికి సహకరిస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మినోగైన్ మందులు వాడొద్దు


డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మినోగైన్ పేరిట మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఉత్పత్తులు నకిలీగా గుర్తించామని, వాటిని వినియోగించవద్దని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో www.minogain.in పోర్టల్ మినోగైన్ టాపికల్ సొల్యూషన్, మినోగైన్ షాంపో, మినోగైన్ మినోక్సిడిల్ 5% టాపికల్ అరెసోల్, మినోగైన్ బయోటిన్ 10,000 ఎంసీజీ ట్యాబ్లెట్లు విక్రయిస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. రిటైలర్లు, హోల్ సేలర్లు ఈ మందులను విక్రయించడం ఆపివేయాలని ఆదేశించారు. మార్కెట్‌లోకి నకిలీ మందులు రాకుండా డీసీఏ అధికారులు తగిన చర్యలు తీసుకుంటునట్టు వెల్లడించారు. నకిలీ మందుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు సంబంధించిన సమా చారం తెలిస్తే డీసీఏ టోల్‌ఫ్రీ నంబర్ 1800–599–6969లో ఫిర్యాదు చేయాలని కమలాసన్‌రెడ్డి సూచించారు.

5 నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం'

రోజుకు ఓ కార్యక్రమం చొప్పున ఐదురోజుల షెడ్యూల్ ఖరారు



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 5 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛదనం- పచ్చదనం పేరును స్వయంగా పంచాయతీరాజ్, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క ఖరారు చేశారు. ఈ పేరు చాలా బాగుందని, దీనిని రూపొందించిన సీతక్కను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంతో పల్లెల్లో పట్టణాల్లో పరిశుభ్రతను, పచ్చదనాన్ని పెంచేలా చర్యలు చేపడుతున్నట్టు సీతక్క ఓ ప్రకటనలో తెలిపారు. 5న ఈ కార్యక్రమం ప్రారంభోత్సవ సందర్భంగా...స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాలు (ఎస్ హెచ్‌జీలు), యువత, వార్డు కమిటీ సభ్యు లతో సమావేశాన్ని నిర్వహించి, ఆపై ర్యాలీ చేపట్టాలని సూచించారు.అన్ని ప్రభుత్వ సంస్థలు, స్కూళ్లు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్టాప్‌లు మొదలైన వాటిని శుభ్రపరచడం వంటివి చేపట్టనున్నట్టు తెలియ జేశారు. గ్రామీణ ప్రాంతాల్లో టాయిలెట్స్ లేని చోట్ల గ్రౌండింగ్ పనులు 15 రోజుల్లో చేపట్టాలని సూచించారు. ఇక 6న తాగునీరు/ వర్షపు నీటి సంరక్షణ, 7న కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలు/ గుంతలు పూడ్చటం, 8న కుక్కల బెడద నివారణకు చర్యలతో పాటు ప్రజారోగ్యంపై శ్రద్ధ, 9న ప్రభుత్వ సంస్థలు/ప్రభుత్వ స్థలాలను శుభ్రపరచడం ఫ్రైడేను డ్రైడేగా అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలు పాటించేలా కార్యక్రమం ఉంటుందన్నారు. దీంతో పాటు వనమహోత్సవం కింద గుర్తించిన గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలలోని అన్ని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని మంత్రి సీతక్క సూచించారు.

నైపుణ్య శిక్షణకు స్కిల్స్ వర్సిటీ

ఈ ఏడాది తొలిసారిగా ఆరు కోర్సులు ప్రారంభం

- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గాంధీ స్ఫూర్తితో 'యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ'గా పేరు పెట్టాం
- లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం
- స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుకు శాసనసభ ఆమోదం



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: వృత్తి నైపుణ్యాలు లేకపోవడంతో ఉద్యోగాలు రాక దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నైపుణ్యం లేక గల్ఫ్ దేశాలకు వెళ్లడం వల్ల కష్టాలపాలు అవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో వర్సిటీకి ఈ పేరు పెట్టామని చెప్పారు. లక్షలాదిమంది యువతకు ఉపాధి కల్పించడమే ఈ వర్సిటీ లక్ష్యమని పేర్కొన్నారు. నైపుణ్య యూనివర్సిటీలో మొత్తం 17 కోర్సులుంటాయని, తొలి ఏడాది ఆరు కోర్సులతో ప్రారంభిస్తున్నామని, 2 వేల మందికి ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. గురువారం శాసనసభలో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ' బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. తర్వాత జరిగిన చర్చలో సీఎంతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.

57 ఎకరాల్లో పీపీపీ పద్ధతిలో..

'ముచ్చర్లలో 57 ఎకరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. వచ్చే ఏడాది నుంచి అక్కడ తరగతులు ప్రారంభిస్తాం. అప్పటివరకు సమయం వృథా కాకుండా ఈ ఏడాదే గచ్చిబౌలి ప్రాంతంలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో ఆరు కోర్సులు ప్రారంభిస్తాం. స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ అండ్ లైఫ్ సైన్సెస్, ఇ-కామర్స్ అండ్ లాజిస్టిక్స్, స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్.. ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్, స్కూల్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంటీరియర్స్, స్కూల్ ఆఫ్ రిటైల్ ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్, యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్ గేమింగ్ అండ్ కామిక్స్ కోర్సులు ప్రారంభిస్తాం. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు ఆయా పరిశ్రమల ప్రతినిధులే శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత ఉద్యోగాలు కూడా కల్పిస్తారు. ఈ మేరకు దేశంలోని ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయి. రెడ్డీస్ ల్యాబ్స్ ఫార్మాస్యూటికల్ వైపు, బ్యాంకింగ్ విషయంలో ఎస్‌బీఐ, కన్‌స్ట్రక్షన్ అండ్ ఇంటీరియర్స్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, రిటైల్ ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రిటైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, వీఎఫ్ఎక్స్ అసోసియేషన్ వారు ముందుకొచ్చారు..' అని సీఎం వివరించారు.

ఏడాదికి రూ.50 వేలు ఫీజు

'ఏడాదికి రూ.50 వేలు నామమాత్రపు ఫీజుతో శిక్షణ అందిస్తాం. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తాం. హాస్టల్ వసతి కల్పిస్తాం. భవిష్యత్తులో జిల్లాల్లోనూ వర్సిటీ పరిధిలో కాలేజీలు ఏర్పాటు చేస్తాం. యూనివర్సిటీలో 3 నెలల నుంచి 6 నెలలు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తారు. అలాగే రెండు మూడేళ్ల డిప్లొమా కోర్సులు కూడా అందిస్తాం. డిగ్రీ పట్టాలు కూడా ఇస్తారు. తర్వాత వాళ్లు పీజీ, పీహెచ్‌డీ కూడా చేసుకోవచ్చు. యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ప్రముఖ వ్యాపారవేత్తను చైర్మన్‌గా, చాన్స్‌లర్‌గా, ప్రసిద్ధిగాంచిన వారిని వైస్ చాన్స్‌లర్లుగా నియమించాలని భావిస్తున్నాం. స్కిల్స్ యూనివర్సిటీపై ప్రధాన ప్రతిపక్ష నాయకులు కేసీఆర్ వచ్చి సూచనలు ఇస్తే సంతోషించేవాళ్లం. కానీ ఆయన సభకు రాలేదు. అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా. వచ్చిన వారు వాకౌట్ చేసి వెళ్లిపోయారు..' అని రేవంత్ విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్‌లు దేశ పురోభివృద్ధికి చేసిన కృషిని ముఖ్యమంత్రి వివరించారు. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు హైటెక్ సిటీకి పునాదులు వేశారని, ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలకు ప్రస్తుతం మనవారే సీఈవోలుగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు సైతం డ్రగ్స్, గంజాయికి బానిసలవుతున్నారని, వారిని వాటి నుంచి బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.

వర్గీకరణపై నిర్ణయానికి ప్రత్యేకంగా అసెంబ్లీ

ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేసి రిజర్వేషన్ల వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. వర్గీకరణ కోసం తరాలకు తరాలు నిరీక్షించాయని చెప్పారు. వారికీరోజు శుభదినమని పేర్కొన్నారు. దళిత బిడ్డలు ఓట్లేస్తేనే మా అక్కలు గెలిచారన్నారు.

సెట్విన్, ఐటీఐలను మూసేస్తారా: ఒవైసీ

'స్కిల్స్ వర్సిటీ రావడం వల్ల ఇప్పటికే ఉన్న సెట్విన్, ఐటీఐ, యూత్ సర్వీసెస్ వంటి వాటికి ఇబ్బందులు రావా..? వాటిని మూసేస్తారా?' అని మజ్లిస్ పక్ష నేత అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. తాము స్కిల్స్ యూనివర్సిటీకి వ్యతిరేకం కాదని, కానీ ఇప్పటికే ఉన్న వాటి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వర్సిటీ సెలెక్ట్ కమిటీలో మైనారిటీలకు కూడా అవకాశం ఉండాలన్నారు. కాగా సీఎం బదులిస్తూ.. ఐటీఐ, సెట్విన్ వంటి వాటిని మూసివేయబోమని చెప్పారు.

జిల్లాలకు విస్తరించాలి

నైపుణ్య విశ్వవిద్యాలయ సేవలను జిల్లా కేంద్రాలకు విస్తరించాల్సిన అవసరం ఉందని బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే నైపుణ్య శిక్షణ కార్యకలాపాలు సాగుతున్నాయని తెలిపారు. నిరుద్యోగుల విషయంలో ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు నిదర్శనమని కాంగ్రెస్ సభ్యుడు యెన్నం శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఈ వర్సిటీకి గవర్నర్ వైస్ చాన్స్‌లర్‌గా ఉండేలా చూడాలని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ కోరారు.

వాయిదా తీర్మానాల తిరస్కరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దేవాలయ భూముల కబ్జా, పురాతన దేవాలయాల నిరాదరణపై బీజేపీ సభ్యుడు హరీశ్‌బాబు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తిరస్కరించారు. అలాగే టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటం, ఆర్టీసీలో కార్మిక సంఘాల పునరుద్ధరణ, 2017 ఆర్టీసీ వేతన సవరణకు సంబంధించిన బాండ్ల బకాయిల చెల్లింపులపై కూనంనేని సాంబశివరావు ప్రతిపాదించిన వాయిదా తీర్మానాలను కూడా తిరస్కరించినట్టు స్పీకర్ ప్రకటించారు.

నైపుణ్య అంతరాన్ని తగ్గించేందుకే: శ్రీధర్‌బాబు



విద్య, ఉపాధి మధ్య ఉన్న నైపుణ్య అంతరాన్ని భర్తీ చేయడానికి స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచి, ఉపాధిలో అంతర్జాతీయంగా పోటీ పడేలా చేయడమే దీని ముఖ్యోద్దేశమన్నారు. దేశంలోని పలు యూనివర్సిటీల ఏర్పాటును అధ్యయనం చేసిన తర్వాతే బిల్లును రూపొందించినట్టు తెలిపారు. జర్మనీ, దక్షిణ కొరియా, చైనా, సింగపూర్ వంటి దేశాలు తమ విద్యా వ్యవస్థతో వృత్తి విద్యలను ఎలా అనుసంధానం చేశాయో పరిశీలించినట్టు చెప్పారు.

చట్టబద్ధంగా రిజర్వేషన్లు: డిప్యూటీ సీఎం భట్టి



యూనివర్సిటీ బిల్లుపై చర్చకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బదులిస్తూ.. సభ్యులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. చట్టబద్ధంగా ఉన్న రిజర్వేషన్లన్నింటినీ అమలు చేస్తామన్నారు. గతంలో ప్రారంభించిన ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్లు అమలు చేయటం లేదని, కానీ ఇందులో మాత్రం చట్టప్రకారం అన్నింటినీ అమలు చేస్తామని, గవర్నింగ్ బాడీలో కూడా అనుసరిస్తామని తెలిపారు. మేస్త్రీ లాంటి సాధారణ కోర్సులు కూడా వర్సిటీలో ఉంటాయన్నారు.

'బడే భాయ్-చోటే భాయ్ ఏక్ హోగయా'

బీజేపీ, కాంగ్రెస్‌లపై బీఆర్ఎస్ నినాదాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో గురువారం బీజేపీ, కాంగ్రెస్‌లను విమర్శిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సబితను టార్గెట్ చేస్తూ చేసిన కామెంట్లపై సభ దద్దరిల్లిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో బీఆర్ఎస్ సభ్యులు పోడియం సమీపంలోకి వెళ్లి నల్లబ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. అలాగే సభ కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో కనీసం జిల్లాల్లోనూ నిరసనలు చేయలేని పరిస్థితి నెలకొందని, అలాంటిది ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో పోడియం వద్ద నిరసనలు తెలపగలుగుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ నాయకులు వెంటనే 'బడే భాయ్ చోటే భాయ్ ఏక్ హోగయా' అంటూ నినాదాలు చేశారు. అలాగే బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ కూడా బీఆర్ఎస్ తీరుపై విమర్శలు చేశారు. ఏదో ఫ్లోలో సీఎం అలా మాట్లాడి ఉంటారని, కావాలని అనలేదన్నారు. అలాగైతే మంత్రి సీతక్కపై కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు కూడా తీవ్రమైనవేనని అన్నారు. గత పదేళ్లలో ఇలా నిరసనలు తెలిపే పరిస్థితి మీ ప్రభుత్వంలో ఉందా అని పాయల్ శంకర్ బీఆర్ఎస్‌ను నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణకు ఎంతో కృషి చేసిందని బీజేపీ సభ్యులు అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు.

మళ్లీ అట్టుడికిన శాసనసభ



ఆందోళన చేస్తున్న హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసు వాహనంలో తరలిస్తున్న దృశ్యం

▶ మొదటి పేజీ తరువాయి

హక్కు వారికి ఉంటుందని రూల్ పొజిషన్ లేవనెత్తారు. విపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశమైనా ఇవ్వాలని, లేదా వారిని సస్పెండైనా చేయాలని సూచించారు. ఇంత గందరగోళం మధ్య కీలకమైన అంశాలపై చర్చ సరికాదని స్పష్టం చేశారు. సభను దారిలో పెట్టాల్సిన బాధ్యత సభాపతికి, సభా నాయకుడికి ఉంటుందన్నారు. సభను వాయిదా వేసి విపక్ష, అధికారపక్ష సభ్యులతో మాట్లాడటం సాంప్రదాయమని.. కానీ ఇలాంటి పరిస్థితుల్లో సభ కొనసాగించడం సరికాదని పేర్కొన్నారు. దీనికి స్పీకర్ బదులిస్తూ.. సభను అదుపులో పెట్టేందుకు తాను ఉదయం నుంచీ ప్రయత్నిస్తూనే ఉన్నానని చెప్పారు. తర్వాత కూడా నిరసనలు, నినాదాల మధ్యే సభ కొనసాగింది.

తనిఖీల నుంచి తరలింపు దాకా..

గురువారం ఉదయం అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాహనాలను పోలీసులు విస్తృతంగా తనిఖీ చేశారు. ప్లకార్డులు ఏవైనా తెస్తున్నారా అని ఆరా తీశారు. దీనిపై ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక సభ ప్రారంభానికి పది నిముషాల ముందే నల్లబ్యాడ్జీలు ధరించి అసెంబ్లీలోకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. సుమారు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. సభ ముగిశాక అసెంబ్లీలోని సీఎం చాంబర్ ముందు ధర్నాకు దిగారు. సుమారు అరగంట పాటు ఆందోళన చేయగా.. మార్షల్స్ రంగ ప్రవేశం చేసి ఎమ్మెల్యేలను అసెంబ్లీ భవనం బయటికి తరలించారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలో బైఠాయించి ఆందోళన కొనసాగించారు. పోలీసులు కల్పించుకుని.. కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, విజయుడు, మాణిక్‌రావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులను వాహనంలోకి ఎక్కించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. చివరికి అందరినీ బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌కు తరలించారు.

నేడు కూడా ఆందోళనకు నిర్ణయం

శాసనసభ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ముగియనున్న నేపథ్యంలో.. తమ మహిళా సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ పట్టుబట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్టు తెలిసింది. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రశ్నిస్తామని.. ఇందుకోసం మాట్లాడే చాన్స్ ఇవ్వాలని పట్టుబడతామని సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. తాను సీఎం నుంచి క్షమాపణ కోరుకోవడం లేదని.. మాట్లాడే అవకాశం ఇవ్వాలని మాత్రమే కోరుతున్నానని పేర్కొన్నారు. స్పీకర్‌కు తమ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు.

రేవంత్ 'చీప్ మినిస్టర్'

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి అయిన ప్పటికీ హుందాగా ప్రవర్తించడం లేదు. 'చీఫ్ మినిస్టర్‌గా కాకుండా, చిల్లరగా మాట్లాడే చీప్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నావు'అని రేవంత్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఉద్యమ సమ యంలో ఎవరి భిక్షతోనో తనకు మంత్రి పదవి రాలేదని, సోనియా కోరిక మేరకే 2004లో తాము కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరామని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి వచ్చిన ప్పుడు రేవంత్‌రెడ్డి టీఆర్ఎస్‌లో తన ఊరేగింపులోనూ ఉన్నారని గురువారం 'ఎక్స్'వేదికగా ఆయన వెల్లడించారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేసినప్పుడు కూడా రేవంత్‌రెడ్డి తన వెనుకే ఉన్నారని అప్పటి వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఇదంతా నీ కళ్ల ముందు జరిగినా ఇవేమీ తెలియనట్లు చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నావు. పదవులు, విలువల గురించి మాట్లాడే హక్కు నీకు లేదు. పదవులను గడ్డి పోచలుగా త్యజించిన చరిత్ర మాది. పూటకో పార్టీ మారిన రాజకీయ చరిత్ర రేవంత్‌ది.'అని పోస్ట్ చేశారు.

సీఎం కుర్చీ విలువను తగ్గించారు

రేవంత్‌పై బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ధ్వజం

- గతంలో మహిళా సభ్యులు అడిగితే సీఎంలు స్పందించేవారు
- ప్రస్తుతం సీఎం మైక్ ఇచ్చేందుకు భయపడుతున్నారు
- టీడీపీ రేవంత్ సీఎం పదవి లాక్కున్నా భట్టికి బాధ లేదు



బీఆర్ఎస్ భవన్‌లో మాట్లాడుతున్న సబిత. చిత్రంలో సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి

సాక్షి, హైదరాబాద్: 'శాసనసభలో సీఎం స్థానంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి, కేసీఆర్ వంటి ముఖ్యమంత్రులను చూశాం. మహిళా శాసనసభ్యులు నిలబడి మైక్ అడిగితే గతంలో సీఎంలు స్పందించేవారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలకు మైక్ ఇచ్చేందుకు భయపడుతున్నారు. మహిళా ఎమ్మెల్యేలు నాలుగున్నర గంటలు అసెంబ్లీలో నిల్చుని మాట్లాడే అవకాశం ఇవ్వాలని అడిగినా ఇవ్వకుండా సీఎం సహా, అధికార పక్షం రాక్షసానందం పొందుతోంది. స్పీకర్ మనసు మారుతుందేమోనని గంటల కొద్దీ నిల్చున్నాం. మహిళా ఎమ్మెల్యేలను కించ పరిచినా సభ స్పందించలేదు. సీఎం కుర్చీ విలువను రేవంత్ తగ్గించారు..' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.

అక్కలు అంటూనే పంగనామాలు

'ఆడబిడ్డలను అవమానించడం సీఎంకు నిత్యకృత్యంగా మారింది. రేవంత్‌ను నమ్ముకున్న రాహుల్‌గాంధీ బతుకుని సికింద్రాబాద్ స్టేషన్ చేస్తారా? సభలో లేని ఎమ్మెల్సీ కవిత పేరును రేవంత్ ప్రస్తావించడం సరికాదు. నేను రేవంత్‌ను నడిబజారులో నిలబెట్టలేదు, రాజ్‌భవన్‌లో కూర్చోబెట్టాను. గతంలో నన్ను చేవెళ్ల చెల్లెమ్మ అని పిలిచింది కాంగ్రెస్ కాదు.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే. ఈ సీఎం మాత్రం అక్కలు అంటూనే పంగనామాలు పెడుతున్నారు. గతంలో పీసీసీ అధ్యక్షులు కూడా పార్టీలు మారారు. సీఎం రేవంత్ సహా అసెంబ్లీలో ఇప్పుడున్న వారిలో ఎంత మంది పార్టీలు మారలేదు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మమ్మల్ని టార్గెట్ చేయడం ఎందుకు? టీడీపీ రేవంత్ సీఎం పదవి లాక్కున్నా భట్టికి బాధ లేదు. మాకు సీఎం క్షమాపణ చెప్పడం ముఖ్యం కాదు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ప్రభుత్వం నుంచి సమాధానం కోసం శుక్రవారం సభలో పట్టుబడతాం. మాకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలి. శాసనసభలో మహిళల గౌరవాన్ని కాపాడాలి..' అని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

మాపై వ్యాఖ్యలు బాధాకరం: సునీత

'నాలుగున్నర గంటలు సభలో నిల్చున్నా పాలకపక్షం స్పందించక పోగా హేళన చేసింది. జూనియర్ ఎమ్మెల్యేలు మాపై చేసిన వ్యాఖ్యలు బాధాకరం. గతంలో నా తరఫున నర్సాపూర్ ప్రచారానికి వచ్చిన రేవంత్ చేసిన వ్యాఖ్యల వల్లే నాపై మూడు కేసులు నమోదయ్యాయి. సమాచారం లేకుండా సీఎం రేవంత్ మాట్లాడుతున్నారు. ఎస్సీ వర్గీకరణకు మేము వ్యతిరేకం అన్నట్లుగా కాంగ్రెస్ సభ్యులు దిగజారుడు వ్యాఖ్యలు చేశారు..' అని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. సీఎం ఓ వైపు ఇందిర, సోనియా పేర్లు చెపుతూ మరోవైపు మహిళా ఎమ్మెల్యేలను అవమానపరుస్తున్నారని కోవా లక్ష్మి విమర్శించారు. చట్ట సభల్లోనూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందన్నారు.

తాలిబన్ సంస్కృతికి వారసుడిలా సీఎం: మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

సీఎం రేవంత్ ఫ్యూడల్ మనస్తత్వంతో తాలిబన్ సంస్కృతికి వారసుడిలా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సహచర ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, మర్రి జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీనియర్ ఎమ్మెల్యేలు సబిత, సునీతా లక్ష్మారెడ్డిపై ఆయన వ్యాఖ్యలు జుగుప్సా కరమన్నారు. పూటకో పార్టీ మారిన రేవంత్ అపరిచితుడిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో రేవంత్‌కు తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. సబిత, సునీతపై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేయడం దుశ్శాసన పర్వాన్ని తలపిస్తోందని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌పై ఉన్న కోపాన్ని భట్టి విక్రమార్క సబితపై చూపించారన్నారు. అసెంబ్లీలో గొంతు నొక్కితే ప్రజాక్షేత్రంలో మాట్లాడతామని చెప్పారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు బీజేపీ గొంతు నొక్కుతున్నాయి

• బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒక్కటై బీజేపీ నేతల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, ద్రవ్య వినిమయ బిల్లుపై అసెంబ్లీలో బీజేపీ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇతర సభ్యులు మాట్లాడే అవకాశం రాకుండా బీఆర్‌ఎస్ నేతలు సభలో ఆందోళన చేశారని, నిరసన వ్యక్తం చేయడానికి ఎన్నో మార్గాలు ఉన్నా, కావాలనే బీఆర్‌ఎస్ నేతలు సభ నడవకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇలా వ్యవహరించడం సరికాదని, ఇలాంటి పరిణామాలు సభలో చోటు చేసుకోవడం బాధాకరమని అన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని ఆర్థికంగా ధ్వంసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో చేసిన అవినీతి, అక్రమాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ వస్తున్నామని తెలిపారు. బీజేపీ ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

మహిళలపై బీఆర్‌ఎస్‌ది కపట ప్రేమ

• టీడబ్ల్యూసీడీసీ చైర్మన్ బండ్రు శోభారాణి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మతిలేని మాటలు మాట్లాడుతున్నారని, అభివృద్ధిని అడ్డుకునే విధంగా అసెంబ్లీలో వ్యవహరిస్తున్నారని తెలంగాణ మహిళా సహకార ఆర్థిక సంస్థ (టీడబ్ల్యూసీడీసీ) చైర్మన్ బండ్రు శోభారాణి విమర్శించారు. మహిళలను అవమానించే సంస్కృతి ఉన్న బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు మహిళలపై కపట ప్రేమ చూపిస్తున్నారని గురువారం మీడియాతో మాట్లాడుతూ ఆమె వ్యాఖ్యానించారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీనే ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు ఏమీ చేయలేదని, కేబినెట్‌లో కూడా స్థానం ఇవ్వకుండా అవమానపర్చారన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ఉపాధి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మించతలపెట్టిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి గురువారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. తర్వాత నెట్ జీరో సిటీలో భాగంగా బేగరికంచె గ్రామ పరిధిలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, మోడ్రన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్ల నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క. చిత్రంలో రంజిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు

నాలుగో నగరంగా బేగరికంచె అభివృద్ధి

'హైదరాబాద్‌ను నవాబులు, సికింద్రాబాద్‌ను బ్రిటిషర్లు, సైబరాబాద్‌ను చంద్రబాబు, వైఎస్సార్‌లు నిర్మిస్తే.. నాలుగో నగరంగా బేగరికంచెను మేము అభివృద్ధి చేయబోతున్నాం. నాలుగేళ్లలోనే న్యూయార్క్‌ను మించిన నగరంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతాం. హెల్త్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హాస్పిటాలిటీ టూరిజంగా అభివృద్ధి చేస్తాం. ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఇక్కడికి తీసుకొస్తాం. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తాం. తెలంగాణ ఉద్యమమే నిరుద్యోగ సమస్యపై కొనసాగింది. అందులో యువత కీలకపాత్ర పోషించింది. ఏటా లక్ష మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు బయటికి వస్తున్నా ఆశించిన స్థాయిలో ఉపాధి లభించడం లేదు. తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బులు ఖర్చు పెడుతూ అశోక్‌నగర్ చౌరస్తాలోని కోచింగ్ సెంటర్లలో చేరినా, సరైన నైపుణ్యం లేక ఉద్యోగాలు దొరకడం లేదు. పీజీ, పీహెచ్‌డీ పట్టాలు పొంది కూడా నిరుద్యోగులుగా మిగులుతున్న యువతకు ఈ స్కిల్స్ యూనివర్సిటీలో డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్ కోర్సులు అందించడంతో పాటు ఆయా సంస్థల్లో ఉపాధి కల్పిస్తాం. ఇక్కడ అడ్మిషన్ పొందితే చాలు.. జాబ్ గ్యారంటీ. జాతీయ, అంతర్జాతీయ కంపెనీల అవసరాలకు తగ్గట్లుగా శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తాం..'అని సీఎం చెప్పారు.

3 నెలల్లో ఆర్‌ఆర్‌ఆర్ పనులు షురూ

'రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఒకప్పుడు వేలల్లో ఉన్న భూముల ధరలు ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ రాకతో ప్రస్తుతం కోట్లకు చేరాయి. మరో మూడు నెలల్లో ఆర్‌ఆర్‌ఆర్ పనులను ప్రారంభిస్తాం. నెట్ జీరో సిటీ నుంచి ఓఆర్‌ఆర్ వరకు 200 అడుగుల ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు సహా మెట్రో రైలు నిర్మాణానికి భూసేకరణ పనులు చేపడతాం. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఒవైసీ ఆస్పత్రి, ఎయిర్‌పోర్టు మీదుగా బేగరికంచె వరకు మెట్రో రైలును విస్తరింపజేస్తాం.

కడ్తాల్ అడవుల్లో నైట్ సఫారీ

కడ్తాల్, ఆమనగల్లు అడవుల్లో నైట్ సఫారీ ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతాన్ని ప్రపంచ పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం. ఫార్మాసిటీ కోసం భూములు త్యాగం చేసిన రైతులు అధైర్య పడొద్దు, కాంగ్రెస్ ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మీ పిల్లలను చదివించి వారికి మంచి భవిష్యత్తును ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వమే తీసుకుంటుంది. భవిష్యత్తులో ఈ ప్రాంతంలోనే అన్ని మౌలిక సదుపాయాలు సమకూరుతాయి. విమానం కొనాలన్నా, ఎక్కాలన్నా ఇక్కడి నుంచే అవకాశాలు ఉంటాయి. ఈ ప్రాంతానికి తాగునీరు సహా రోడ్లు, పార్కులు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దుతాం..'అని రేవంత్ చెప్పారు. 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటి పారుదలకే ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన చొరవతోనే అనేక యూనివర్సిటీలు, ప్రాజెక్టులు వచ్చాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్, భాక్రానంగల్ తదితర నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించడంతో రైతాంగానికి సాగు నీరు అందుతోంది..'అని అన్నారు.

ప్రపంచానికే తలమానికం: డిప్యూటీ సీఎం భట్టి

'స్కిల్స్ యూనివర్సిటీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడమే కాకుండా శంకుస్థాపన కూడా చేసుకోవడం సువర్ణాక్షరాలతో లిఖించదగినది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు మించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయబోతున్నాం. ఇది ప్రపంచానికే తలమానికం కాబోతోంది. భూములు కోల్పోయిన వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆలోచనతో 600 ఎకరాల్లో అద్భుతమైన కమ్యూనిటీ భవనాలను నిర్మిస్తున్నాం. ప్లాట్లు పొందిన ప్రతి రైతు ఇక్కడే ఇల్లు కట్టుకుని జీవించే విధంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతాం. ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తాం..'అని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు.

మాది చేతల ప్రభుత్వం: మంత్రి కోమటిరెడ్డి

తమది మాటల ప్రభుత్వం కాదు..చేతల ప్రభుత్వమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వందలకొద్దీ కాలుష్య కారక ఫార్మా కంపెనీలు ఒకే చోట వస్తున్నాయని తెలిసి అప్పట్లో ఎంపీగా ఆందోళన చెందానని అన్నారు. ఫార్మాను రైతులతో పాటు తాను కూడా వ్యతిరేకించానని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీని రద్దు చేసి దాని స్థానంలో ఫార్మా విలేజ్‌లు చేపట్టామని తెలిపారు.

కొత్త ఆలోచన, కొత్త గమ్యం: శ్రీధర్‌బాబు

కొత్త ఆలోచన, కొత్త గమ్యం, కొత్త నగరం ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఉద్యోగాలు కావాలని ఉద్యమాలు చేసిన యువత కల నెరవేరబోతోందన్నారు. ఇప్పటికే 40 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, రాష్ట్రంలో మిగిలిన మరో 30 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో స్కిల్స్ యూనివర్సిటీని తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఢిల్లీకి గవర్నర్



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీ జితేందర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిష్ణుదేవ్ వర్మ తొలిసారిగా గురువారం ఢిల్లీ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిష్ణుదేవ్ వర్మకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కాగా.. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అధ్యక్షతన జరగనున్న గవర్నర్ల సదస్సుకు జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా పనులు పూర్తి చేస్తాం

• రైల్వే సమస్యల పరిష్కారంపై ఈటలకు కేంద్రమంత్రి హామీ



సాక్షి, న్యూఢిల్లీ: రైల్వే సమస్యల పరిష్కారానికి, తన వంతు వాటా ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం సహకరించకపోయినా 100% నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ హామీ ఇచ్చినట్లు బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం కేంద్రమంత్రిని కలిసిన అనంతరం ఈటల రాజేందర్ తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభలో రైల్వే బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పలు రైల్వే సమస్యలను ప్రస్తావించారని గుర్తుచేశారు. అయితే... సమయాభావం వల్ల సభ దృష్టికి తీసుకురాలేకపోయిన సమస్యలను లిఖిత పూర్వకంగా రాసివ్వాలన్న రైల్వే మంత్రి సూచన మేరకు గురువారం అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి సమస్యల జాబితాను అందజేశామని చెప్పారు. వాజ్‌పేయి నగర్, సఫిల్‌గూడ, అల్వాల్, బొల్లారం, సికింద్రాబాద్–బొల్లారం, మౌలాలి–సనత్‌నగర్‌లో అవసరం ఉన్న చోట ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలు నిర్మించాలని కోరినట్లు తెలిపారు. మౌలాలి–చర్లపల్లి–సనత్‌నగర్ మార్గంలో పలు చోట్ల ఎంఎంటీఎస్ స్టేషన్లు నిర్మించాలని చెప్పామన్నారు. సికింద్రాబాద్– మేడ్చల్ వరకు, జూబ్లీ బస్టాండ్–శామీర్‌పేట్, ఎల్బీనగర్–హయత్‌నగర్ వరకు మెట్రో లైన్ల విస్తరణపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గం ఉప్పల్‌లో రూ.200కోట్లతో ఆర్‌ఓబీ పూర్తి కాగా...పెండింగ్‌లోవున్న రైల్వే పైప్‌లైన్ పనులు కూడా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారని ఈటల రాజేందర్ వివరించారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్ పిటిషన్



సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వివరాలు తెలుసుకొని చెప్పా లంటూ పీపీ పల్లె నాగేశ్వరరావును ఆదేశించారు. తదుపరి విచారణ వచ్చే వారానికి వాయిదా వేశారు. తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశారని రాజ్ తరుణ్‌పై లావణ్య అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా నార్సింగి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే.

ఎస్సీ గురుకులంలో కొలిక్కిరాని బదిలీలు

• ఒక పోస్టుకు ఇద్దరికంటే ఎక్కువమందికి బదిలీ
• పదోన్నతులు పొందినా జాబితాలో పేర్లు కనిపించని వైనం
• ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ఆందోళన
• గందరగోళంగా మారిన టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)లో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల పంచాయితీ ఇంకా కొలిక్కి రాలేదు. ఈ సొసైటీ పరిధిలో బోధన ఉద్యోగులకు ఆన్‌లైన్ పద్ధతిలో బదిలీల ప్రక్రియ నిర్వహిస్తూనే సమాంతరంగా పదోన్నతులు సైతం ఇచ్చారు. అర్హతలున్న వారు పదోన్నతులు పొందగా...బదిలీలకు అర్హత ఉన్న ఉద్యోగులు ఆన్‌లైన్ పద్ధతిలో వెబ్ ఆప్షన్లు సమర్పించారు. ఈ ప్రక్రియ ముగిసినప్పటికీ ఎన్నో అడ్డంకులను అధిగమిస్తూ ఆలస్యంగా బుధవారం అర్ధరాత్రి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పోస్టింగ్ ఉత్తర్వులు పొందిన చాలామంది ఉద్యోగులు అవాక్కవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పదోన్నతుల జాబితాలో పేర్లు లేవు..

పదోన్నతులు పొందిన వారికి సమాచారమున్నా ప్రమోషన్ జాబితాలో మాత్రం పేర్లు కనిపించలేదు. మరికొందరు పోస్టుల్లేని స్థానాలకు బదిలీ అయ్యారు. కొన్నిచోట్ల ఒకే పోస్టుకు ఇద్దరు కంటే ఎక్కువ మందిని బదిలీ చేసినట్లు గుర్తించారు. ఉద్యోగులు గురువారం రిపోర్టు చేసేందుకు సదరు పాఠశాలకు వెళ్లినప్పుడు ఇలాంటి పరిస్థితి ఎదురైంది. దీంతో వారు సొసైటీ కార్యాలయానికి పరుగులు పెట్టాల్సి రావడంతో గురువారం సొసైటీ కార్యాలయం తీవ్ర గందరగోళంగా తయారైంది. దీనిపై ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై సొసైటీ అధికారులు మాత్రం స్పందించకపోవడం గమనార్హం.

కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉన్నారు

మంత్రి జూపల్లి కృష్ణారావు

• ఎమ్మెల్యే బండ్లతో మంత్రి మంతనాలు..
• పాత మిత్రులను కలసి మాట్లాడితే పార్టీ మారినట్లు కాదని స్పష్టీకరణ



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాసంలో అల్పాహారం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గద్వాల రూరల్‌: 'అసెంబ్లీలో పాతమిత్రులు కనిపిస్తే వెళ్లి మాట్లాడినంత మాత్రాన పార్టీ మారినట్లు మీడియా కథనాలు రాయడం సరైంది కాదు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నారు'అని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలసి గద్వాలలోని ఎమ్మెల్యే బండ్ల నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రెడ్డితో మంతనాలు చేయడంతో పాటు ఆయనతో కలసి అల్పాహారం చేశారు. అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారన్నారు. పార్టీలో ఆయనకు తగిన ప్రాధాన్యం ఉంటుందని, ఎక్కడా ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నెట్టెంపాడు, ర్యాలంపాడు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు లేకపోవడంతో కొంత మనస్తాపానికి గురైనట్లున్నారని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీలో అందరికీ సమాన అవకాశాలుంటాయని, పార్టీలో ఎలాంటి వర్గపోరు లేదని చెప్పారు. గద్వాల అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికే ప్రథమ ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ మారారనే ప్రచారం కేవలం అపోహ మాత్రమేనన్నారు. అనంతరం ఆయన కృష్ణమోహన్‌రెడ్డిని తన వాహనంలో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

నాలుగు మెడికల్ కాలేజీలకే ఎన్‌ఎంసీ అనుమతి

• ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీలకు గ్రీన్‌సిగ్నల్
• ఈ వైద్య విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కొత్తగా నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు జాతీయ వైద్యమండలి (ఎన్‌ఎంసీ) అనుమతి ఇచ్చింది. ఈ మేరకు లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌ఓపీ) జారీ చేసింది. ప్రభుత్వం ఈ ఏడాదికి 8 కాలేజీల కోసం దరఖాస్తు చేసిన సంగతి తెలిసిందే. వాటిలో నాలుగింటికే అనుమతులొచ్చాయి. ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట మెడికల్ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి వైద్యవిద్య ప్రవేశాలకు ఎన్‌ఎంసీ పచ్చజెండా ఊపింది. యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మెదక్ కాలేజీలకు ఎన్‌ఎంసీ అనుమతులు ఇవ్వలేదు. వీటి ఎల్‌ఓపీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మరోమారు అప్పీల్‌కు వెళ్లనుంది. కాగా, గత నెల ఈ కాలేజీలన్నింటికీ అనుమతులు ఇవ్వలేమని ఎన్‌ఎంసీ తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. దీంతో తమకు మరో అవకాశం ఇవ్వాలని, లోపాలను సరిచేసుకుంటామని ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లింది. ఆ తర్వాత అధ్యాపకులను నియమించింది. 245 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించింది. కొత్త కాలేజీలకు పోస్టు చేసింది. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆ కాలేజీలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్స్, ఆస్పత్రుల సూపరింటెండెంట్లను పంపింది. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేట్‌లో కలిపి 56 మెడికల్ కాలేజీలున్నాయి. వాటిల్లో మొత్తం కలిపి 8,515 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు 28 ఉండగా..వాటిలో 3,915 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. వీటికి అదనంగా మరో 200 సీట్లు కలవనున్నాయి. ఒక్కో కొత్త కాలేజీల్లో 50 సీట్ల కోసం అనుమతులు కోరుతూ దరఖాస్తు చేశారు. వాటిలో నాలుగింటికి అనుమతులొచ్చాయి. దీంతో సర్కారీ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 4,115కు చేరనుంది.

రాష్ట్రానికి చేరుకున్న నీట్ ర్యాంకులు

కాగా నీట్ రాష్ట్రస్థాయి ర్యాంకులు తెలంగాణకు చేరుకున్నాయి. ఈ మేరకు కాళోజీ విశ్వవిద్యాలయవర్గాలు ఢిల్లీకి వెళ్లి ఆ డేటాను తీసుకొచ్చాయి. ఆ డేటాను విశ్లేషించి రాష్ట్రస్థాయి ర్యాంకులు తయారు చేసి శనివారం విడుదల చేసే అవకాశముంది.

ఫోకస్

అవివేకం వల్ల ఏదైనా చెడు కార్యానికి పాల్పడి, వెనువెంటనే తప్పు తెలుసుకుని పశ్చాత్తాపం చెందేవారి పశ్చాత్తాపాన్ని స్వీకరించే బాధ్యత మాత్రమే అల్లాహ్‌పై ఉంది. అటువంటి వారి పశ్చాత్తాపాన్ని అల్లాహ్ స్వీకరిస్తాడు. అల్లాహ్ మహాజ్ఞాని, గొప్ప వివేకవంతుడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 2 ఆగస్టు 2024

విస్తరిస్తున్న యుద్ధమేఘాలు

ఇజ్రాయెల్ – హమాస్‌ల మధ్య యుద్ధం ఆగి, గాజా ప్రాంతంలో శాంతి నెలకొంటుందని నిన్నటి దాకా ఉన్న కొద్దిపాటి ఆశ ఇప్పుడు ఆవిరైపోయినట్టు అనిపిస్తోంది. హమాస్ సీనియర్ నేత ఇస్మాయిల్ హనియేను ఇరాన్ రాజధాని టెహరాన్‌లో బుధవారం గుట్టుచప్పుడు కాకుండా చంపిన తీరు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. హనియేను చంపింది తామేనని ఇజ్రాయెల్ ప్రకటించలేదు కానీ, ఆయన చనిపోవాలని ఇజ్రాయెలీల కన్నా ఎక్కువగా మరెవరూ కోరుకోరన్నది నిజం. మరోపక్క ఆ హత్యకు కొద్ది గంటల ముందే మంగళవారం లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇరాన్‌కు మిత్రపక్షమైన హెజ్బొల్లా తీవ్రవాద గ్రూపు సీనియర్ మిలటరీ కమాండర్ ఫాద్ షుక్ర్ ప్రాణాలు గాలిలో కలిశాయి. గత వారం (ఆక్రమిత) గోలన్ హైట్స్‌లో రాకెట్ దాడితో 12 మంది పిల్లల్ని పొట్టనబెట్టుకున్న ఆయనను మాత్రం అడ్డు తొలగించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అలా ఆ దేశ శత్రువులకు రెండు రోజుల్లో రెండు ఎదురుదెబ్బలు తగిలాయి. ఇజ్రాయెల్ ఒప్పుదల మాటెలా ఉన్నా... ఇరాన్ నూతన అధ్యక్షుడి పదవీ స్వీకారోత్సవానికి హనియే వచ్చివుండగా జరిగిన ఈ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ అధినాయకుడు అయతొల్లా ఖొమేనీ గర్జించారు. ప్రతిగా ఎవరు రెచ్చగొట్టే చర్యలకు దిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరించారు. వెరసి, వ్యవహారం ఇజ్రాయెల్ – ఇరాన్‌ల మధ్య నేరు ఘర్షణకు దారి తీస్తోంది. మొత్తం గాజా కథ మరో ప్రమాదకరమైన మలుపు తిరిగింది.

అసలే సంక్లిష్టంగా ఉన్న పశ్చిమాసియా సంక్షోభం కాస్తా హనియే హత్యోదంతంతో మరింత సంక్లిష్టంగా మారింది. ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధానికి పరిష్కారం కనుగొనాలని చేస్తున్న శాంతి ప్రయత్నాలకు తాజా ఘటన విఘాతం కల్పించింది. ఇరుపక్షాల మధ్య రాజీ కుదర్చడానికి చర్చలు జరుగుతున్నప్పుడు... ఒక పక్షం వాళ్ళు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న వ్యక్తినే చంపేస్తే ఇక మధ్యవర్తిత్వం ఏం సఫలమవుతుంది? రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తున్న ఖతార్ పక్షాన ఆ దేశ ప్రధాని సరిగ్గా ఆ మాటే అన్నారు. ఆ మాటలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. హనియేపై యుద్ధ నేరాలున్న మాట, అతనిపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ ఇటీవలే వారెంట్ జారీ చేసిన మాట నిజమే. కానీ, హమాస్ గ్రూపులో మిలటరీ నేత యాహ్యా సిన్వర్ సహా ఇతర పిడివాదులతో పోలిస్తే రాజీ చర్చల విషయంలో రాజకీయ విభాగ నేత హనియే కొంతవరకు ఆచరణవాది అంటారు. ఇప్పుడు ఆయనే హత్యకు గురయ్యాడు గనక కథ మొదటికి వచ్చింది. కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం కుదిరినంత మాత్రాన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు చల్లబడతాయని గ్యారెంటీ లేదు కానీ, అసలు ఒప్పందమే లేకపోతే ఉద్రిక్తతలు తగ్గే అవకాశమే లేదు. మొత్తంగా ఈ ఘటన ఆ ప్రాంత సుస్థిరతనే దెబ్బ తీస్తూ, గాజా యుద్ధాన్ని చివరకు పెను ప్రాంతీయ ఘర్షణ స్థాయికి తీసుకెళుతోంది.

అతిథిగా వచ్చిన మిత్రపక్షీయుణ్ణి భద్రత ఎక్కువగా ఉండే సమయంలోనే సొంతగడ్డపై, స్వకీయ గూఢచర్య వైఫల్యంతో పోగొట్టుకోవడం ఇరాన్‌కు తీరని తలవంపులే. ఖొమేనీ గర్జించినట్టు ఇరాన్ దీనికి బదులు తీర్చుకోవచ్చు. అదే జరిగితే ఇజ్రాయెల్ ప్రతిచర్యా తప్పదు. నిజానికి, ఆ మధ్య ఏప్రిల్‌లో డెమాస్కస్‌లోని ఇరాన్ ఎంబసీలో తమ జనరల్స్ ఇద్దరిని హత్య చేసినప్పుడు ఇరాన్ తొలిసారిగా నేరుగా ఇజ్రాయెల్‌పై సైనిక దాడి జరిపింది. వందలాది క్షిపణులు ప్రయోగించింది. అదృష్టవశాత్తూ అప్పట్లో అది పూర్తిస్థాయి ప్రాంతీయ యుద్ధంగా పరిణమించలేదు. ప్రతిసారీ అలా ఆగుతుందనుకోలేం. తాజా ఘటనలతో యెమెన్ నుంచి హౌతీలు ఎర్రసముద్రంలో దాడులు ఇబ్బడిముబ్బడి చేస్తారు. హెజ్బొల్లా సైతం ఇజ్రాయెల్‌ను చూస్తూ ఊరుకోదు. అసలు నిరుడు అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ గ్రూపు చేసిన దుర్మార్గమైన దాడి ఇక్కడికి తెచ్చింది. అప్పటి నుంచి మధ్యప్రాచ్యంలో పూర్తిస్థాయి యుద్ధం తప్పదనే భయాందోళనలు చెలరేగుతూనే ఉన్నాయి. చిత్రం ఏమిటంటే, ఏ పక్షమూ ఆ రకమైన యుద్ధం కోరుకోవడం లేదు కానీ, తమ చర్యలతో ఎప్పటికప్పుడు కయ్యానికి కాలుదువ్వుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ యుద్ధం తీవ్రతరమయ్యే ముప్పు తప్పాలంటే ముందు గాజాలో కాల్పుల విరమణ జరగాలి.

అయితే, వరస చూస్తుంటే హమాస్‌పై పూర్తి విజయమే లక్ష్యమన్న నెతన్యాహూ మాటలనే ఇజ్రాయెల్ ఆచరిస్తోందని అనిపిస్తోంది. పది నెలలుగా సాగుతున్న యుద్ధంలో ఒక్క గాజాలోనే ఇప్పటికి 40 వేల మంది చనిపోయారు. ఇలాగే ముందుకు సాగితే యుద్ధం ఇతర ప్రాంతాలకూ విస్తరించి, మరింత ప్రాణనష్టం తప్పదు. మానవీయ సంక్షోభమూ ఆగదు. హనియే హత్యతో హమాస్ తల లేని మొండెమైంది. పగ తీర్చుకోవాలన్న ఇజ్రాయెల్ పంతం నెరవేరింది. ఇకనైనా ఆ దేశం ప్రతీకార మార్గం వీడి, రాజీ బాటను అనుసరించాలి. శాంతికి కట్టుబడ్డ మన దేశానికి సైతం ఆ ప్రాంతంలో యుద్ధంతో భారీ నష్టమే. అక్కడ 89 లక్షల మంది మన వలస కార్మికులున్నారు. పైగా, శాంతి, సుస్థిరత లేకుంటే నిరుడు ఢిల్లీ జీ–20 సదస్సులో ప్రకటించిన 'ఇండియా– మిడిల్ ఈస్ట్ – యూరప్ ఎకనామిక్ కారిడార్' (ఐఎంఈసీ) లాంటివి పట్టాలెక్కవు. ఇజ్రాయెల్, పాలెస్తీనాలు రెంటికీ మిత్రదేశంగా ఇరుపక్షాలనూ తిరిగి రాజీ చర్చలకు కూర్చోబెట్టేందుకు ప్రయత్నించాలి. అధ్యక్ష ఎన్నికలతో తీరిక లేని అమెరికా సహా ఇతర దేశాలన్నీ ఒత్తిడి తెచ్చి అయినా సరే రెండువైపులవారినీ అందుకు ఒప్పించాలి. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు చిత్తశుద్ధితో నడుం బిగించాలి. ఎందుకంటే, ఏ యుద్ధంలోనూ విజేతలుండరు. ప్రతిసారీ ప్రజలు పరాజితులుగానే మిగులుతారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.3.42 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆరుద్ర ప.12.16 వరకు తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.12.32 నుండి 2.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం: 5.42
సూర్యాస్తమయం: 6.30
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

కృత్రిమ మేధకు ముకుతాడు వేయాలి!

విశ్లేషణ



అశ్వినీ కుమార్

ప్రజల ఆరోగ్యం, విద్య విషయాల్లో కృత్రిమ మేధ ఉపయోగకారి కావచ్చు. సైబర్ నేరాలు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకూ సాయపడవచ్చు. కానీ దీనిద్వారా ప్రజల అభిప్రాయాలను కృత్రిమంగా మార్చే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం కావడం ఆందోళన కలిగించే అంశం. కొందరిపై ఉద్దేశపూర్వకంగా ద్వేషం పెరిగేలా చేయడం, వ్యక్తుల బలహీనతలు ఆసరాగా సమాజంలో అసమానతలను పెంచే ప్రయత్నం జరుగుతూండటమూ గమనార్హం. ఏ కొత్త విజ్ఞానమైనా మానవీయ విలువలను ఎంత మేరకు పెంచుతోంది అన్నది కీలకం. చాలామంది నిపుణులు ఈ సాంకేతిక పరిజ్ఞానానికి ముకుతాడు వేయాల్సిందేనంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత నైతిక ప్రమాణాల పరిధిలోనే దీని వాడకాన్ని సమీక్షించి హద్దులు నిర్వచించాల్సిన అవసరం ఉంది.

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ)... మన తరం అనుభవిస్తున్న విప్లవాత్మకమైన, అత్యంత ప్రభావశీలమైన సాంకేతిక పరిజ్ఞానం అనడంలో సందేహం అవసరం లేదు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే కాకుండా... పెరుగుతున్న మానవ కాంక్షలకు తగ్గట్టుగా దాన్ని మలచుకోవాలనే, నియంత్రించాలనే మానవ ఆసక్తికి తాజా నిదర్శనం కూడా. ఈ మార్పు జరిగే క్రమంలో సవాళ్లు లేకపోలేదు. కృత్రిమ మేధ వాడకంతో సమాజంలో మానవ విలువలు తగ్గిపోతాయని, సమాజం అమానవీయమైన రీతిలో మారిపోతుందని ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సాంకేతిక పరిజ్ఞానం విసురుతున్న నైతిక సవాళ్లపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. ఏఐ వాడకాన్ని నియంత్రించేందుకు, నియమాల ఏర్పాటు కూడా ఈ చర్చలో భాగమే. ఇప్పటికే కొన్ని ప్రాంతీయ స్థాయి, మరికొన్ని అంతర్జాతీయ స్థాయి చర్యలూ మొదలయ్యాయి. మానవ హక్కుల విషయంలో ఇప్పుడున్న నియమావళి, నిబంధనల పరిధిలోనే కృత్రిమ మేధ వాడకాన్ని పరిమితం చేయడం ఈ చర్చల్లో ఒక భాగంగా ఉంది.

గత ఏడాది నవంబరులో ప్రపంచంలోని 193 దేశాలు ఏకగ్రీవంగా ఏఐ నైతిక నియమావళికి సంబంధించి యునెస్కో సిద్ధం చేసిన సూచనలకు ఆమోదం తెలిపిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఇది మాత్రమే కాదు... 'ఎథిక్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్ సిస్టమ్స్'పై మాంట్రియాల్ ప్రకటన, 'ఏసీఎం ఫ్యాక్ట్ కాన్ఫరెన్స్', బైడెన్ నేతృత్వంలో అమెరికా ప్రభుత్వం చేసిన 'ఏఐ బిల్ ఆఫ్ రైట్స్', యూరోపియన్ యూనియన్ 'ఏఐ చట్టం', అమెరికాలో జాతీయ స్థాయి నియంత్రణ సంస్థలు పార్లమెంటులో జరిపిన చర్చలు... అన్నీ ఏఐతో రాగల సవాళ్లను ఎదుర్కొనేందుకు చేస్తున్న ప్రయత్నాలే. ఏఐ ప్రస్థానాన్ని నిశితంగా పరిశీలించేందుకు ఏర్పడిన 'గ్లోబల్ అబ్జర్వేటరీ ఆన్ ద ఎఫెక్ట్ ఆఫ్ ఏఐ', 'గ్లోబల్ ఫోరమ్ ఆన్ ఎథిక్స్ ఆఫ్ ఏఐ', 'ఏఐ ఎథిక్స్ ఎక్స్‌పర్ట్స్ విదౌట్ బార్డర్స్', 'విమెన్ ఫర్ ఏఐఎథిక్స్' వంటివి కూడా ఏఐ విషయంలో ఎదురుకాగల నైతిక సవాళ్లపై మరింత పదునైన అవగాహన కలిగి ఉన్నాయి.

అభివృద్ధి పథంలో వేసే ప్రతి ముందడుగులోనూ మానవజాతి... ఈ అభివృద్ధికి నిర్వచనంగా మానవీయత, ప్రజల సంతోషం మరింత పెరగడాన్నే చూసినట్లు చరిత్ర చెబుతోంది. కృత్రిమ మేధ ప్రజల ఆరోగ్యం, విద్య విషయాల్లో ఎంతో ఉపయోగకారి కావచ్చు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు, సమస్య పరిష్కారానికీ అక్కరకు రావచ్చు. సైబర్ నేరాలు, కోవిడ్ వంటి మహమ్మారులు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకూ సాయపడవచ్చు. ఇవన్నీ మానవ నాగరికత పరిణామ క్రమంలో విప్లవాత్మకమైన ముందడుగులే. అయినా సరే... ఏఐ రంగంలో పని చేస్తున్న చాలామంది నిపుణుల అభిప్రాయం... ఈ సాంకేతిక పరిజ్ఞానానికి ముకుతాడు వేయాల్సిందే అని! సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మనం సాధించే విజయాలు... మానవతా విలువల శిథిలాల్లో చేసుకునే సంబరాలు కానే కాకూడదు. ఏ కొత్త విజ్ఞానమైనా మానవీయ విలువలను ఎంత మేరకు పెంచుతోంది అన్నది కీలకం. ఈ నేపథ్యంలోనే ఏఐ వాడకంపై మానవీయ నైతిక విలువల చట్రంలోనే సమీక్ష జరగాల్సిన అవసరం ఎంతైనా కనపడుతుంది.



చరిత్రను మార్చేయగలదు...

మనిషి ఏ మాత్రం వదులుకోలేని స్వేచ్ఛ, వ్యక్తిగత గోప్యత, భావోద్వేగాలు, సన్నిహిత సంబంధాలు, వ్యక్తిగత స్వతంత్రత, మానవ మేధ తాలూకూ పవిత్రత వంటివి అన్నీ అత్యంత ప్రాథమిక హక్కులని ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలన్నీ గుర్తించాయి. ఏఐ ద్వారా ఎన్నికల్లో, ప్రజల అభిప్రాయాలను కృత్రిమంగా మార్చే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం కావడం ప్రజాస్వామ్యానికి ఆందోళన కలిగించే అంశమే. డీప్‌ఫేక్‌ల ద్వారా భాషను హైజాక్ చేసి ప్రజాస్వామ్య ప్రక్రియలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. కొందరిపై ఉద్దేశపూర్వకంగా ద్వేషం పెరిగేలా చేయడం, వ్యక్తుల బలహీనతలను ఆసరాగా చేసుకుని సమాజంలో అసమానతలను పెంచే ప్రయత్నం జరుగుతూండటమూ గమనార్హం. కృత్రిమ మేధ 'చరిత్ర'ను కూడా మార్చేసే అవకాశంపై ఇప్పటికే తీవ్రస్థాయి ఆందోళన వ్యక్తమైంది.

ఏఐ అనే భూతాన్ని ప్రపంచవ్యాప్తంగానూ కట్టడి చేయాల్సిందే. లేదంటే చిక్కులు తప్పవు. ఈ విషయాన్నే ఎలాన్ మస్క్ వంటి వాళ్లు కూడా విస్పష్టంగా ప్రకటించారు. ''నిర్వీర్యం చేయగల స్విచ్ లేకుండా కృత్రిమ మేధను అభివృద్ధి చేయడం దయ్యానికి ఆహ్వానం పలకడమే'' అని 'ఎక్స్' అధినేత మస్క్ హెచ్చరిస్తే... ''ప్రపంచం మరింత డిజిటల్ మయం అవుతుంది. అయితే ఈ పరిణామం మానవ సమాజానికి ఏమంత మంచి చేసేది కాకపోవచ్చు'' అని 'ఫేస్‌బుక్' వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ స్పష్టం చేశారు. 'ఆపిల్' వ్యవస్థాపకుడు స్టీవ్ వోజ్నిక్ ఓ బహిరంగ లేఖ రాస్తూ... ఏఐ నియంత్రణకు సమర్థమైన వ్యవస్థ ఒకదాన్ని వీలైనంత తొందరగా ఏర్పాటు చేసుకోవాలని సూచించడం గమనార్హం.

అయితే ఈ ఏర్పాటు స్వీయ నియంత్రణకే పరిమితం కాకూడదు. నిర్వచించుకున్న హద్దులను దాటినవారు ఎవరు, బాధ్యత ఎవరి దన్నది నిర్ధారించేలా కూడా ఉండాలి. సైన్స్ విజయాల వెలుగులో వెలిగిపోవాలంటే... నీడల వెంబడి నడవడమూ అలవాటు చేసుకోవాలన్నమాట.

కృత్రిమ మేధ వాడకంపై ప్రస్తుతం వెల్లువెత్తుతున్న ఆందోళనలు అవసరానికి మించి ఉన్నాయా, లేదా? అన్నది కాసేపు పక్కనబెడదాం. ఈ అంశంపై ఎక్కువ మంది చెప్పేదేమిటంటే... మనిషి నైతికాంశాల విషయంలో సర్వ స్వతంత్రుడు; మానవ విలువలు, మానవీయతలను గుర్తించే వ్యక్తి హేతుబద్ధత కేంద్రంగానే మనవ నాగరత అభివృద్ధి చెందుతూ వస్తోందని. అందరినీ కలుపుకొని పోవడం, సమానత్వాన్ని పాటించడం, న్యాయం వంటివి కూడా కీలకమే. అయితే ఏఐ పని చేయాల్సిన నైతిక విలువల చట్రంలో ఇవన్నీ సాధ్యమేనా? అతి సంక్లిష్టమైన మానవ నైతిక విలువలను ఒక అల్గారిథమ్ పరిధిలోకి చేర్చడం వీలవుతుందా? లేదా, మనిషి లాగా అన్నింటినీ అర్థం చేసుకోగల 'ఫుల్ ఎథికల్ ఏజెంట్ల'ను సిద్ధం చేయడం కుదురుతుందా? అన్నవి అసలు ప్రశ్నలు. ఏఐ చుట్టూ దుర్భేద్యమైన సరిహద్దుల ఏర్పాటైతే తప్పనిసరిగా జరగాలి. ఇలాంటి ఏర్పాటు ద్వారానే ఈ విశ్వంపై మనిషి పెత్తనం నడుస్తుంది. మనకు మాత్రమే ప్రత్యేకమైన వ్యక్తిగత జీవితాలు సురక్షితంగా ఉంటాయి.

న్యూఢిల్లీలో ఇటీవలే 'గ్లోబల్ ఏఐ' శిఖరాగ్ర సమావేశం ఒకటి జరిగింది. ఇందులో జరిగిన చర్చలు ఏఐ బాధ్యతాయుతంగా, నైతిక విలువలతో వ్యవహరించేలా చేసేందుకు ఏం చేయాలన్న విషయంపై కొంత అవగాహన ఇచ్చే ఉంటుంది.

మానవ నాగరకత శిఖరస్థాయికి చేరడం అంటే, మనిషి మరింత ఎత్తుకు ఎదగడమే కావాలి. తెలిసో, తెలియకో మానవ విలువలు పతనం కారాదు. శాస్త్రవేత్తల మాటలను, వేదాంతవేత్తల మాటలను కలిపి చదవగలిగిన మన సామర్థ్యం మానవ సమాజం, విలువల కొనసాగింపునకు దోహదపడాలి. ఇదెలా సాధిస్తామన్నది ఓ మహా సవాలే కానీ మన నాయకత్వ పటిమకు నిర్ణయాత్మకమైంది కూడా.

వ్యాసకర్త కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



అలవాటు



తమకు ఉన్న అధికారాన్ని ఎలా వాడుకోవాలో బీజేపీకి తెలియదు. తమకు లేని అధికారాన్ని ఎలా వాడుకోవాలో కాంగ్రెస్‌కు తెలుసు.

– వినోద్ కుమార్, స్క్వాడ్రన్ లీడర్

జాగ్రత్త కోసం...



జాతీయ మహిళా కమిషన్ ఎఫ్ఐఆర్‌కు సంబంధించి ఢిల్లీ పోలీసులు నన్ను కలవాలని ప్రయత్నిస్తున్నారనుకుంటున్నా. సర్... నేను పార్లమెంట్ లాబీలో దొరకొచ్చు. గొడుగు పట్టుకుని ఎదురుచూస్తుంటా. (పార్లమెంట్‌లోకి నీళ్లు వచ్చిన నేపథ్యంలో.)

– మహువా మొయిత్రా, తృణమూల్ ఎంపీ

పోటీ పడగలరా?



జన్మతః పురుషుడైన అల్జీరియాకు చెందిన ఇమేన్ ఖెలీఫ్ చేతిలో ఇటలీకి చెందిన ఏంజెలా కారిని కేవలం 45 సెకన్లలో ఒలింపిక్స్ 66 కిలోల బాక్సింగ్ ప్రాథమిక పోటీల్లో ఓడిపోయింది. జన్మతః మహిళలైన అథ్లెట్లకు హక్కులు లేవా? ఎంత సిగ్గుచేటు! దీని గురించి స్త్రీవాదులు మాట్లాడరా?

– వెలీనా చకరోవా, వ్యాఖ్యాత

ముఖ్యమైన తీర్పు



ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ఎస్సీలకు ఇస్తున్న రిజర్వేషన్లలో ఉప విభాగాలు చేయడానికి రాష్ట్రాలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపట్ల రాజకీయ పార్టీల వ్యాప్తంగా ఉద్దేశపూర్వకమైన మౌనం కనబడుతోంది. కానీ అదొక విశేషమైన తీర్పు.

నిస్తులా హెబ్బర్, పాత్రికేయురాలు

ఏడాదికే?



దాదాపుగా వందేళ్ల కింద 1927లో బ్రిటిష్‌వాళ్లు నిర్మించిన పాత పార్లమెంట్ భవనంలో ఒక్కసారి కూడా నీళ్ళు కారలేదు. కానీ విశ్వగురు 2023లో నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనం ఒక్క ఏడాదిలోనే కారడం మొదలైంది. ప్రకృతి మరీ క్రూరంగా బీజేపీని బట్టబయలు చేసింది.

– రోషన్ రాయ్, సెటైరిస్ట్

ఆధారాలు లేకుండా...



ఒక దళితుడైన అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లకు అవకాశం కల్పించారు. ఆయన దళితులను వర్గీకరించలేదు. కానీ బ్రాహ్మణ మెజారిటీతో కూడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల బెంచ్ ఏ విధమైన వాస్తవిక ఆధారాలూ లేకుండా ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించేందుకు రాజ్యాంగపరంగా అనుమతి ఉందని నిర్ణయించింది.

– అనుభవ్ సింగ్, వ్యాఖ్యాత

అపనమ్మకమా?



గత 24 గంటల్లో నేను చాలామందితో మాట్లాడాను. అందులో అత్యధికులు (హమాస్ చీఫ్) ఇస్మాయిల్ హనియేను ఇజ్రాయెల్ హత్య చేసేందుకు ఇరానే అప్పగించివుంటుందని భావిస్తున్నారు. దీనికి ఏ విధమైన ఆధారమూ లేదు, అర్థం లేదు. కానీ సిరియన్ యుద్ధం తర్వాత ఇరాన్ మీద ఇప్పటికీ అపనమ్మకం బాగా ఉందని తెలుస్తోంది.

– ముర్తజా హుస్సేన్, పరిశోధనాత్మక జర్నలిస్ట్

ఇన్ బాక్స్

నీతి ఆయోగ్ ఏర్పాటు లక్ష్యం నెరవేరేనా?

ఆరు దశాబ్దాలకు పైగా కొనసాగిన ప్రణాళికా సంఘం స్థానంలో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2015లో 'నీతి ఆయోగ్' లాంటి ఒక అడ్వైజరీ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార సమాఖ్య స్ఫూర్తిని మరింత బలోపేతం చేయటం దీని ప్రధాన ఉద్దేశ్యం. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్ల సమాహారంగా 'టీం ఇండియా'గా, ఒక థింక్ ట్యాంక్‌గా జాతీయ అభివృద్ధి అజెండాతో పని చేసే సంస్థ నీతి ఆయోగ్. దేశాభివృద్ధికి కేంద్ర రాష్ట్రాలు కలిసి పనిచేసే విధంగా కోఆపరేటివ్, కాంపిటీటివ్ ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం; గ్రామస్థాయి నుండి విశ్వసనీయ ప్రణాళికలను రూపొందించటం, వాటి అమలు, పర్యవేక్షణ చేయటం ద్వారా నీతి ఆయోగ్ దేశంలో ఒక బలమైన వ్యూహాత్మక భాగస్వామ్య సంస్థగా పనిచేయాలి.

ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ 9వ సమావేశంలో మాట్లాడుతూ... 'వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్రాలదే కీలక భాగస్వామ్యం. దేశంలోని రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది కాబట్టి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రాలు గ్రామస్థాయి నుండి పనిచేయాలని' పిలుపునిచ్చారు. ప్రణాళిక సంఘం ఆశించిన స్థాయిలో పనిచేయలేదని, ప్రణాళిక దానితో భవిష్యత్తు లక్ష్యాలను సాధించలేమని నీతి ఆయోగ్ ఏర్పాటు జరిగింది. కానీ గడిచిన 9 ఏళ్లలో నీతి ఆయోగ్ విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న ప్రభుత్వాల నుండి అనేక ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఇది కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థగా పనిచేస్తుందని విపక్ష పార్టీల ముఖ్యమంత్రులు ఆరోపిస్తున్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి తొమ్మిది రాష్ట్రాల సీఎంలు గైరు హాజరు కావడం, సమావేశానికి హాజరైన విపక్షాలకు చెందిన ఏకైక ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సమావేశాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోవడంతో నీతి ఆయోగ్ లాంటి సంస్థ ఏర్పాటు చేసిన లక్ష్యాలు నెరవేరేనా అనిపిస్తోంది.

– డాక్టర్ తిరునహరి శేషు,
అర్థశాస్త్ర అధ్యాపకులు, కాకతీయ విశ్వవిద్యాలయం

చెప్పింది ఎంత? కేటాయింపు ఎంత?

అభిప్రాయం



ఎ. మనోహర్ రెడ్డి

రాష్ట్రంలో ఈసారి విద్యాశాఖకు బడ్జెట్‌లో రూ. 21,292 కోట్లు ప్రతిపాదించారు. మొత్తం బడ్జెట్‌లో విద్యాశాఖ వాటా 7.3 శాతమే. రాష్ట్రం ఆవిర్భవించిన సంవత్సరం 2014–15 బడ్జెట్‌లో విద్యా శాఖకు 10.89 శాతం కేటాయించగా తర్వాత నుంచి వాటా తగ్గుతూ వస్తోంది. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో 15 శాతం నిధులిస్తామని చెప్పినా, మాట నిలబెట్టుకోలేకపోయింది. పాఠశాల విద్యాశాఖ పరి ధిలో 26,000 పాఠశాలలున్నాయి. వాటిలో వందల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉపాధ్యాయుల కొరత చాలా తీవ్రంగా ఉంది. 194 ఆదర్శ పాఠశాలలున్నాయి. ఇంటర్ కాలేజీలు 422, డిగ్రీ కాలేజీలు 132 ఉన్నాయి. వీటిలో కూడా బోధన సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈసారి కేటాయించిన విద్యాశాఖ బడ్జెట్‌లో పాఠశాల విద్యకు రూ. 17,942 కోట్లు. సాంకేతిక, ఉన్నత విద్యకు కలిపి రూ. 3,350 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్యలో భాగంగా కళాశాల విద్యాశాఖకు రూ. 600 కోట్లు, ఇంటర్ విద్యాశాఖకు రూ. 834 కోట్లు ప్రతిపాదించారు. మొత్తం పాఠశాల విద్యాశాఖ బడ్జెట్‌లో కనీసం 85 శాతం అంటే రూ. 17,000 కోట్ల పైన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతనానికి పోతాయి. మిగిలిన దాంట్లో సమగ్ర శిక్ష, మధ్యాహ్న భోజనానికి మొత్తం ఖర్చు అవుతుంది. మౌలిక వసతులకు, నూతన భవన నిర్మాణాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేని దుఃస్థితి. మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ నెలకొల్పుతామని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. అయితే బడ్జెట్‌లో అంతర్జాతీయ పాఠశాలలకు రూ. 500 కోట్లు ప్రతిపాదించారు. వాటిని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా పిలవ నున్నారు.

రాష్ట్రంలో ఉన్న 11 విశ్వవిద్యాలయాలకు కేటాయించిన మొత్తం రూ. 500 కోట్లు మాత్రమే. అందులో రూ. 200 కోట్లు ఓయూ, మహిళావర్సిటీలకు; మిగిలిన 10 వర్సిటీలకు రూ. 300 కోట్లు... అంటే ఒక్కొక్క దానికి సగటున రూ. 30 కోట్లు మాత్రమే. మొత్తం 11 యూనివర్సిటీల్లో 1,800 బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ అంశాన్ని బడ్జెట్‌లో సర్కారు ప్రస్తావించలేదు. జేఎన్‌టీయూహెచ్ కింద సిరిసిల్ల, వనపర్తితో పాటు గత ఏడాది మొదలైన పాలేరు, మహబూబాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలకు శాశ్వత భవనాలు లేవు. టీఎస్ ఎమ్‌సెట్‌లో 5 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు కూడా బోధన సిబ్బంది లేమి కారణంగా, ఓయూ ఇంజనీరింగ్ లాంటి కళాశాలలో జాయిన్ కావడానికి నిరాకరిస్తూ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలను ఆశ్రయిస్తున్నారు. మన విద్యా వ్యవస్థ ఎంత దయనీయమైన స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఈసారి కేంద్ర బడ్జెట్‌లో కూడా నిర్మలా సీతారామన్ విద్యా రంగానికి భారీగా కోత పెట్టారు. ముఖ్యంగా యూజీసీకి అత్యధికంగా 60.99 శాతం బడ్జెట్ తగ్గించింది. గత సంవత్సరం రూ. 6,409 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ. 2,500 కోట్లకు పరిమితం చేశారు. దీని ప్రభావం వల్ల మన విశ్వవిద్యాలయాలకు వచ్చే గ్రాంట్స్‌లో భారీ ఎత్తున కోతపెట్టే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ. 1.29 లక్షల కోట్లు కేటాయించగా, ఈసారి రూ. 1.20 లక్షల కోట్లే ఇచ్చి రూ. 9 వేల కోట్లు తగ్గించారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులు లేవు. హాస్టళ్లు తగినన్ని లేవు, పాతబడిన భవనాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని ఆందోళనలో విద్యార్థులున్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు తగినన్ని నిధులను కేటాయించని కారణంగా యూజీ, డిగ్రీ, పీజీ సెమిస్టర్ ఎగ్జామ్స్ ఫీజును రూ. 1,200 నుండి రూ. 4,000లకు భారీగా పెంచారు. ఇది పేద విద్యార్థులకు మోయలేని భారంగా మారిపోయింది. గత మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రూ. 7 వేల కోట్ల బకాయిలు పెండింగ్ ఉన్న కారణంగా అటు విద్యార్థులు, ఇటు ప్రైవేట్ కళాశాలల పరిస్థితి దయనీయమైంది. విద్యా రంగానికి పెద్ద పీట వేసి, కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంది.

వ్యాసకర్త తెలంగాణ విద్యా పరిరక్షణ సమితి చైర్మన్ | 96182 54567

మమకార త్యాగమే ముక్తి!

ఒక వ్యక్తి తన హృదయంలో ఏయే వస్తువులపై, వ్యక్తులపై అధికమైన మమత కలిగి ఉంటాడో, ఆ వస్తువుల నుండి, వ్యక్తుల నుండే అతడికి అధికమైన దుఃఖం కూడా కలిగే అవకాశం ఉంటుంది. ఆ కారణం చేతనే, ప్రాకృతికాలైన విషయ భోగాలతో ఏకత్వాన్ని, మమకారాన్ని త్యజించడమే ముక్తికి మార్గం అని చెప్పారు. సంగత్యాగము వలన సంసారదుఃఖాలు మనసును కలతపెట్టవనీ, నిర్మమత్వమనే సుఖం చేకూరుతుందనీ, ఆ సుఖమునే వైరాగ్యం అంటారనీ, వైరాగ్యం వలన కలిగే జ్ఞానమే సమగ్రమైన జ్ఞానమనీ, సమగ్ర జ్ఞానమే మోక్షార్హమైన జ్ఞానమనీ, మిగిలినది అజ్ఞానంగానే పరిగణించబడుతుందనీ అన్నారు. అలా, మోక్షమనే సాధానికి ప్రాకృతికమైన విషయాలపైనా, వస్తువులపైనా మమకారాన్ని వదలడమన్నది మొదటి మెట్టు అయింది. తాగే నీరు వస్త్రంతో వడకొట్టబడి శుద్ధమైనదిగా మారినట్లుగా... ఏ వ్యక్తిలోనైతే అతడు వేసే అడుగులు కంటితో చూసే చూపుతోనూ, మాట్లాడే మాట సత్యమనే ప్రమాణంతోను, చేసే ఆలోచన సద్బుద్ధితోను వడకొట్టబడి శుద్ధమైనవిగా మారతాయో ఆ వ్యక్తి జ్ఞానానికీ, తద్వారా వైరాగ్యానికీ చేరువవుతాడు. ఈ విషయాన్ని మారన కవి 'మార్కండేయ పురాణం' తృతీయాశ్వాసంలో చెప్పాడు. మమత అనే సంకెళ్లు ఏ వ్యక్తిని బాధించవో ఈ క్రింది కంద పద్యం ద్వారా ఆయన చెప్పాడు.



తనకున్నయదియె యిల్లుగ
దనయాకలి కొదవినదియ తగుభోజ్యముగా
దనకు గలయదియ ధనముగ
మనమున ముద మందుయోగి మమత బొరయునే!

తాటాకులతో కప్పబడిన గుడిసె అయినప్పటికీ, తాను నివసించేదే ప్రాప్తమైన ఇల్లుగా, ఆకలిగా అనిపించిన సమయానికి ఆ పూటకు తినడానికి తనకు ప్రాప్తమయినదే పంచభక్ష్య పరమాన్నంగా, తనకు అప్పటికి కలిగినదే సమస్త సంపదగా మనస్సులో భావించి, అందులోనే ఆనందం అనుభవించే వ్యక్తి యోగి. అతడిని మమకారం అనే సంకెళ్లు ఎప్పటికీ బాధించవు.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

తెలుగు రాష్ట్రాల్లో తగ్గుతున్న పత్రికా స్వేచ్ఛ

- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టులపై నిరంతరం జరుగుతున్న ఆర్గనైజ్డ్ ఆన్‌లైన్ ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. గత కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లో పత్రికా స్వేచ్ఛ తగ్గుతున్నట్టుగా ఉందని, రాజకీయ పార్టీలు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకొని ఆర్గనైజ్డ్ ట్రోల్ ఫారమ్స్, వార్ రూములను నిర్వహిస్తూ వారిపై నిరంతరం ఆన్‌లైన్ ద్వారా దూర్భాషలకు దిగుతున్నాయని తెలిపారు. మహిళా జర్నలిస్టులపై ఆన్‌లైన్ ట్రోల్స్‌ను దర్యాప్తు చేయడానికి, అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు తమ సోషల్ మీడియా విభాగాల కోసం మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. ట్రోలింగ్ చేసే వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు ఐటీ పరిశ్రమకు చెందిన నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టులు తమపై దుష్ప్రచారాలు, బెదిరింపులపై ఫిర్యాదు చేసినప్పుడు సైబర్‌క్రైమ్ పోలీసు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో వేగంగా స్పందించాలని కోరారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ చేశారా?

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తుంటే బీజేపీ నేతలు ఆరోపణలు చేయడం విడ్డూరమని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాఫీ చేసి చూపించారా? అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. రుణమాఫీ విషయంలో అనుమానాలు ఉంటే బీజేపీ నేతలు స్వయంగా వచ్చి నివృత్తి చేసుకోవచ్చని, కానీ రుణమాఫీపై రైతులను గందరగోళంలో నెట్టొద్దని గురువారం మంత్రి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. '2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాలు ఏమయ్యాయి? బీజేపీ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి అడిగితే మీ దగ్గర సమాధానం ఉందా?, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేసి, రైతులను ఆదుకోమని, రాజధాని వీధులకు వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న వారి విజ్ఞప్తులు ఎప్పుడన్నా పట్టించుకున్నారా?, లక్షల కోట్లు ఎగ్గొట్టిన పారిశ్రామిక వేత్తల నుంచి నిధులు రికవరీ చేసి దేశవ్యాప్తంగా ఉన్న రైతుల రుణమాఫీ చేయగల నిబద్ధత మీకుందా?' అని మంత్రి బీజేపీని ప్రశ్నించారు. పీఎం కిసాన్ పథకం కింద రైతులకు అందించే సహాయాన్ని పెంచాలని ఆయన కేంద్రాన్ని కోరారు.

వైద్యారోగ్యశాఖలో మరో 3 హెచ్‌వోడీ పోస్టులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన తర్వాత ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విద్య సంచాలకులు, డ్రగ్స్ కంట్రోలర్, టీవీవీపీ కమిషనర్ పోస్టులు ఏపీకి వెళ్లిన నేపథ్యంలో... ఇప్పటివరకూ తెలంగాణ కేవలం ఇన్‌చార్జ్ పోస్టులతోనే నెట్టుకొచ్చింది. ఇప్పుడు తాజాగా వైద్యారోగ్యశాఖలో మరో మూడు శాఖల అధిపతుల (హెచ్‌వోడీ) పోస్టులు ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పదేళ్లుగా ఈ పోస్టులను తీసుకొచ్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించలేదనే విమర్శల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య విద్యాసంచాలకుల పోస్టును సృష్టించిన సంగతి తెలిసిందే. గురువారం జరిగిన మంత్రి మండలి సమావేశంలోనూ వైద్యారోగ్యశాఖలో మరో మూడు హెచ్‌వోడీ పోస్టుల అంశంపై చర్చించారు. త్వరలోనే ఆ పోస్టులు ఏర్పాటు కానున్నాయని వైద్య వర్గాలు వెల్లడించాయి.

డెంగీతో గర్భిణి మృతి

శస్త్రచికిత్స చేసినా దక్కని కవలల ప్రాణాలు



శాయంపేట: డెంగీతో ఎనిమిది నెలల గర్భిణి మృతి చెందింది. ఆమె గర్భంలోని శిశువుల ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు శస్త్రచికిత్సతో కాన్పు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆమె గర్భంలో ఉన్న కవల శిశువులు కూడా అప్పటికే మృతిచెందారు. హనుమకొండ జిల్లాలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి రాజేందర్‌కు పరకాల మండలం మల్లక్కపేటకు చెందిన దొమ్మాటి లక్ష్మి, భిక్షపతి దంపతుల పెద్ద కూతురు ప్రియాంకతో వివాహమైంది. కాగా, ప్రియాంక అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో ప్రియాంక చెల్లెలు శిరీష (30)ను రెండేళ్ల క్రితం రాజేందర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. శిరీష ఎనిమిది నెలల గర్భవతి. ఈ క్రమంలో ఆదివారం జ్వరం రావడంతో సోమవారం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. ఆమెకు ప్లేట్‌లెట్ కణాలు తగ్గిపోవడంతో గురువారం గర్భంలోని శిశువులను కాపాడేందుకు ఆపరేషన్ చేయగా కవల శిశువులు అప్పటికే మృతిచెందారు. ఆపరేషన్ పూర్తయ్యాక రక్తస్రావం ఎక్కువ కావడంతో శిరీష కూడా చనిపోయింది. శిరీష మృతితో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూడు, నాలుగు రోజుల్లో నిండనున్న సాగర్

182 టీఎంసీలకు నాగార్జున సాగర్ నీటి నిల్వ



శ్రీశైలం ప్రాజెక్టు పదిగేట్ల నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

సాక్షి, హైదరాబాద్/దోమలపెంట: నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి కృష్ణా వరద ఉధృతి మరింత పెరిగింది. గురువారం సాయంత్రం 6 గంటలకు 3,69,866 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 537.4 అడుగుల వద్ద 182.95 టీఎంసీలకు చేరుకుంది. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సాగర్ నిండాలంటే ఇంకా 130 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో మరో మూడు, నాలుగు రోజుల్లో సాగర్ నిండుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి. శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,64,019 క్యూసెక్కుల నీరు చేరుతుండంతో పది గేట్లు 18 అడుగుల మేర ఎత్తి 4,31,370 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ కుడి కేంద్రం నుంచి 24,917, ఎడమ కేంద్రం నుంచి 35,315 వెరసి 4,91,602 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్‌లోకి చేరుతున్న వరద ప్రవాహం గంటగంటకూ పెరుగుతోంది. తుంగభద్రలో కూడా వరద ఉధృతి మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,98,109 క్యూసెక్కుల నీరు చేరుతుండగా 1,79,973 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. మంత్రాలయం వద్ద తుంగభద్ర నీటిమట్టం 311 మీటర్ల(సముద్ర మట్టానికి)కు చేరుకుంది. దీంతో మంత్రాలయం వద్ద అధికారులు ప్రమాదహెచ్చరికను జారీచేసి నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింత పెరగనుంది.

గురువారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రధానపాయలో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
జూరాల	1,045	9.66	1,042.39	8.07	3,15,000	3,03,097
తుంగభద్ర	1,633	105.79	1,631.00	97.87	1,98,109	1,79,973
శ్రీశైలం	885	215.81	883.80	208.72	4,64,019	5,18,202
నాగార్జునసాగర్	590	312.05	537.40	182.95	3,69,866	27,644

గోదావరిలో తగ్గుతున్న వరద

వర్షాలు తగ్గడంతో గోదావరిలో వరద క్రమేణా తగ్గుతోంది దీంతో మేడిగడ్డ బరాజ్‌లోకి 3.62 లక్షలు, తుపాకులగూడెం (సమ్మక్క) బరాజ్‌లోకి 6.26, దుమ్ముగూడెం(సీతమ్మసాగర్) బరాజ్‌లోకి 8.07 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతోంది. వచ్చిన వరదను వచ్చినట్టుగా వదిలేస్తున్నారు. భద్రాచలం వద్ద వరద 8.41 లక్షల క్యూసె క్కులకు తగ్గడంతో నీటిమట్టం 40 అడుగులకు తగ్గింది.

నేడే జాబ్ కేలండర్

▶ మొదటి పేజీ తరువాయి

కార్డుల (హెల్త్ ప్రొఫైల్ కార్డులు)ను విడివిడిగా జారీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. విధివిధానాలు రూపొందించి సత్వరమే ప్రభుత్వానికి నివేదిక సమర్పించడానికి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ మంత్రి పొంగులేటితో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఉపసంఘం నెలలోగా నివేదిక ఇస్తుందని పొంగులేటి చెప్పారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా మళ్లీ కోదండరాం, అమేర్ అలీఖాన్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా హైకోర్టు తీర్పు నేపథ్యంలో గవర్నర్ గతంలో ప్రభుత్వానికి తిప్పివంపడం తెలిసిందే. దీంతో వారి పేర్లనే మళ్లీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పోస్టులకు సిఫారసు చేస్తూ గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

మరికొన్ని కేబినెట్ నిర్ణయాలు

- కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి ప్రకోపానికి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన నేపథ్యంలో కేరళ ప్రభుత్వానికి అవసరమైన ఆర్థిక, వైద్య సహకారం అందించాలి.
- షూటర్ ఈషా సింగ్, బాక్సర్ నిఖత్ జరీన్, టీం ఇండియా క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో 600 చదరపు గజాల చొప్పున ఇంటి స్థలంతోపాటు నిఖత్ జరీన్, సిరాజ్‌కు గ్రూప్–1 స్థాయి ఉద్యోగాలు ఇవ్వాలనే ప్రతిపాదనకు ఆమోదం.
- ఇటీవల విధి నిర్వహణలో మరణించిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీ రాజీవ్ రతన్ కుమారుడు హరి రతన్‌కు మున్సిపల్ కమిషనర్‌గా విధినిర్వహణలో మరణించిన అదనపు డీజీ పి.మురళి కుమారుడికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇవ్వాలన్న ప్రతిపాదనకు ఓకే.
- 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో 2007లో దివంగత సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 437 కోట్లతో సవరించిన అంచనాలకు ఆమోదం.
- ఖాయిలాపడిన నిజాం షుగర్స్ కర్మాగారాన్ని పునరుద్ధరించాలి. మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ప్రకారం రెండు విడతలుగా ఆర్థిక సాయం చేయాలి.
- మూసీ నది ప్రక్షాళనలో భాగంగా మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్ శివారులోని శామీర్‌పేట చెరువుకు తరలించి అక్కడి నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలకు తరలించాలనే ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్. 10 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటికి, మిగిలిన 5 టీఎంసీలను నగర పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో నింపడంతోపాటు మూసీలో నిరంతరం స్వచ్ఛమైన నీళ్లు ఉండేలా వదలాలన్న ప్రతిపాదనకు ఓకే.
- ధరణి సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన నివేదికపై శుక్రవారం శాసనసభలో లఘు చర్చ నిర్వహణకు నిర్ణయం.



గద్దర్ ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి. చిత్రంలో గద్దర్ కుమార్తె వెన్నెల, విమలక్క, ప్రొఫెసర్ ఖాసీం తదితరులు

ట్యాంక్‌బండ్‌పై గద్దర్ విగ్రహాన్ని పెట్టాలి

- గద్దర్ వర్ధంతి సభలో చాడ వెంకట్‌రెడ్డి
- విమలక్క, ప్రొఫెసర్ ఖాసీం, వెన్నెల గద్దర్ హాజరు

సిరిసిల్లటౌన్: ప్రజాయుద్ధనౌక గద్దర్ వ్యక్తి కాదని..సామాజిక శక్తికి ప్రతిరూపమని ఆయన విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గద్దర్ చరిత్రను పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలని కోరారు. సిరిసిల్లలోని వాసవి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన గద్దర్ ప్రథమ వర్ధంతి సభకు చాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శరీరంలో తూటా దిగినా ప్రజలను చైతన్యవంతం చేయడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరుతో నంది అవార్డులు ఇస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భౌతికంగా దూరమైనా గద్దర్ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా ఉన్నారని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్‌పర్సన్ విమలక్క పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన రంగవల్లి అక్క స్మారకార్థం వేములవాడ నందికమాన్ వద్ద ఏర్పాటు చేస్తున్న విజ్ఞాన కేంద్రానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

తెలంగాణ సాహిత్య సెలయేరు: గద్దర్ తెలంగాణ సాహిత్యపు సెలయేరుగా అభివర్ణించిన ప్రొఫెసర్ ఖాసీం... గద్దర్ రచనలు, ఆటపాటలను వివరిస్తూ ప్రసంగించారు. విప్లవోద్యమం ప్రజాచైతన్యాన్ని రగిలించడంలో పదునెక్కే పదాలతో సాహిత్యాన్ని అందించిన తన తండ్రి గద్దర్‌కు జీవ కారుణ్యం ఎక్కువ అని గద్దర్ కుమార్తె వెన్నెల గుర్తు చేసుకున్నారు. కార్యక్రమానికి ముందుగా సిరిసిల్లలో సంతాపర్యాలీ నిర్వహించారు. అనంతరం గద్దర్, ప్రముఖ జర్నలిస్టు జహీరుద్దీన్ అలీఖాన్‌ల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి ఉద్యమకారుడు, ప్రముఖ కళాకారుడు దరువు ఎల్లన్న, ఓయూజేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గద్దర్ వర్ధంతి సభ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రాగుల రాములు, సభ్యులు కత్తెర దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని పీక్కుతిన్న కుక్కలగుంపు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో దారుణం



రామలక్ష్మి (ఫైల్)

ముస్తాబాద్ (సిరిసిల్ల): వీధికుక్కలు జవహర్‌నగర్‌లో బాలుడిని చంపిన ఘటన మరువకముందే మరో దారుణం చోటుచేసుకుంది. అచేతన స్థితిలో అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వృద్ధురాలిపై కుక్కల గుంపు దాడి చేసి ప్రాణాలు తీశాయి. తలను పీకి.. పొట్టను చీల్చి పేగులు, కా లే యాన్ని తినేశాయి. ఈ దారుణ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బట్టోనితాళ్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. బట్టోనితాళ్లకు చెందిన పిట్ల రామలక్ష్మి(85) ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం అర్ధరాత్రి వీధికుక్కల గుంపు విచక్షణారహితంగా దాడిచేసి ముఖాన్ని కొరుక్కుతిని, పొట్టను చీల్చాయి. వృద్ధాప్యం, అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్న రామలక్ష్మి ఎదురుతిరగలేని పరిస్థితిలో ప్రాణాలు విడిచింది. రామలక్ష్మి ము ఖం పూర్తిగా ఛిద్రమై ఎముకలు తేలాయి. ఆమె పడుకున్న మంచంలోనే ప్రాణాలు వదలగా, రక్తం ధారలు కట్టింది.

వేర్వేరు ఇళ్లలో కొడుకులు

రామలక్ష్మి ముగ్గురు కుమారులు బాలరాజు, దేవయ్య, అంజయ్యలు వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో పొద్దంతా పనులకు వెళ్లి వచ్చినవారు బుధవారం రాత్రి గాఢనిద్రలోకి జారుకున్నారు. రామలక్ష్మి తన కున్న ప్రత్యేక గదిలో నిద్రించింది. ఆ గదికి సరైన తలుపులు లేకపోవడంతో రాత్రివేళ కుక్కలు దాడి చేశాయి. మంచంలో ఎంత గింజుకున్నా, కుక్కలు వదల్లేదని అక్కడున్న పరిస్థితులను బట్టి తెలుస్తోంది. అందరూ నిద్రలో ఉండడంతో ఆమె కేకలు ఎవరికీ వినిపించలేదు. గురువారం ఉదయం రామలక్ష్మి కుటుంబీకులు జరిగిన సంఘటన చూసి బోరున విలపించారు. మృతురాలి గదంతా రక్తసిక్తమై, శరీర భాగాలు పడి ఉన్నాయి.

భూమాతగా ధరణి పోర్టల్.. నేడు సభలో సీఎం ప్రకటన!

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో శుక్రవారం ప్రభుత్వం ధరణి పోర్టల్‌పై లఘు చర్చ జరపనుంది. ఈ చర్చలో భాగంగా ధరణి పోర్టల్ పేరును భూమాతగా మార్చడం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఒక మండలంలో ధరణి సమస్యల అధ్యయనం, కొత్త ఆర్‌ఓఆర్ చట్ట ముసాయిదాపై సీఎం రేవంత్ ప్రకటన చేసే అవకాశముంది.

ఏడుగురు నాన్‌కేడర్ ఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు నాన్‌కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ సిటీ ఉమెన్‌సేఫ్టీ వింగ్ ఎస్పీ కవితను హైదరాబాద్ సిటీ డీసీపీ సైబర్‌క్రైమ్స్‌గా, కమాండ్‌కంట్రోల్ సెంటర్ ఎస్పీగా ఉన్న రమణారెడ్డిని మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ డీసీపీగా, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎస్పీ వెంకటేశ్వర్లును ఆక్టోపస్ అడ్మిన్ ఎస్పీగా నియమించారు. మేడ్చల్ ఎస్‌ఓటీ డీసీపీ డి.శ్రీనివాస్‌ను మాదాపూర్ ఎస్‌ఓటీ డీసీపీగా, సీఐడీ ఎస్పీ శ్రీబాలదేవిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా, ఇంటెలిజెన్స్‌లో ఎస్పీగా ఉన్న జి.సునీతామోహన్‌ను తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. టీజీ నార్కోటిక్స్ బ్యూరో అడ్మిన్ ఎస్పీగా ఉన్న వై.సాయిశేఖర్‌ను ఇంటిలిజెన్స్ ఎస్పీగా, జగిత్యాల అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఎస్.వినోద్‌కుమార్‌ను ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.

రూ. 4.27 కోట్ల విలువైన ఆభరణాలు.. కోటి నగదు

- ఏపీ మహేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ కేసులో ఈడీ అధికారుల సోదాలు
- పలు ప్రాపర్టీ డాక్యుమెంట్లు, బ్యాంక్ లాకర్ల తాళాలు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: ఏపీ మహేశ్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మనీలాండరింగ్ కేసులో భాగంగా బుధవారం జరిపిన సోదాల్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు పట్టుబడినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తెలిపారు. బంజారాహిల్స్‌లోని బ్యాంక్ హెడ్ క్వార్టర్స్‌తో పాటు చైర్మన్ రమేశ్‌కుమార్ బంగ్, ఎండీ ఉమేష్ చంద్ అస్వా, వైస్ చైర్మన్ పురుషోత్తం మందనతో పాటు ఇతర డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాలు సహా హైదరాబాద్‌లోని ఏడు ప్రాంతాల్లో బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సోదాల్లో రూ.కోటి నగదు, రూ.4.27 కోట్ల విలువైన ఆభరణాలు, 6,256 యూఎస్ డాలర్లు, పలు ప్రాపర్టీ డాక్యుమెంట్లు, అనుమానాస్పద ఫైళ్లు, డిజిటల్ డివైజ్‌లు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకు లాకర్ల తాళాలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వక్ఫ్‌బోర్డు భూముల పేరిట, లేని ఆస్తులకు నకిలీ పత్రాలు సృష్టించి వాటిద్వారా అనర్హులైన 1,800 మందికి రూ.300 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేశారు. అదేవిధంగా బ్యాంకు నుంచి రూ. 18.30 కోట్లు దారి మళ్లించారనే ఆరోపణలతో గతంలో బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. బ్యాంక్ షేర్ హోల్డర్స్ అసోసియేషన్ సెక్రటరీ శ్యామ్‌సుందర్ బియాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు బుధవారం సోదాలు చేశారు. నకిలీ పత్రాలతో రుణాలు మంజూరు చేసిన వారి నుంచి 10 శాతం కమీషన్ తీసుకున్నట్టు గుర్తించారు. రుణాలుగా ఇచ్చిన మొత్తాలు కమీషన్లు, వివిధ లావాదేవీల ద్వారా తిరిగి నిందితుల కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లినట్టు ఈడీ దర్యాప్తులో తేలింది.

ముంబై, ఢిల్లీ సరసన హైదరాబాద్!

▶ మొదటి పేజీ తరువాయి

ఆనుకొని ఉన్న ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయితీలను కలిపి అతిపెద్ద కార్పొరేషన్‌గా రూపొందించాలని సీఎం ఇప్పటికే మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) పేరుతో ఇప్పటికే ఓ సంస్థను ఏర్పాటు చేశారు. 2,053 చదరపు కిలోమీటర్ల పరిధిలోని జీహెచ్‌ఎంసీతోపాటు శివారు పురపాలికలు, గ్రామాల్లో విపత్తుల నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ఆక్రమణలను తొలగించడం, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సరఫరాలో కీలకంగా వ్యవహరించేలా ఈ సంస్థకు విధులు అప్పగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో జీహెచ్‌ఎంసీ, పురపాలికల్లో గ్రామాల విలీనానికి సంబంధించి సీఎం రేవంత్.. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీతక్కతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ వీలైనంత త్వరలో నివేదిక ఇవ్వనుంది.

గ్రామాలు పురపాలికల్లో... ఆ తరువాత జీహెచ్‌ఎంసీలో

జీహెచ్‌ఎంసీ 650 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉండగా రక్షణ శాఖ పరిధి నుంచి ప్రభుత్వ అధీనంలోకి వచ్చిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ 40.17 చ.కి.మీ. విస్తీర్ణంలో ఉంది. 2024 జనాభా అంచనాల ప్రకారం ఈ రెండింటిలో కలిపి 1.06 కోట్ల జనాభా ఉంది. ఇవి కాకుండా శివార్లలోని బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీని ఆనుకొని ఓఆర్ఆర్ లోపలే ఉన్నాయి. వాటితోపాటు మరో 20 మున్సిపాలిటీలు, 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. విలీన ప్రక్రియలో భాగంగా ఇప్పటికే పాలకమండళ్ల పదవీకాలం ముగిసిన పంచాయతీలను వాటికి సమీపంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేయనున్నారు. ఆయా గ్రామాలను పురపాలికల్లో కలిపిన అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ పూర్తికానుంది.

ఓఆర్ఆర్ అవల ఉన్న కొన్నింటిని కూడా...

హైడ్రా ప్రాజెక్టులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు సంగారెడ్డి జిల్లా పరిధిలోని బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు, ఓఆర్ఆర్ అవతల ఉన్న ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, దుండిగల్ వంటి రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలను కూడా కలిపారు. 33 గ్రామ పంచాయతీల్లో ఓఆర్ఆర్ అవల సైతం కొన్ని గ్రామాలు ఉన్నాయి. అయితే జీహెచ్‌ఎంసీలో వాటి విలీనం ఉంటుందా ఉండదా అనే విషయాన్ని మంత్రివర్గ ఉపసంఘం తేలుస్తుందని ఓ అధికారి తెలిపారు.

విలీనమైతే భారీ నగరాల చెంతన

ఓఆర్ఆర్ లోపలి పట్టణాలు, గ్రామాలు జీహెచ్‌ఎంసీలో విలీనమైతే 'హైడ్రా'పరిధిలో జనాభా 1.29 కోట్లకు చేరుతుంది. గ్రేటర్ ముంబైలో 2011 లెక్కల ప్రకారం జనాభా 1.24 కోట్లుకాగా తాజా అంచనాల ప్రకారం ఈ జనాభా 1.75 కోట్లకు చేరవచ్చని తెలుస్తోంది. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) జనాభా కూడా 2011 లెక్కల ప్రకారం 1.10 కోట్లుగా ఉండగా తాజా లెక్కల్లో కోటిన్నరకు చేరుకొనే అవకాశం ఉంది. బృహత్ బెంగళూరు జనాభా 68 లక్షలుకాగా జీహెచ్‌ఎంసీలో జనాభా 2011 లెక్కల ప్రకారం 69.93 లక్షలుగా ఉంది. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీలో శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు విలీనమైతే ముంబై, ఢిల్లీ తరహాలో అధిక జనాభాగల నగరాల సరసన చేరనుంది.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- వైబ్రంట్ అకాడమీ నిర్లక్ష్యంతోనే తమ కూతురు చనిపోయిందని తల్లిదండ్రుల ఆరోపణ
- ఫర్నిచర్ ధ్వంసం.. అకాడమీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు



ఎనుముల భవాని (ఫైల్)



పోలీసులతో విద్యార్థిని బంధువుల వాగ్వాదం

హనుమకొండ: ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన ఎనుముల జనార్దన్‌రెడ్డి – సుమతి దంపతుల కూతురు భవాని (17) హనుమకొండ నక్కలగుట్టలోని వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తోటి విద్యార్థులతో కలిసి అకాడమీ హాస్టల్ గదిలో ఉంటోంది. సెలవుల తర్వాత భవాని గత నెల 24వ తేదీన అకాడమీకి వచ్చింది. బుధవారం రాత్రి తోటి విద్యార్థులంతా భోజనానికి వెళ్లారు. భోజనానికి రమ్మని భవానిని అడగ్గా, మీరు వెళ్లండి.. నేను వస్తానని తోటి విద్యార్థులకు చెప్పింది. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదుగాని రాత్రి 10.30 గంటలకు వార్డెన్‌లు ఫోన్ చేసి 'మీ కూతురుకు కడుపు నొప్పి వచ్చింది. ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళితే ఎంజీఎంకు తీసుకెళ్లమని సూచించారని, మీరు వెంటనే రావాలని చెప్పినట్టు తల్లిదండ్రులు వాపోయారు. తీరా ఇక్కడికి వచ్చిన తర్వాత గదిలో ఒంటరిగా ఉండి ఉరేసుకుందని తెలిసిందని, తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదన్నారు. మంచిగానే చదివేదని, కళాశాల యాజమాన్యం ఒత్తిడి, నిర్లక్ష్యంతో చనిపోయిందని బోరున విలపించారు. మృతిపై అనుమానాలున్నాయని చెప్పారు. తమకు తెలిసిన వారిని ఎంజీఎంకు పంపితే అక్కడ భవానిని తీసుకొచ్చారని చికిత్స అందించి పంపామని చెప్పారని కన్నీటిపర్యంతమయ్యారు. తమ కూతురు మృతికి అకాడమీ యజమాన్యమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం విద్యార్థిని కుటుంబసభ్యులు, బంధువులు అకాడమీ వద్ద ఆందోళనకు దిగారు. ఆగ్రహంతో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. విద్యార్థిని మృతి సమాచారం తెలుసుకున్న ఆయా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అక్కడకు వచ్చి ఆందోళన చేపట్టారు. దీంతో నక్కలగుట్టలోని వైబ్రంట్ అకాడమీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. పోలీసులు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పి విద్యార్థి, యువజన సంఘాల నాయకులను శాంతింపజేశారు. భవాని తండ్రి జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై వివరణ కోరేందుకు అకాడమీ యాజమాన్యాన్ని సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఉపాధి లేక... అప్పులు తీరక

చేనేత కార్మికుడి బలవన్మరణం



రమేశ్ (ఫైల్)

రామడుగు/గంగాధర: ఉపాధి లేక.. కుటుంబ పోషణకు చేసిన అప్పులకు తోడు అనారోగ్య సమస్యలు వేధించడంతో మనస్తాపానికి గురైన చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలో జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోలిరామయ్యపల్లికి చెందిన మిట్టపల్లి రమేశ్ స్వగ్రామంలో ఉపాధి లేక అత్తగారి ఇల్లు షానగర్‌కు వెళ్లాడు. అక్కడ రెండు మరమగ్గాలు ఏర్పాటు చేసుకుని భార్య రేణుకతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా మరమగ్గం పనులు ఆశించిన స్థాయిలో లేక.. కుటుంబపోషణకు అప్పులు చేశాడు. వీటికితోడు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈక్రమంలో జూలై 31న గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చేనేత పరిశ్రమలో కూలి పనికి వెళ్లినా పని లభించలేదు. దీంతో పురుగు మందు కొనుగోలు చేసి గంగాధర మండలం కురిక్యాల శివారులోని బొమ్మలమ్మగుట్ట వద్ద తాగాడు. సమీపాన పొలాల్లో పనులు చేస్తున్న కూలీలు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఒక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష యుద్ధమే!

- నేరుగా దాడులు చేయండి
- ఇరాన్ సైన్యానికి సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఆదేశాలు
- మేము సైతం సిద్ధంగా ఉన్నాం.. ప్రతిస్పందించిన ఇజ్రాయెల్


టెహ్రాన్/బీరుట్: ఒకవైపు గాజాలో మారణకాండ సాగిస్తూ, మరోవైపు హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియేను పొట్టనపెట్టుకున్న ఇజ్రాయెల్ దుశ్చర్య పట్ల ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం నేర్పాలన్న కృతనిశ్చయంతో ఆయన ఉన్నారు. హనియే హత్యకు ఇక ప్రతీకారం తీర్చుకోక తప్పదని భావిస్తున్నారు. ఇజ్రాయెల్‌పై నేరుగా దాడి చేయాలని ఆయన తమ సైన్యానికి తాజాగా స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు ముగ్గురు ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. హనియే హత్యపై ప్రకటన వెలువడగానే బుధవారం ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అత్యవసరంగా సమావేశమైంది. చాలా అసాధారణ పరిస్థితుల్లోనే ఇలాంటి సమావేశం నిర్వహిస్తారు. తాజా పరిణామాలపై ఈ భేటీలో ఖమేనీ సమీక్ష నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై నేరుగా దాడులకు దిగాలని సైనికాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇజ్రాయెల్‌కు బుద్ధి చెప్పడానికి ఇక ప్రత్యక్ష యుద్ధం తప్పదని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఇదిలా ఉండగా, పూర్తిస్థాయి యుద్ధానికి తాము సైతం సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ఇరాన్‌కు సందేశం చేరవేసినట్లు ఇజ్రాయెల్‌కు చెందిన 'చానెల్ 12' తెలియజేసింది. తమ దేశంపై ఇరాన్ గానీ, దాని మిత్రదేశాలు గానీ దాడులకు దిగితే పూర్తిస్థాయి యుద్ధం మొదలైనట్లేనని ఇజ్రాయెల్ తేల్చిచెప్పినట్లు వివరించింది.

భారీ మూల్యం తప్పదు: నెతన్యాహూ

ఇస్మాయిల్ హనియేను హత్య చేసింది ముమ్మాటికీ ఇజ్రాయెల్ సైన్యమేనని ఇరాన్, హమాస్ ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇజ్రాయెల్ ఇంకా నోరువిప్పలేదు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తాజాగా స్పందించారు. తమ దేశం వైపు కన్నెత్తి చూస్తే శత్రువులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తమకు మరిన్ని సవాళ్లు ఎదురవుతాయని భావిస్తున్నామని 'అసోసియేటెడ్ ప్రెస్'తో మాట్లాడుతూ చెప్పారు.

ఇస్మాయిల్ హనియేకు ఖమేనీ నివాళులు

ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు విడిచిన హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియేకు, ఆయన అంగరక్షకుడికి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఘనంగా నివాళులర్పించారు. గురువారం టెహ్రాన్ యూనివర్సిటీలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో హనియే, సెక్యూరిటీ గార్డు శవపేటికల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



హమాస్ మిలిటరీ చీఫ్ మొహమ్మద్ దీఫ్ హతం

ధ్రువీకరించిన ఇజ్రాయెల్ సైన్యం



జెరూసలేం: హమాస్ మిలటరీ విభాగం 'ఖస్సం బ్రిగేడ్స్' అధినేత మొహమ్మద్ దీఫ్‌ను ఖతం చేశామని ఇజ్రాయెల్ సైన్యం గురువారం ఒక ప్రకటనలో తేల్చిచెప్పింది. జూలై 13న దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ సిటీ శివారులో ఓ కాంపౌండ్‌పై నిర్వహించిన వైమానిక దాడులో అతడు హతమయ్యాడని వెల్లడించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు తాజాగా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నట్లు పేర్కొంది. ఇరాన్‌లోని టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేను హత్య చేసిన మరుసటి రోజే మొహమ్మద్ దీఫ్ మృతిని ఇజ్రాయెల్ నిర్ధారించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో ఇళ్ల మధ్యనే వరద ప్రవాహం

ఉత్తరాన వరుణాగ్రహం

7 రాష్ట్రాల్లో మొత్తంగా 36 మంది దుర్మరణం

- ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి
- హిమాచల్‌ప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు
- దేశ రాజధానిని ముంచేసిన వాన

డెహ్రాడూన్/సిమ్లా/న్యూఢిల్లీ/జైపూర్: కేరళ కొండల్లో బురద, బండరాళ్లు సృష్టించిన విలయ విషాద ఘటన మరువకముందే ఉత్తరాదిపై వరుణుడు తన ప్రకోపం చూపించాడు. ఉత్తరాఖండ్ మొదలు రాజస్థాన్‌దాకా ఉత్తరభారత రాష్ట్రాల్లో ఎడతెగని వానలు పడ్డాయి. దీంతో ఏడు రాష్ట్రాల్లో కలిపి మొత్తంగా 36 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్‌లో 12 మంది, హిమాచల్ ప్రదేశ్‌లో ఐదుగురు, ఢిల్లీలో ఆరుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు, హరియాణాలో ముగ్గురు, రాజస్థాన్‌లో ముగ్గురు, బిహార్‌లో ఐదుగురు చనిపోయారు. చాలా మంది జాడ గల్లంతైంది. నదులు ఉప్పొంగి ప్రవహిస్తూ సమీప జనావాసాలను తమలో కలిపేసుకున్నాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కొండప్రాంతాల్లోని ఇళ్లు నేలమట్టమయ్యాయి. పలుచోట్ల రోడ్లు తెగిపోయాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. ఎన్‌డీఆర్ఎఫ్, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, పోలీసులు, స్థానికులు ముమ్మర సహాయక చర్యల్లో మునిగిపోయారు.

ఉత్తరాఖండ్‌లో ఎక్కువ మరణాలు

ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి కారణంగా 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. నదులు ఉప్పొంగి ప్రవహిస్తూ సమీప ఇళ్లను నేలమట్టంచేశాయి. హరిద్వార్, తెహ్రీ, డెహ్రాడూన్, ఛమోలీ జిల్లాలో వర్షపాత ప్రభావం ఎక్కువగా ఉంది. హరిద్వార్‌లోని రోషనాబాద్‌లో 210 మిల్లీమీటర్లు, డెహ్రాడూన్‌లో 172 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెహ్రీ జిల్లా జఖన్‌యాలీ గ్రామంలో రోడ్డ పక్కన రెస్టారెంట్‌పై కొండచరియలు పడటంతో ఒకే కుటుంబంలో ముగ్గురు మట్టిపెళ్లల కింద సజీవసమాధి అయ్యారు. గౌరీకుండ్-కేదార్‌నాథ్ కొండ మార్గంలో పాతిక మీటర్ల దారి వర్షాలకు కొట్టుకుపోవడంతో భీమ్‌బలీ చౌక్ వద్ద చిక్కుకుపోయిన 1,525 మందిలో 425 మందిని సురక్షితంగా తీసుకొచ్చామని సీఎం చెప్పారు. 1,100 మందిని సోనప్రయాగ్‌కు సురక్షితంగా తీసుకొచ్చామని విపత్తు కార్యదర్శి వినోద్ సుమన్ చెప్పారు. మిగతా వారిని హెలికాప్టర్లలో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హిమాచల్‌లో 50 మంది జాడ గల్లంతు

హిమాచల్ ప్రదేశ్‌నూ వర్షాలు ముంచెత్తాయి. వర్ష సంబంధ ఘటనల్లో ఐదుగురు మరణించారు. వేర్వేరు జిల్లాల్లో మొత్తంగా 50 మంది జాడ గల్లంతైంది. పలు వంతెనలు, రోడ్లు, ఇళ్లు వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. మండీ, రాంపూర్, సిమ్లా జిల్లాల్లో వర్షప్రభావం ఎక్కువగా ఉంది. మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారిపై చాలాచోట్ల కొండచరియలు పడటంతో రాకపోకలు స్తంభించాయి. గల్లంతైన వారి జాడ కోసం ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు డ్రోన్ల సాయంతో గాలిస్తున్నారు. కూలూలోని మలానా డ్యామ్ పై నుంచి నీరు కిందకు ప్రవహిస్తోంది. దీంతో భారీఎత్తున నీరు దిగువ ప్రాంతాలను ముంచేసింది. దీంతో ఎగువ ప్రాంతాలకు తక్షణం వెళ్లిపోవాలని స్థానికులకు అధికారులు హెచ్చరికలు పంపారు.

ఢిల్లీలో 108 మిల్లీమీటర్ల వర్షపాతం

గురువారం ఢిల్లీలో వర్ష సంబంధ ఘటనల్లో ఆరుగురు చనిపోయారు. 24 గంటల వ్యవధిలో ఢిల్లీలో 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత 14 ఏళ్లలో ఢిల్లీలో జూలై నెలలో ఒక్కరోజులో ఇంతటి వర్షం పడటం ఇదే తొలిసారి. ముఖ్యంగా మయూర్‌విహార్ వద్ద 147 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

ఆగని మరణ మృదంగం

తీసే కొద్దీ గుట్టలుగా బయటపడుతున్న మృతదేహాలు

- కేరళ విలయ ఘటనలో 289కి చేరిన మరణాల సంఖ్య
- ముమ్మర గాలింపు చర్యల్లో ఆర్మీ

వయనాడ్(కేరళ): కనీవిని ఎరుగని పెను విషాదం నుంచి కేరళ ఇంకా తేరుకోలేదు. మరుభూమిలా మారిన తమ సొంత భూమి నుంచి బయటకు తీస్తున్న ఆప్తుల పార్థివదేహాలను చూసిన బంధువులు, స్నేహితుల ఆక్రందనలతో ఆ ప్రాంతాలు మార్మోగుతున్నాయి. ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ కుగ్రామాల్లో ఇప్పటిదాకా మృతిచెందిన వారి సంఖ్య తాజాగా 289కి పెరిగింది. ఇంకా 200 మందికిపైగా స్థానికుల జాడ గల్లంతైంది. కాలంతోపోటీపడుతూ సైన్యం, ఎన్‌డీఆర్ఎఫ్, కోస్ట్‌గార్డ్, పోలీసు, స్థానిక యంత్రాంగం ముమ్మర గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. అయితే భీతావహంగా మారిన అక్కడి పరిసరాలు సహాయక చర్యలకు పెద్ద అవరోధంగా తయారయ్యాయి. కూలిన వంతెనలు, కొట్టుకుపోయిన రోడ్లు, కొట్టుకొచ్చిన పెద్దపెద్ద బండరాళ్లు, బురదమయమై నేల, కూలిన చెట్లు, వరద ప్రవాహం, భారీ వర్షం మధ్య సహాయక చర్యలు కొనసాగించడం అక్కడి బృందాలకు పెద్ద సవాల్‌గా మారింది. కాగా, ఇప్పటివరకు 91 శిబిరాలకు 9,328 మందిని తరలించామని కేరళ రెవిన్యూ మంత్రి కె.రాజన్ చెప్పారు. 225 మంది ఆస్పత్రుల్లో చేరగా 96 మందికి చికిత్స కొనసాగుతోంది.

ఇది జాతి విపత్తు: రాహుల్

గతంలో సొంత నియోజకవర్గమైన వయనాడ్‌లో జరిగిన ఈ ఘోర విపత్తు చూసి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చలించిపోయారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు రాహుల్, ప్రియాంకా గాంధీ కేరళకు వచ్చారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో వర్షంలోనే పర్యటించారు. తర్వాత మేప్పాడిలోని ఆస్పత్రుల్లో క్షతగాత్రులను, సహాయక శిబిరాల్లో బాధితుల బంధువులను కలిసి పరామర్శించారు. ''ఇది వయనాడ్, కేరళలో భారీ విషాదం నింపింది. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందాల్సిందే. కుటుంబసభ్యులు, సొంతిళ్లను కోల్పోయిన స్థానికులను చూస్తుంటే మాటలు రావడం లేదు. సర్వం కోల్పోయిన వారిని ఎలా ఓదార్చాలో, వారికెలా ధైర్యం చెప్పాలో తెలీడం లేదు. ఇది జాతీయ విపత్తు' అని రాహుల్ అన్నారు. '' ఇంతటి మహా విషాదాన్ని చూస్తుంటే మా నాన్న చనిపోయిన సందర్భం గుర్తొస్తోంది. అయితే వీళ్లు తమ నాన్నను మాత్రమే కాదు.. మొత్తం కుటుంబాన్నే కోల్పోయారు. నేను బాధపడుతున్నదానికంటే అంతులేని విషాదం వీరి జీవితాల్లో ఆవహించింది. వయనాడ్ బాధితులకు అందరూ అండగా నిలబడటం గర్వించాల్సిన విషయం. దేశ ప్రజలు బాధితులకు ఆపన్నహస్తం అందిస్తారు' అని రాహుల్ అన్నారు.

పారిపోదామనుకున్నా: వైద్యురాలి ఆవేదన

ధైర్యంగా పోస్ట్ మార్టమ్ చేసే వైద్యురాలు సైతం మృతదేహాలు ఛిద్రమైన తీరు చూసి డాక్టర్ మనసు కకావికలమైన ఘటన వయనాడ్‌లోని స్థానిక ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఇంతటి హృదయవిదారక దృశ్యాన్ని ఏనాడూ చూడలేదని బాధితుల మృతదేహాలకు పోస్ట్ మార్టమ్ చేసిన ప్రభుత్వ వైద్యురాలు గద్గద స్వరంతో చెప్పారు. '' ఎన్నో రకాల పోస్ట్‌మార్టమ్‌లు చేశాగానీ ఇలాంటివి ఇదే మొదలు. ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న వైద్యులు శవపరీక్ష సమయంలో గుండెనిబ్బరంతో ఉంటారు. కానీ భారీ బండరాళ్లు పడిన ధాటికి దెబ్బతిన్న మృతదేహాలను చూశాక నాలో స్థైర్యం పోయింది. కొన్ని మృతదేహాలు పూర్తిగా చితికిపోయాయి. ఒకదానివెంట మరోటి తెస్తూనే ఉన్నారు. ఎక్కువ మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా రూపు కోల్పోయాయి. ఒక ఏడాది చిన్నారి మృతదేహం దారుణంగా దెబ్బతింది. ఇక నా వల్ల కాదు.. క్షతగాత్రుల సహాయక శిబిరానికి పారిపోదామనుకున్నా. కానీ ఇంకోదారిలేక వృత్తిధర్మం పాటిస్తూ 18 మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్ చేశా. తర్వాత కేరళలోని వేర్వేరు ప్రాంతాల నుంచి సర్జన్లు వచ్చారు. రాత్రి 11.30కల్లా 93 పోస్ట్‌మార్టమ్‌లు పూర్తిచేశాం. ఈ ఘటనను జీవితంలో మర్చిపోను' అని వైద్యురాలు తన అనుభవాన్ని చెప్పారు.

కదిలొచ్చిన తల్లి హృదయం

తల్లులను కోల్పోయిన పసిపిల్లలు పాల కోసం గుక్కపెట్టి ఏడుస్తున్న దృశ్యాలను చూసిన ఒక తల్లి అనుకున్న తడవుగా వయనాడ్‌కు పయనమైంది. నాలుగు నెలల బిడ్డకు తల్లి అయిన ఆమె విషాదవార్త తెలియగానే వయనాడ్‌కు భర్త, పిల్లలతో కలిసి బయల్దేరారు. సెంట్రల్ కేరళలోని ఇడుక్కి నుంచి వస్తున్న ఆమెను మీడియా పలకరించింది. '' నాకూ చంటిబిడ్డ ఉంది. తల్లిపాల కోసం బిడ్డపడే ఆరాటం నాకు తెలుసు. అందుకే నా చనుబాలు ఇచ్చి అక్కడి అనాథలైన పసిబిడ్డల ఆకలి తీరుస్తా' అని ఆమె అన్నారు. కాగా, కేరళ బాధితులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ అమెరికా అధ్యక్షుడు బైడెన్ తన సంతాప సందేశం పంపించారు. అవిశ్రాంతంగా సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్మీని ఆయన అభినందించారు.



వయనాడ్‌లో బాధితులను ఓదార్చుతున్న రాహుల్, ప్రియాంకా గాంధీ

బయట పేపర్.. లోపల వాటర్ లీకేజీ

నూతన పార్లమెంట్‌లో వర్షపు నీరు కారుతుండటంతో విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: ఢిల్లీని ముంచెత్తిన వరుణుడు పార్లమెంట్ వేదికగా విపక్షాలకు కొత్త విమర్శనాస్త్రాన్ని అందించాడు. గత ఏడేళ్లలో 15 రాష్ట్రాల పరిధిలో ఏకంగా పలురకాలైన 70 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకవడంపై కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న విషయం విదితమే. గురువారం పడిన వర్షాలకు నూతన పార్లమెంట్ భవంతిలోని లాబీ పైకప్పు నుంచి వర్షపు నీరు ధారగా పడుతోంది. దీంతో పేపర్ లీకేజీలను వాటర్ లీకేజీతో ముడిపెడుతూ విపక్షాలు భవన నిర్మాణ పటిష్టతను ఎత్తిచూపాయి. '' పేపర్ లీకేజీ బయట. వాటర్ లీకేజీ లోపల. రాష్ట్రపతి విచ్చేసినపుడే వినియోగించే లాబీ పైకప్పు నుంచి ధారగా పడుతున్న వర్షపు నీరు.. భవంతి ఏ మేరకు పటిష్టంగా ఉందనే చేదు నిజాన్ని చాటుతోంది. ఈ విషయమై లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెడతా' అని కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు మాణిక్కం ఠాకూర్ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. వర్షపు నీటి కోసం బకెట్ పట్టడం, అక్కడి వారంతా చూస్తూ వెళ్తున్న వీడియోను పోస్ట్‌చేశారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సైతం విమర్శించారు. '' ఈ భవంతి కంటే పాత భవనమే నయం. ఎంపీలంతా మాట్లాడుకోవడానికి వర్షపు నీరు పడని చోటు ఉండేది. వేల కోట్లతో మళ్లీ కొత్త భవంతి రిపేర్లు పూర్తయ్యేదాక ఎంపీలు పాత భవంతికి మారితే మంచిదనుకుంటా' అని వ్యంగ్య పోస్ట్ చేశారు. గాజు డోమ్‌ల మధ్య ప్రాంతాలను అతికించే జిగురు జారిపోవడంతో అక్కడి నుంచి మాత్రమే నీరు లీక్ అయిందని, వెంటనే సమస్యను పరిష్కరించామని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో స్పష్టంచేసింది.



పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు కురుస్తున్న దృశ్యం

విస్తరణవాదం కాదు.. అభివృద్ధి కావాలి: మోదీ



న్యూఢిల్లీ: విస్తరణవాదం కాదు... అభివృద్ధి కావాలంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరోక్షంగా చైనాకు చురక అంటించారు. తమ మద్దతు ఎల్లప్పుడూ అభివృద్ధికేనని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ, వియత్నాం ప్రధానమంత్రి ఫామ్ మిన్‌చిన్ గురువారం ఢిల్లీలో సమావేశమయ్యారు. అంతర్జాతీయ, ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్-వియత్నాం మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, పరస్పర సహకారంపై చర్చించారు. ఇరుదేశాల మధ్య సంబంధ బాంధవ్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఒక కార్యాచరణ ప్రణాళికను ఆమోదించారు. వియత్నంలో భారత ప్రభుత్వ సహకారంతో నిర్మించిన ఆర్మీ సాఫ్ట్‌వేర్ పార్కును ఇరువురు ప్రధానమంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంధనం, సాంకేతికత, రక్షణ రంగంలో పరస్పర సహకారం తదితర అంశాల్లో ఆరు అవగాహనా ఒప్పందాలపై(ఎంఓయూ) సంతకాలు చేశారు. మరో మూడు ఒప్పందాలను ఖరారు చేశారు. మూడు రోజుల భారత పర్యటన నిమిత్తం ఫామ్ మిన్‌చిన్ మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే.

ఖేడ్కర్‌కు ఢిల్లీ కోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: అధికార దుర్వినియోగం, తప్పుడు ధృవీకరణ పత్రాలతో సివిల్స్ రాసిన మాజీ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు గురువారం ఢిల్లీ న్యాయస్థానంలో చుక్కెదురైంది. చీటింగ్, తప్పుడు మార్గంలో ఓబీసీ, వైకల్య కోటా లబ్ధిపొందటం వంటి నేరాలకు పాల్పడ్డారంటూ ఖేడ్కర్‌పై ఢిల్లీ పోలీసులు ఇప్పటికే కేసు నమోదుచేయడం తెల్సిందే. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీ కోర్టులో ఖేడ్కర్ ముందస్తు బెయిల్ పిటిషన్ పెట్టుకున్నారు. అయితే ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు అదనపు సెషన్స్ జడ్జి దేవేందర్ కుమార్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ఖేడ్కర్ తరఫు లాయర్ వాదనలను బుధవారం విన్న జడ్జి తీర్పును రిజర్వ్‌చేసి గురువారం వెల్లడించారు.

మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష పెట్టుకోవచ్చు: యూజీసీ

న్యూఢిల్లీ: క్యూట్(కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్) ఆధారంగా విద్యార్థులను జాయిన్ చేసుకున్న తర్వాత కూడా మిగిలే సీట్లపై వర్సిటీలకు యూజీసీ స్పష్టత ఇచ్చింది. అర్హత పరీక్షలో మార్కుల ప్రాతిపదికన లేదా సొంతంగా ప్రవేశ పరీక్ష నిర్వహించుకుని ఆయా సీట్లను భర్తీ చేసుకోవచ్చని పేర్కొంది. మిగిలిన సీట్లను విద్యాసంవత్సరమంతా ఖాళీగా ఉంచడమంటే వనరుల వృథాయే కాదు..సెంట్రల్ వర్సిటీల్లో చదువుకోవాలని ఆశపడే విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను నిరాకరించడం కూడా అవుతుందని వ్యాఖ్యానించింది. క్యూట్‌కు హాజరై, కొన్ని కోర్సుల కోసం సంబంధిత వర్సిటీలకు దరఖాస్తు చేసుకోని వారి పేర్లను పరిశీలించుకోవచ్చని తెలిపింది.

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: మోటార్ వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై క్షతగాత్రులుగా మారినవారికి నగదు రహిత చికిత్స అందించే పథకాన్ని రూపొందించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖమంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఈ పథకాన్ని ఛత్తీస్‌గఢ్, అస్సాంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి-జన ఆరోగ్య యోజన(ఏబీపీఎం-జేఏవై) కింద క్షతగాత్రులు ప్రమాదం జరిగిన తేదీ నుంచి వారం రోజులపాటు నిర్దేశిత ఆసుపత్రుల్లో గరిష్ఠంగా రూ.1.5 లక్షల విలువైన వైద్యం పొందవచ్చని చెప్పారు. నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్ఏ) భాగస్వామ్యంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. మోటార్ వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 164బీ కింద ఏర్పాటైన మోటార్ వాహనాల ప్రమాద నిధి నుంచి ఈ పథకానికి అవసరమైన నిధులు సర్దుబాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నైజీరియాలో బాంబు పేలుడు

16 మంది దుర్మరణం

అబూజా: నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో ఒక దుకాణసముదాయంలో అమర్చిన బాంబు పేలిన ఘటనలో 16 మంది చనిపోయారు. డజన్ల మంది గాయపడ్డారు. బుధవారం ఉదయం 8 గంటలకు కవోరీ ప్రాంతంలోని ఒక టీ దుకాణంలో ఈ పేలుడు సంభవించింది. దాడి చేసింది తామేనని ఇంతవరకు ఏ ఉగ్రసంస్థా ప్రకటించుకోలేదు. కానీ చాన్నాళ్లుగా పలు దాడులకు కారణమైన బోకో హరామ్ ఉగ్రసంస్థే ఈ దాడికి పాల్పడి ఉంటుందని స్థానిక అధికారులు అనుమానిస్తున్నారు. బోకో హరామ్, దాని చీలిక వర్గం ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్‌ల దాడులు, అంతర్యుద్ధం కారణంగా నైజీరియా, కామెరూన్, నైజర్, చాద్ దేశాల్లో గత 15 సంవత్సరాల్లో 35,000 మందికిపైగా ప్రజలు చనిపోయారు.

ఈ వ్యత్యాసాలు ఎందుకు?

ఈసీని డిమాండ్ చేసిన ఏడీఆర్

న్యూఢిల్లీ: ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఎందుకుందో చెప్పాలని భారత ఎన్నికల సంఘాన్ని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) గురువారం డిమాండ్ చేసింది. ఓట్లలో వ్యత్యాసానికి కారణాలను వివరించాలని కోరింది. సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా 538 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలున్నాయని ఏడీఆర్ సోమవారం తమ నివేదికలో వెల్లడించిన విషయం తెలిసిందే. 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. 5,54,598 ఓట్లను తక్కువగా లెక్కించారని తెలిపింది. మరో 176 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లకంటే 35,093 ఓట్లను అదనంగా లెక్కించారని పేర్కొంది. ఏడీఆర్ సోమవారం నివేదిక వెలువరించినప్పటికీ ఈసీ ఇప్పటిదాకా ఓట్లలో వ్యత్యాసంపై స్పందించలేదు.

ఏపీలోనే అత్యధికం

పోలైన, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసం మొత్తం దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా ఉంది. ఏపీలో 21 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం పోలైన ఓట్ల కంటే 85,777 ఓట్లను తక్కువగా లెక్కించారు. అలాగే మరో నాలుగు నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే 3,722 ఓట్లను అధికంగా లెక్కించారు. ఇది అనుమానాలకు తావిస్తోంది. ఓట్లలో తేడా ఎలా వచ్చిందో చెప్పాలని.. ఏడీఆర్ గురువారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధూలకు లేఖ రాసింది. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ఓట్ల లెక్కింపులో వ్యత్యాసాలపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ వ్యత్యాసాలపై ఈసీ తక్షణం వివరణ ఇవ్వాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రజా విశ్వాసం సడలకుండా చూడాలని కోరింది.



భారతీయురాలా? బ్లాకా?


కమలపై ట్రంప్ వివక్షపూరిత వ్యాఖ్యలు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ జాతివివక్ష వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి కానున్న కమలా హారిస్ భారతీయురాలా? లేక నల్ల జాతీయురాలా? అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ఆమె చాలాకాలంగా భారతీయ సంతతికి చెందిన అమెరికన్‌గా తెలుసని, ఇప్పుడు హఠాత్తుగా నల్లజాతీయురాలినని చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. షికాగోలో బుధవారం జరిగిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ బ్లాక్ జర్నలిస్ట్స్ కన్వెన్షన్‌లో ట్రంప్ మాట్లాడారు. వేదికపై ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టులలో ఒకరు.. 'హారిస్ ఎప్పుడూ నల్లజాతీయురాలిగానే గుర్తింపును కోరుకున్నారు. నల్లజాతీయుల యూనివర్సిటీలోనే చదువుకున్నారు' అని చెప్పడానికి ప్రయత్నించగా ట్రంప్ అడ్డుపడ్డారు. ఆమె ఏదో ఒకదానికి కట్టుబడితే గౌరవిస్తానని, కానీ గతంలో భారతీయ వారసత్వం గురించి చెప్పుకున్న ఆమె అకస్మాత్తుగా నల్లజాతి వైపు మలుపు తిరిగారని, ఎవరైనా దానిని పరిశీలించాలని వ్యాఖ్యానించారు. న్యాయవాదిగా ఆమె బార్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేదని, పాస్ అవుతానని కూడా ఆమె అనుకోలేదని, ఆ తరువాత ఏమి జరిగిందో తనకు తెలియదని ఎద్దేవా చేశారు. అంతకుముందు రోజు ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సైతం ట్రంప్ అభ్యంతరకరంగా మాట్లాడారు. కమల అధ్యక్షురాలిగా ఎన్నికైతే ప్రపంచవ్యాప్తంగా నేతలు ఆమెను ఆట బొమ్మలా చూస్తారని, ఆమె చుట్టూరా తిరుగుతారని వ్యాఖ్యానించారు.

మళ్లీ అదే పాతపాట: కమల

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ జాతి వివక్ష వ్యాఖ్యలకు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గట్టి కౌంటర్ ఇచ్చారు. ట్రంప్ మళ్లీ తన పాత విభజన సిద్ధాంతాన్నే ముందుకు తెస్తున్నారని, అగౌరవపరిచే ధోరణి కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి విభజనవాది కాకుండా, అమెరికాకు నిజాలు మాట్లాడే నాయకులు, వాస్తవాలను ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు.. శత్రుభావంతో, ఆగ్రహంతో ఊగిపోకుండా అర్థం చేసుకునే నాయకులు కావాలని ఆమె అభిప్రాయపడ్డారు. హూస్టన్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న వైరుధ్యాలు విభజనకు తావివ్వకూడదని, అవే మన బలమని తెలిసిన నాయకుడు అమెరికాకు కావాలని చెప్పారు. అమెరికా ప్రజలను విభజించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని హారిస్ ఎన్నికల ప్రచార డైరెక్టర్ మైఖేల్ టేలర్ విమర్శించారు. మాజీ అధ్యక్షుడి వ్యాఖ్యలు అవమానకరమైనవిగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ జీన్ పెర్రీ పేర్కొన్నారు. వ్యక్తులను ఎలా గుర్తించాలో చెప్పే హక్కు ఎవరికీ లేదని, అది ఎవరికి వారు సొంతగా తీసుకునే నిర్ణయమన్నారు.





సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



తీరనున్న నీటి వెతలు

నగర అవసరాల కోసం గోదావరి తాగునీటి సరఫరా పథకం-2కు రాష్ట్ర మంత్రివర్గం పచ్చజెండా ఊపింది.

-8లో



విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధునాతన సాంకేతికతను అమలు చేస్తున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు.

-8లో

గరిష్టం/కనిష్టం 31.0/25.0

వాతావరణం

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షపు జల్లులు పడవచ్చు. గరిష్టంగా 31, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

స్కిల్ యూనివర్సిటీతో గ్లోబల్ వర్సిటీల ఒప్పందాలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న స్కిల్ యూనివర్సిటీతో జట్టు కట్టేందుకు అంతర్జాతీయ యూనివర్సిటీలు క్యూ కడుతున్నాయి. వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ (డబ్ల్యూటీఐటీసీ), టీటా చైర్మన్ సందీప్ మఖ్తల నాయకత్వంలో ఏర్పడిన టీ కన్సల్ట్ వేదిక ద్వారా ఈ మేరకు తమ ఆసక్తిని కనబర్చాయి. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఎట్ డల్లాస్, డర్బైన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, సిలికాన్ ఆంధ్ర యూనివర్సిటీ, కేప్ పెనిన్‌స్యూలా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, సుల్తాన్ ఖబూస్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ షార్జా, మలేసియా యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సిద్ధమయ్యాయి. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు లేఖలు రాశాయి. ఈ ఒప్పందాల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో ముందడుగు వేయడం పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలు నేర్చుకోవడం సాధ్యమవుతుందని సందీప్ మఖ్తల అభిప్రాయపడ్డారు. ఆయా యూనివర్సిటీల అంగీకార లేఖలను సందీప్ మఖ్తల గురువారం మంత్రి శ్రీధర్ బాబుకు అందించారు.

నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేయొద్దు

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న మాల్స్, మల్టీప్లెక్స్‌ల పై చర్యలకు ఉపక్రమించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. నగరంలోని పలు మాల్స్, మల్టీప్లెక్స్‌లు, సినిమా థియేటర్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో ఆయా పార్కింగ్ స్థలాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. ఇందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను చేసినట్లు తెలిపారు. ఆయా బృందాల తనిఖీలలో కొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. ఈ సందర్భంగా సింగిల్ స్క్రీన్ థియేటర్ కింద రిజిస్టర్ చేసుకుని, మల్టీపుల్ స్క్రీన్ నడిపిస్తున్నట్లు బయటపడిందన్నారు. అదే విధంగా ఆయా థియేటర్లలోని ఫుడ్ స్టాళ్లలోనూ తనిఖీలు నిర్వహిచామన్నారు. దీంతో కొన్ని చోట్ల ఫుడ్‌స్టాళ్లలో అమ్ముతున్న తినుబండారాల్లో నాణ్యత లోపించినట్లు గుర్తించామని కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా మాల్స్‌కు, మల్టీప్లెక్స్‌లకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

మహంకాళి పోలీసులకు నగదు రివార్డు



రాంగోపాల్‌పేట్: ప్రేమ పేరుతో యువతిపై లైంగిక దాడికి పాల్పడి విదేశాలకు పారిపోయేందుకు యత్నించిన నిందితుడిని అరెస్టు చేసిన మహంకాళి పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి నగదు రివార్డుతో సత్కరించారు. గురువారం కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహంకాళి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పరశురాం, ఎస్సైలు జాన్ పరదేశి, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు సంతోష్, మహేష్, వంశీ కృష్ణ, రుషి చరణ్‌లను అభినందించడంతో పాటు నగదు పురస్కారాన్ని అందించారు.

జీవీకే హెల్త్ హబ్‌తో అత్యున్నత వైద్య సేవలు



సాక్షి, సిటీబ్యూరో: వైద్య రంగంలోని సమగ్ర డయాగ్నోస్టిక్స్, స్పెషాలిటీ కేర్ సేవలతో సంపూర్ణ ఆరోగ్యసంరక్షణ అందించడానికి జీవీకే హెల్త్ హబ్ ప్రారంభమైంది. సరసమైన ధరల్లో డయాగ్నోస్టిక్స్, డయాబెటిస్ కేర్, మల్టీ- స్పెషాలిటీ కేర్, ఫార్మసీ వంటి సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడమే లక్ష్యంగా ఇది పని చేస్తుంది. గురువారం జూబ్లీహిల్స్‌లోని జీవీకే హెల్త్ హబ్ ప్రారంభోత్సవం సందర్భంగా మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. గణపతి శాస్త్రి మాట్లాడుతూ... జీవీకే హెల్త్ హబ్ కచ్చితమైన రోగ నిర్ధారణలు, అత్యున్నత శ్రేణిలో రోగుల సంరక్షణను అందించడానికి పాటుపడుతుందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో నాణ్యమైన సెంట్రల్ ల్యాబ్, ఎంఆర్ఐ, సీటీ, డీఆర్, అల్ట్రాసౌండ్ సేవలతో అధునాతన డయాగ్నోస్టిక్స్, రేడియాలజీ విభాగాలను ఏర్పాటు చేశామన్నారు.

6న రవీంద్రభారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతి

పంజగుట్ట: గద్దర్ అంటే ఒక పాట, ఆటే కాదు ఆయన ఒక ఉద్యమ స్ఫూర్తి అని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న రవీంద్రభారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని గద్దరన్న యాదిలో పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు, గద్దర్ కుమారుడు సూర్య కిరణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్‌రెడ్డి, గాయకుడు, కవి ఏపూరి సోమన్నలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. గద్దర్ ప్రథమ వర్ధంతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రులను, అన్ని పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు. గద్దర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ తదితరులు



స్కిల్ యూనివర్సిటీ భవన నమూనాలను పరిశీలిస్తున్న సీఎం తదితరులు



సభకు హాజరైన జనం

నైపుణ్యానికి 'పునాది'

ఇప్పటి వరకు ఓ సాధారణ బేగరికంచె.. ఇకపై ఫ్యూచర్ సిటీగా మారబోతోంది. న్యూయార్క్‌కు దీటుగా రూపుదిద్దుకోబోతోంది. వచ్చే నాలుగేళ్లలో ఈ కుగ్రామం మరో మహా నగరంగా ఆవిష్కృతం కాబోతోంది. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నెట్ జీరో సిటీ అభివృద్ధిలో భాగంగా మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ, బేగరికంచె జీపీ పరిధిలో ప్రభుత్వం ప్రతిపాదించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సహా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోడ్రన్ స్కూల్, కమ్యూనిటీ సెంటర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. – కందుకూరు

అభివాదం చేస్తున్న సీఎం

ఎల్‌ఆర్‌ఎస్‌పై కదలిక

- ఇప్పటివరకు పరిశీలనలో ఉన్నవి 4.28 లక్షలే
- హెచ్ఎండీఏ పరిధిలోనే 3.58 లక్షల దరఖాస్తులు
- కేవలం 787 ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు జారీ

మొత్తం 25 లక్షలకుపైగా దరఖాస్తులు



భారీ ఎత్తున ఆదాయం..

హెచ్ఎండీఏతో పాటు అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులను వేగవంతం చేయడం ద్వారా ప్రభుత్వానికి రూ.వేల కోట్లలో ఆదాయం లభించవచ్చని అంచనా. హెచ్ఎండీఏ పరిధిలోనే రూ.వెయ్యి కోట్ల వరకు రావచ్చని అప్పట్లో అధికారులు అంచనా వేశారు. జీహెచ్ఎంసీతో పాటు మున్సిపాలిటీలు, ఇతర సంస్థల నుంచి కూడా ఎల్‌ఆర్‌ఎస్‌ల జారీకి ప్రభుత్వం అనుమతులను ఇచ్చింది. అన్ని విభాగాల్లో ఇప్పటి వరకు ఆమోదించిన సుమారు 6 వేల పైచిలుకు ఎల్‌ఆర్‌ఎస్‌లపై రూ.96.60 కోట్ల ఆదాయం లభించింది. మరోవైపు ఆదాయం కోసమే ప్రభుత్వం తాజాగా ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రియల్ ఎస్టేట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

క్రమసంఖ్య	పరిధి	మొత్తం దరఖాస్తులు	పరిశీలన దశలో ఉన్నవి	తిరస్కరించినవి	షార్ట్‌ఫాల్	ఆమోదించినవి	ఆదాయం (రూ.కోట్లలో)
1)	జీహెచ్ఎంసీ	106921	34644	2903	28135	116	1.90
2)	హెచ్ఎండీఏ	358464	116148	653	112906	787	37.85
3)	యూడీఏ	135937	29652	648	3903	403	0.12
4)మున్సిపాలిటీలు							
	మున్సిపల్ కార్పొరేషన్స్	1368964	248388	18737	77039	58907	56.73
5)	గ్రామపంచాయతీలు	600420	-	-	-	-	-
	మొత్తం	2570706	428832	22941	221983	60213	96.60

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ స్థలాల క్రమబద్ధీకరణ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై మరోసారి కదలిక వచ్చింది. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులతో హెచ్ఎండీఏలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 25 లక్షలకుపైగా దరఖాస్తులు రాగా.. వీటిలో ఇప్పటి వరకు కేవలం 6 వేల పైచిలుకు దరఖాస్తులకు మాత్రమే అనుమతులు లభించాయి. హెచ్ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్‌లలో మొత్తం 3,58,464 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను స్వీకరించగా ఇప్పటి వరకు కేవలం 787 ఎల్‌ఆర్‌ఎస్‌లకు మాత్రమే అధికారులు అనుమతులను ఇచ్చారు. ప్లాట్లు, ఇళ్లస్థలాలు, లే అవుట్‌లు తదితర అక్రమ స్థలాల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020లో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. లే అవుట్‌ల కోసం రూ.10 వేలు, ప్లాట్లు, ఇళ్ల స్థలాల కోసం రూ.1000 చొప్పున దరఖాస్తు రుసుము వసూలు చేశారు. అప్పటికే స్థలాలు కొనుగోలు చేసిన లక్షలాది మంది పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులకు ప్రణాళికలను సిద్ధం చేసినప్పటికీ.. దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్‌లో నమోదు బాధ్యతలను చేపట్టిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ), హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగాల మధ్య సమన్వయ లోపం, సిబ్బంది కొరత వంటి కారణాల దృష్ట్యా నత్తనడకన సాగింది. ప్రస్తుతం ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను వెల్లడించడంతో వీలైనంత తక్కువ సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫైనల్ ప్రొసీడింగ్స్‌ను అందజేయాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నాలుగేళ్లుగా పడిగాపులు..

వంద గజాలు, రెండు వందల గజాలు చొప్పున స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకొనేందుకు సిద్ధంగా ఉన్న లక్షలాది మంది మధ్యతరగతి, వేతన జీవులతో పాటు ఎకరం, రెండెకరాల్లో లే అవుట్‌లు వేసి అపార్ట్‌మెంట్‌లు, విల్లాలు వంటి నిర్మాణాలు చేపట్టాలనుకున్న బిల్డర్లు, రియల్టర్లు, వ్యాపారులు తదితర అన్ని వర్గాలకు చెందినవారు నాలుగేళ్లుగా పడిగాపులు కాస్తున్నారు. దీంతో లక్షలాది మంది సొంత ఇంటి కలకు దూరమయ్యారు. మరోవైపు అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్ బాధ్యతలను ప్రభుత్వం హెచ్ఎండీఏ నుంచి కలెక్టర్‌లకు బదిలీ కావడంతోనూ ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఆ తర్వాత తిరిగి హెచ్ఎండీఏకు ఎల్‌ఆర్‌ఎస్ బాధ్యతలను అప్పగించారు. దీంతో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ నుంచి హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగానికి డాటాను మరోసారి బదిలీ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో సమన్వయ లేమి కారణంగా జాప్యం చోటుచేసుకుంది. అదే సమయంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలోని వివిధ జోన్‌లలో సహాయ ప్లానింగ్ అధికారులు, జేపీఓలు, సాంకేతిక సిబ్బంది తగినంత మంది లేకపోవడంతో ఫైళ్ల పరిశీలన ముందుకు సాగలేదు. ఎన్నికలకు ముందే ఇది మొదలైనప్పటికీ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో వాయిదా పడింది. కొత్త ప్రభుత్వంలో ఇప్పుడు కదలిక వచ్చింది.

బల్దియా గురి!

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రైఫిల్ షూటింగ్ ట్రైనింగ్ సెంటర్

- ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాల నేపథ్యంలో..
- త్వరలో అమీర్‌పేట స్టేడియంలో ఏర్పాటుకు బిడ్‌లకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే వివిధ క్రీడల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ త్వరలో రైఫిల్ షూటింగ్‌లోనూ శిక్షణ ఇవ్వనుంది. షూటింగ్ రేంజ్, శిక్షణ కేంద్రాన్ని అమీర్‌పేటలోని గురుగోవింద్ సింగ్‌జీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం ఆసక్తిగల ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణతో పాటు బిడ్‌లను ఆహ్వానించింది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోని శిక్షణ కేంద్రాల్లో, వేసవి శిక్షణ శిబిరాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ పొందిన, జీహెచ్ఎంసీ నిర్వహించిన క్రీడల్లో పాల్గొన్న వారిలో జాతీయ స్థాయిలో రాణించిన వారూ ఉన్నారు. జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో ఆడిన వారిలో ఎంతో ఉన్నతస్థానాలకు ఎదిగిన వారు సైతం ఉన్నారు. రైఫిల్ షూటింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటుతో ఎందరో షూటింగ్‌పై ఆసక్తి చూపేందుకు అవకాశం ఉంటుందని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

ఒలింపిక్స్ పతకాల స్ఫూర్తితో..

ప్రస్తుతం పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో ఎయిర్ పిస్టల్ షూటింగ్‌లో మనూ భాకర్ వ్యక్తిగతంగా, మిక్స్‌డ్ టీమ్‌లో సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి రెండు పతకాలు సాధించడం తెలిసిందే. ఒలింపిక్స్‌లో భారత్ విజయంతో కలిగిన స్ఫూర్తితో పలువురు విద్యార్థులు ఈ అంశంపై దృష్టి సారించారు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటూ జీహెచ్ఎంసీ నగరంలో రైఫిల్ షూటింగ్‌కు శిక్షణ నివ్వాలనే తలంపుతో ఏర్పాటుకు బిడ్స్ ఆహ్వానించింది. బిడ్స్ నోటిఫికేషన్ తర్వాత ఒలింపిక్స్‌లో భారత్‌కు చెందిన స్వప్నిల్‌కు సైతం పతకం రావడం గమనార్హం.

జోన్‌కు రెండు చొప్పున..

జీహెచ్ఎంసీకి రైఫిల్ షూటింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఆలోచనలు దాదాపు ఏడాది కాలంగా ఉన్నప్పటికీ, అడుగు ముందుకు పడలేదు. జోన్‌కు రెండు చొప్పున జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో కలిపి పన్నెండు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించారు. తొలిదశలో అమీర్‌పేట, శేరిలింగంపల్లి, అంబర్‌పేట ప్రాంతాల్లోని స్టేడియంలలో ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ, ప్రస్తుతం అమీర్‌పేట కేంద్రానికి బిడ్‌లు పిలిచారు.

బిడ్‌ల దాఖలుకు నిబంధనలు

శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసే ఏజెన్సీ స్పోర్ట్స్ అర్హత, అనుభవం కలిగిన సూపర్‌వైజర్/వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేయాలి. అంకితభావం కలిగిన కేర్‌టేకర్ ఉండాలి. అవసరమైనప్పుడు మరమ్మతులు చేయగలిగే సామర్థ్యం ఉండాలి. నిర్వహణ కోసం తగినంత మంది సిబ్బందిని నియమించాలి. శిక్షణ నిచ్చేందుకు అర్హులైన కోచ్‌లు ఉండాలి. ఈ నెల 3న ప్రీబిడ్ మీటింగ్ నిర్వహిస్తారు.

సాంకేతికంగా..

సాంకేతికంగా ఎలక్ట్రానిక్ టార్గెట్ ట్రాలీ మెషిన్, ఎలక్ట్రానిక్ స్కోరింగ్ టార్గెట్ (ఇన్‌బ్యాండ్), షూటింగ్ పాయింట్‌తో కూడిన ఉడెన్ టేబుల్, అంతర్జాతీయ ప్రమాణాల కనుగుణంగా పేపర్ టార్గెట్స్ తదితరమైనవి ఏర్పాటు చేయాలి.

సీఎం ప్రాధాన్యమిస్తుండటంతో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యమిస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తుండటంతో జీహెచ్ఎంసీ సైతం నగరం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికెదిగేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలనే యోచనలో ఉంది. అందుకనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయడంపై దృష్టి సారించింది. ఫుట్‌బాల్‌లోనూ శిక్షణ ఇవ్వాలనే తలంపులో అధికారులున్నారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు దాదాపు అయిదు ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాల కోసం అన్వేషిస్తున్నట్లు తెలిసింది.



విద్యాసంస్థల్లో క్రీడా సదుపాయాల్లేవు

జీహెచ్ఎంసీలో 520 ఓపెన్ ప్లేసెస్/గ్రౌండ్స్, 5 స్కేటింగ్ గ్రౌండ్స్, 29 స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, టెన్నిస్ కోర్టులు తదితరమైనవి ఉన్నాయి. వాటిలో సదుపాయాలు మెరుగుపర్చడంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టి సారించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని విద్యాసంస్థల్లో తగిన క్రీడా సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులకు ఉపకరించేలా, క్రీడలపై ఆసక్తి కలిగేలా, అనుకూలంగా తగిన వసతులు కల్పించాలని అప్పటి ప్రభుత్వం భావించిన నేపథ్యంలో దాదాపు రూ. 87 కోట్లతో పనులు చేపట్టారు. వాటిలో కొన్ని పూర్తి కాగా కొన్ని పూర్తి కావాల్సి ఉంది. తాజాగా ఒలింపిక్స్.. భారత్‌కు పతకాల నేపథ్యంలో రైఫిల్ షూటింగ్ సెంటర్ ఏర్పాటుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది.

పేద గూటికి పండగే!

కొత్త రేషన్ కార్డులపై చిగురించిన ఆశలు

- 10 లక్షల కుటుంబాల ఎదురుచూపులు
- ప్రజాపాలనలో 5 లక్షలకుపైగానే అర్జీలు
- నాలుగేళ్లుగా నిలిచిన ఆన్‌లైన్ లాగిన్
- తాజాగా మంత్రివర్గ నిర్ణయంతో హర్షాతిరేకాలు

సాక్షి, సిటీబ్యూరో: ఏళ్ల తరబడి కొత్త రేషన్ కార్డుల జారీ కోసం నిరీక్షిస్తున్న నిరుపేదల్లో ఆశలు చిగురించాయి. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించడంతో బడుగు జీవుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో సుమారు 10 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయి. సుమారు కోటిన్నర జనాభా కలిగిన మహా నగరంలో సుమారు 40 లక్షలకు పైగా కుటుంబాలు ఉండగా అందులో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలు 27.21 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ఇందులో ప్రస్తుతం 17.21 లక్ష కుటుంబాలకు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. మిగతా కుటుంబాలకు రేషన్ కార్డులు లేకపోవడంతో వివిధ సంక్షేమ పథకాల వర్తింపు అందని ద్రాక్షగా మారింది.

ఆఫ్‌లైన్‌లో 5 లక్షలకుపైగా దరఖాస్తులు..

గ్రేటర్ పరిధిలో సుమారు 5.73 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో సుమారు 24.74 లక్షల కుటుంబాలు వివిధ పథకాల కోసం వర్తింపు కోసం ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకున్నాయి. అందులో 5 గ్యారంటీ పథకాల కోసం సుమారు 19,01,256 కుటుంబాలు రేషన్ కార్డు కోసం 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి కొత్త రేషన్ కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని చెబుతూ వస్తోంది. ఇప్పటి వరకు ప్రత్యేకంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించలేదు. తాజాగా కొత్త కార్డులపై నిర్ణయం తీసుకుంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుల ప్రక్రియ

కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించే అవకాశలున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ప్రజాపంపిణీ వ్యవస్థలో సంస్కరణలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్ లాగిన్ ద్వారానే దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతూ వచ్చింది. నాలుగేళ్ల క్రితం కొత్త రేషన్ కార్డుల జారీ కోసం దరఖాస్తుల చేసుకునే వెబ్‌సైట్ ఆన్‌లైన్ లాగిన్‌ను పౌరసరఫరా శాఖ నిలిపివేసింది. అప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 360 డిగ్రీల్లో వడబోసి కేవలం నలభై శాతం మాత్రమే క్లియర్ చేసి మిగతా దరఖాస్తులను తిరస్కరించింది. అప్పటి నుంచి దరఖాస్తు చేసుకునే లాగిన్‌ను పునరుద్ధరించలేదు. లాగిన్ పునఃప్రారంభమైతే గాని దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగే అవకాశాలు ఉండవు.

బీఆర్ఎస్ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో కొత్తగా మంజూరైన కార్డులు 1.21 లక్షలు మాత్రమే. వాస్తవానికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్పు చేయడంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ కార్డులు జారీ చేసింది. కొంత కాలానికి అనర్హుల పేరిట కొన్ని కార్డులను ఏరివేసింది. దరఖాస్తుల నిరంతర ప్రక్రియ కావడంతో కొత్త కార్డుల కోసం సుమారు 3.40 లక్షల పేద కుటుంబాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నాయి. నాలుగేళ్ల క్రితం ఒకసారి మొక్కుబడిగా కొత్త కార్డులు మంజూరు చేసి చేతులు దులుపుకొంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



ఫైరింగ్ రేంజ్‌పై నేడు సమావేశం

రాజేంద్రనగర్: ఫైరింగ్ బుల్లెట్లు నివాస ప్రాంతాల్లోకి దూసుకొస్తుండటంపై పోలీసులు ఎట్టకేలకు స్పందించారు. రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్మీ, పోలీసు అకాడమీ అధికారులతో శుక్రవారం సమావేశం కానున్నారు. గత నెలలో రెండుసార్లు గంధమూడ ప్రాంతంలోని నివాస ప్రాంతాల్లోకి ఫైరింగ్ బుల్లెట్లు దూసుకొచ్చాయి. దీనిపై రాజేంద్రనగర్ డీసీపీ ఆర్మీ.. పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించనున్నారు. ఫైరింగ్ రేంజ్ అంచనాలను పరిశీలించడంతో పాటు రేంజ్ ప్రాంతంలో ప్రహరీ నిర్మించడమా...? ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడమా...? అనే అంశంపై చర్చించనున్నారు.

తీరనున్న నీటి వెతలు

గోదావరి జలాల రెండో దశకు గ్రీన్ సిగ్నల్
- మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీలు తరలింపు
- అందులో 10 టీఎంసీలు నగర తాగునీటి అవసరాలకు
- ఐదు టీఎంసీలు జంట జలాశయాలకు
- రూ. 5,560 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు పనులు



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి మంచి నీటి అవసరాల కోసం గోదావరి తాగు నీటి సరఫరా పథకం-2కు రాష్ట్ర మంత్రి వర్గం పచ్చజెండా ఊపింది. నగరానికి సమీపంలోని మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని శామీర్ పేట ఘన్‌పూర్, అక్కడి నుంచి హైదరాబాద్ కు తరలించే జలమండలి ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. మొత్తం మీద 15 టీఎంసీలను తరలించి, అందులో 10 టీఎంసీలను శుద్ధి చేసి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. మిగతా ఐదు టీఎంసీలను నేరుగా జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమయత్‌సాగర్ తరలించి అక్కడి నుంచి మూసీలోకి వదలనున్నారు. నగరంలో రోజురోజుకూ తాగునీటి అవసరాలు పెరుగుతుండడంతో పాటు నాగార్జున సాగర్, సింగూర్, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల్లో కూడా నీరు సంతృప్తికరంగా లేకపోవడంతో గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు రెండో దశను చేపట్టేందుకు జలమండలి ప్రణాళిక రూపొందించి మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలించేలా ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

24 నెలల కాలపరిమితి..

నగరానికి తాగు నీరు తరలించే గోదావరి తాగునీటి సరఫరా పథకం-2ను సుమారు రూ.5,560 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. 24 నెలల కాలపరిమితిలో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. సిద్దిపేట జిల్లా, మర్కూక్ మండలంలో కొండ పోచమ్మ సాగర్, శామీర్‌పేట్ మండలంలోని ఘనన్‌పూర్‌లో మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మల్లన్న సాగర్ నుంచి నుంచి ఉస్మాన్ సాగర్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయడం, క్లియర్ వాటర్ రిజర్వాయర్ల అనుబంధ భాగాలతో 10 టీఎంసీల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నిర్మాణ పనులు చేపట్టనున్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో పంపింగ్ మెయిన్స్,మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ల మధ్య ఇంటర్ కనెక్టివిటీ ఏర్పాట్లు చేయనున్నారు.

ప్రస్తుతం జలాల తరలింపు ఇలా..

హైదరాబాద్ మహా నగరం ఎత్తైన ప్రదేశం కావడంతో పాటు రాళ్లు, కొండలతో నిండి ఉండటంతో భూగర్భ జలాలపై ఆధారపడకుండా వంద కిలోమీటర్ల దూరంలోని నాగర్జున సాగర్ నుంచి మూడు దశల్లో కృష్ణాజలాలు, సుమారు రెండు వందల కిలోమీటర్ల దూరంలోని శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను తరలిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి సుమారు 75 శాతం వరకు నీటి తరలింపు ఉంటుంది. మరోవైపు జంటజలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌తోపాటు సింగూర్, మంజీరా జలాశయాల నుంచి కూడా నీటి తరలింపు కొనసాగుతోంది. సాగర్ జలాశయం నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా కృష్ణా తాగు నీటి సరఫరా పథకం ఫేజ్ - 1, 2, 3 ల కింద రోజువారీ 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం గోదావరి పథకం ద్వారా నగరానికి 168 ఎంజీడీల నీరు తరలిస్తున్నారు. అయినా నీరు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో గోదావరి రెండో దశ అనివార్యమైంది.

నగరంలో నేడు...

- హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఎస్‌ఎస్సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు అర్హులు.
- ఫిక్కీ ఆధ్వర్యంలో ఉదయం 9.45 గంటలకు బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఎంపవరింగ్ ఎడ్యుకేషన్ ఎకోసిస్టమ్‌పై కాన్ఫరెన్స్ జరుగుతుంది.
- భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రాపర్టీ షో ఉదయం 10.30గంటలకు మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతుంది.
- ఫ్రెండ్‌షిప్ డే, తెలుగు ఇండియా ఐడల్ సెషన్-3 కంటెస్టెంట్స్‌తో మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హితమ్ కాలేజీలో జరుగుతుంది.

నిరుద్యోగులకు వరం జాబ్ కేలండర్

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: గత 32 ఏళ్లలో సాధ్యం కాని జాబ్ కేలండర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో విడుదల చేయడం సంతోషదాయకమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. జాబ్ కేలండర్ నిరుద్యోగ యువతకు వరం లాంటిదని, రాష్ట్రంలోని నిరుద్యోగులు సంబురాలకు సిద్ధం కావాలని గురువారం ఆయన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జాబ్ కేలండర్ విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని అన్ని వర్గాలు హర్షిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జాబ్ కేలండర్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో విద్యార్థి నేతలు అసెంబ్లీ వద్ద స్వీట్లు పంచారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, లోకేశ్ యాదవ్, గౌరిసతీశ్‌లు పాల్గొన్నారు.

మహాగణపతి పనులు వేగవంతం



ఖైరతాబాద్ : ఖైరతాబాద్ మహాగణపతి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది 70 అడుగుల ఎత్తులో శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా రూపుదిద్దుకుంటున్నారు. గురువారం మహాగణపతికి మట్టి పనులను ప్రారంభిస్తూ పాదపూజ చేశారు. ఇప్పటికే వెల్డింగ్ పనులు చాలా వరకు పూర్తికావడంతో శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నేతృత్వంలో సందీప్‌రాజ్, మహేష్‌యాదవ్, రాజ్‌కుమార్, కృష్ణ యాదవ్ నేతృత్వంలో ప్రత్యేక పూజ చేశారు. పూజా కార్యక్రమాలకు పూజారి రంగరాజాచార్య నేతృత్వం వహించారు.

చెట్ల పెంపకంపై నివేదిక అందజేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా చెట్ల పెంపకంపై పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా నివేదిక సమర్పించకుంటే హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ కమిషనర్లను వర్చువల్‌గా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. తదుపరి విచారణ ఈ నెల 6కు వాయిదా వేసింది. 'పట్టణాలు, నగరాల్లో ప్రజల జీవితాలు ఉరుకులు పరుగులుగా మారాయి. ఉపశమనం, ఊరట పొందేందుకు పార్కుల అవసరం ఎంతైనా ఉంది. ఉన్నవాటి పరిరక్షణతో పాటు లేని చోట్ల కొత్తగా ఏర్పాటు చేయాలి. చెట్లను కూడా అభివృద్ధి చేయాలి. ఆ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలి' అని కోరుతూ హైదరాబాద్ హిమాయత్‌సాగర్‌కు చెందిన కె. ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో 2016లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

ఏఐజీ, ఇండియన్ బిజినెస్ స్కూల్ ఎంఓయూ..



సాక్షి, సిటీబ్యూరో: 'ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే థీమ్‌తో ఆరోగ్య సంరక్షణ అందించడంలో నూతన ఆవిష్కరణలు, రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించడమే లక్ష్యంగా ఏఐజీ ఆసుపత్రి, ఇండియన్ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. భారత్‌లోని వైద్యులు, ఆసుపత్రులు, అనుబంధ ఆరోగ్య సంస్థలు రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించడం కోసం కృత్రిమ మేధతో ఉత్తమ సంరక్షణ పద్ధతులను ఆవిష్కరించాలనే ఏకైక లక్ష్యంతో ఈ రెండు సంస్థలు పనిచేయనున్నాయి. ఈ సందర్భంగా ఏఐజీ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. తక్కువ, మధ్య ఆదాయం ఉన్న దేశాలలో అసంక్రమిక వ్యాధులు, జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న తరుణంలో ఏఐ ఆధారిత ఆరోగ్య సంరక్షణ భవిష్యత్ ప్రణాళికలను సుస్థిరం చేస్తుందన్నారు. ఆరోగ్య సంరక్షణలో ఏఐని విలీనం చేసే ఈ భాగస్వామ్యం దేశంలోని రోగి సంరక్షణలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని పేర్కొన్నారు. పరిశోధన ఉప సంచాలకులు ప్రొఫెసర్ సారంగ్ డియో, ఇండియన్ బిజినెస్ స్కూల్ డిజిటల్ లెర్నింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజాత కుమారస్వామి పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- 12 మందికి గాయాలు
- బాధితుల్లో 8 మంది చిన్నారులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని మూడు కాలనీల్లో పిచ్చి కుక్క స్వైర విహారం చేయడంతో ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. వివరాల్లోకి వెళితే బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ, సాయినగర్, పోలీస్ క్వార్టర్స్ కాలనీల్లో గురువారం సాయంత్రం ఓ పిచ్చికుక్క దాడి చేసింది. ఈ ఘటనలో 12 మంది గాయపడ్డారు. బాధితుల్లో 8 మంది చిన్నారులు కాగా, నలుగురు పెద్దలు ఉన్నట్లు బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మమత తెలిపారు. కుక్కకాటు బాధితులందరికీ టీటీ ఇన్‌జెక్షన్‌తో పాటు రేబిస్ వ్యాక్సిన్‌ను ఇచ్చినట్లు తెలిపారు.


తాపీ మేస్త్రి దారుణ హత్య



రేణుబాబు (ఫైల్)

రాజేంద్రనగర్: తాపీ మేస్త్రి దారుణ హత్యకు గురైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... బండ్లగూడ కాళీ మందిర్ ప్రాంతానికి చెందిన రేణుబాబు (35) తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం పనికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిన రేణుబాబు గురువారం ఉదయం కిస్మత్‌పూర్ ఎక్సైజ్ పోలీస్ అకాడమీ ప్రాంతంలో దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు గుర్తుతెలియని వ్యక్తులు అతడిని బండరాళ్లతో మోది హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణమైనట్లు ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

హస్తినాపురం: మద్యం తాగించి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు శివాజీరెడ్డిని గురువారం వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కాశిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, ఆరేగూడెం గ్రామానికి చెందిన మునుగాల శివాజీరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. గత నెల 29న తన స్నేహితుడు గౌతంరెడ్డి ఫోన్‌చేసి బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు రావాలని అక్కడికి వచ్చాడు. అనంతరం ఇద్దరూ కలిసి మద్యం మత్తులో ఉన్న యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మత్తు నుంచి తేరుకున్న తర్వాత బాధితురాలు గదిలో గౌతంరెడ్డి తో పాటు మరో వ్యక్తి ఉండడం, తనపై లైంగిక దాడి జరిగినట్లు గుర్తించి గట్టిగా కేకలు వేసింది. దీంతో రెస్టారెంట్ సిబ్బంది పోలీసులకు, యువతి స్నేహితులకు సమాచారం అందించగా, అక్కడికి వచ్చిన ఆమె స్నేహితులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని ఆరెంజ్ ఆసుపత్రికి తరలించారు. నిందితులు ఇద్దరు అక్కడి నుంచి అక్కడికి పరారైనట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు గౌతంరెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న శివాజీరెడ్డిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

- మరింత సమర్థవంతంగా కాల్ సెంటర్ , విద్యుత్ కంట్రోల్ రూమ్ సేవలు

సాక్షి,సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ సరఫరా ఫిర్యాదులను అతి తక్కువ కాలంలో పరిష్కరించేందుకు ప్రస్తుతం ఉన్న 1912 కాల్ సెంటర్ (విద్యుత్ కంట్రోల్ రూమ్) ఫ్యూజ్ ఆఫ్ కాల్ వ్యవస్థలో అధునాతన సాంకేతికను అమలు చేస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. గురువారం సంస్థ ప్రధాన కార్యాలయంలో 1912 కాల్ సెంటర్ (విద్యుత్ కంట్రోల్ రూమ్), ఫ్యూజ్ ఆఫ్ కాల్ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సరఫరా సంబంధిత ఫిర్యాదులు, ఇతర ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సంస్థ పరిధిలో నిర్వహించే కార్యకలాపాలకు సంబంధించి సమీకృత డ్యాష్ బోర్డు ను అందుబాటులోకి తెచ్చామని, రియల్ టైం లో సమాచారం తెలుసుకునే వీలు ఉంటుందన్నారు. ఆరు నెలలుగా నమోదైన సరఫరా సంబంధిత ఫిర్యాదులను, గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది అంతరాయాల ఫిర్యాదులు బాగా తగ్గాయని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ నర్సింహులు, చీఫ్ ఇంజినీర్లు శివాజీ, నరసింహ స్వామి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు రవి కుమార్, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ భార్యపై కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

చంచల్‌గూడ: మాజీ భార్యపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిని మాదన్నపేట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చావణికి చెందిన అస్రా ఫాతిమా రెండు నెలల క్రితం భర్త అబ్దుల్ అజీం నుంచి విడాకులు తీసుకుంది. బాధితురాలు సోదరి ఇంట్లో ఉండగా మంగళవారం రాత్రి అక్కడికి వచ్చిన అబ్దుల్ అజీం తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెను హత్య చేసేందుకు ప్రయత్నించాడు. మెడ, చేతిపై పొడవడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం నిందితుడు అబ్దుల్ అజీంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అపార్ట్‌మెంట్ డక్ట్‌లో పడి బాలిక మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ డక్ట్‌లో పడి ఓ బాలిక మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంపల్లికి చెందిన ఎలాంగోవన్‌కు కుమారుడు, కుమార్తె రియా ప్రియంవద (13) ఉన్నారు. గత నెల 31న సాయంత్రం వారిరువురు ట్యూషన్‌కు వెళ్లారు. రాత్రి కుమారుడు ఇంటికి తిరిగి రాగా కుమార్తె ప్రియంవద తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన ఎలాంగోవన్ ట్యూషన్ సెంటర్‌కు వెళ్లి ఆరా తీయగా ఆమె ఇంటికి వెళ్లిపోయినట్లు తెలిపారు. దీంతో అపార్ట్‌మెంట్ పరిసరాల్లో గాలించగా సీ బ్లాక్‌లోని డక్ట్‌లో రక్తపు మడుగులో పడి ఉన్న ప్రియంవదను గుర్తించి సమీపంలోని మెడ్‌విన్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

దుండిగల్: ద్విచక్ర వాహనాన్ని ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా, అన్నారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల కిషన్(62) మల్లంపేట్‌లోని ఓ బిల్డింగ్‌కు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గురువారం డ్యూటీ ముగిసిన అనంతరం తన సోదరుడు శామ్యూల్‌తో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా కాజీపల్లి బ్రిడ్జి సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో కిషన్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యుత్సాహం...

- చనిపోయిన రోగి బతికాడని సోషల్ మీడియాలో హల్‌చల్

లక్డీకాపూల్ : నిమ్స్‌లో చనిపోయిన రోగిపై సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నిమ్స్ వైద్యులు సిన్మా సీను అనే వ్యక్తికి జీవించి ఉన్నా డెత్ సర్టిఫికెట్ ఇచ్చారని, అతడిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా లేచి కూర్చున్నాడని.. సోషల్ మీడియాలో హల్ చల్ చేశారు. అయితే వాస్తవానికి ముచ్చపొట్టు శ్రీను అనే వ్యక్తి నిమ్స్‌లో కార్డియోథోరాసిక్ విభాగంలో అడ్మిట్ అయ్యాడు. అతడికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ధారించారు. గత నెల 31న రాత్రి అతను గుండెపోటుతో మృతి చెందాడు. సిన్మా శీను పేరుతో నిమ్స్‌లో ఎవరు అడ్మిట్ కాలేదని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు పూర్తిగా అవాస్తవమన్నారు. భవిష్యత్తులో నిమ్స్‌పై ఇలాంటి కథనాలు ప్రచారం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.దీనిపై పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి,సిటీబ్యూరో: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 384 పాఠశాలల్లో పనులు చేపట్టగా ఇప్పటివరకు 235 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, 149 పాఠశాలల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. పనులను ప్రత్యేక అధికారులు, డిప్యూటీ డీఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలన్నారు. నిర్దేశించిన వ్యవధిలో పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ప్రత్యేక అధికారులు, డిప్యూటీ డీఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మాసబ్‌ట్యాంక్ పోలీసులు

బంజారాహిల్స్: కొత్తగా ప్రవేశపెట్టిన క్రిమినల్ చట్టాలు, డ్రగ్స్ వల్ల తలెత్తే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని మాసబ్‌ట్యాంక్ పోలీసులు సూచించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైఫాబాద్ సైన్స్ కాలేజీలో గురువారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ద్వారా విద్యార్థులకు కొత్త క్రిమినల్ చట్టాలు, డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్, మాసబ్‌ట్యాంక్ ఎస్ఐ జి.శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, భవిష్యత్తుపై దృష్టి పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా మత్తు పదార్థాలపై దూరంగా ఉండాలని కోరారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.నవనీత, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 డాక్టర్ ఎస్.అరవింద్, యూనిట్-2 డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

7న ఇందిరాపార్క్ వద్ద బీసీ సత్యాగ్రహ దీక్ష

పంజగుట్ట: సమగ్ర కుల గణన జరిపి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు విషయమై ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ నెల 7వ తేదీన ఇందిరాపార్క్‌వద్ద బీసీ సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లోనూ బీసీ సత్యాగ్రహ దీక్షలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, బీసీల అభ్యున్నతికి ఓవైపు రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో చర్చలేపారని, కానీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే చలో ఢిల్లీ చేపడతామని ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయం ముందు సత్యాగ్రహ దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, సోషల్ జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చామకూర రాజు, కె.వీ.గౌడ్, మేకల కృష్ణ యాదవ్, లోడంగి గోవర్ధన్, కొంపెల్లి రాజు, మహేష్ గౌడ్, నరహరి, విజయ్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు అధ్వానం

నిరసనగా మట్టికుప్పలను ఎత్తిన కార్పొరేటర్


మట్టి కుప్పలు ఎత్తుతున్న కార్పొరేటర్

వెంగళరావునగర్: జలమండలి పనితీరు నానాటికీ అధ్వానంగా మారుతుందని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ మసీదుగడ్డ ప్రాంతంలో గురువారం ఆమె పర్యటించారు. ఇందులో భాగంగా ఆమెకు పలు సమస్యలను స్థానికులు తెలియజేశారు. గత కొంత కాలంగా మసీదుగడ్డ చుట్టుపక్కల నీరు కలుషితం అయి పంపిణీ అవుతున్నాయని, ఈ విషయాన్ని ఎన్నిమార్లు జలమండలి అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అదేవిధంగా రోడ్డు పక్కన డ్రైనేజీలో నుంచి తొలగించిన మట్టికుప్పలు, ఎండిపోయిన సిల్ట్ దిబ్బలను కూడా ట్రాక్టర్ల ద్వారా లిఫ్ట్ చేయాలని చెప్పినా చలనం లేదని అన్నారు. ఆయా సమస్యలను విన్న కార్పొరేటర్ దేదీప్య విజయ్ జలమండలి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జలమండలి చర్యలను నిరసిస్తూ తానే స్వయంగా మట్టికుప్పలు గంపల్లో ఎత్తి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, పూజారి బాల్‌రాజ్, కట్టా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్ అభివృద్ధికి కృషి చేస్తా


వినతి పత్రం సమర్పిస్తున్న స్థానికులు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అన్నారు. రహమత్‌నగర్ హౌస్ ఓనర్స్ సమావేశం గురువారం కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆస్తి పన్ను విధివిధానాలు, మదింపు తదితర సమస్యలపై వారు చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహమత్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ట్యాక్స్‌కు సంబంధించిన సమస్యలను జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. ప్రతి నివాసంలో మొక్కను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం స్థానికులు పలు సమస్యలపై సీఎన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పేరుతో భారీ మోసం

- డ్రగ్స్, హత్య కేసులో కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామంటూ బెదిరింపులు
- గృహిణి నుంచి రూ.40 లక్షలు కాజేసిన చీటర్స్

హిమాయత్‌నగర్: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఫొటో పంపించి, డ్రగ్స్, హత్య కేసులో కుటుంబ సభ్యులను అరెస్ట్ చేస్తామంటూ బెదిరించి ఓ గృహిణిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన 40 ఏళ్ల ఓ గృహిణికి ఫెడెక్స్ కొరియర్ పేరిట ఫోన్ కాల్ వచ్చింది. ఆమె ఆధార్ నెంబర్‌తో ఎం.డి.ఎం. ఏ డ్రగ్స్ పార్సిల్ వచ్చిందని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు కాల్ ఫార్వార్డ్ చేసినట్లు నమ్మించారు. అనంతరం మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఫొటో పంపి అతనికి ప్రపంచవ్యాప్తంగా సంబంధాలు ఉన్నాయని బయపెట్టారు. తాము చెప్పిన విధంగా డబ్బు పంపించాలని, లేదంటే ఆమె కుటుంబ సభ్యుల ఖాతాలను ఫ్రీజ్ చేసి, వారిని అరెస్టు చేయిస్తామని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు రూ.40 లక్షలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేసింది. అనంతరం మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు

- బంజారాహిల్స్‌లో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ సుడిగాలి పర్యటన
- దోమల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు


డెంగీ బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్

బంజారాహిల్స్: డెంగీతో పాటు విష జ్వరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం, అధికారులతో పాటు ప్రజలను కూడా ఇందులో భాగస్వాములను చేస్తున్నామని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. దోమల నివారణ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటితో కలసి బంజారాహిల్స్‌లో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఆయన బంజారహిల్స్ రోడ్‌నెం.7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ దోమల నివారణకు సంబంధించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. దోమల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని దోమల వృద్ధి చెందకుండా ఉండటంతో పాటు దోమలు కుట్టకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. దోమల వృద్ధి నివారణకు ప్రతీ విద్యార్థి కృషిచేస్తూ, చుట్టుపక్కల వారికి కూడా అవగాహన కల్పించాలని సూచించారు.


అవగాహన కార్యక్రమంలో రవీందర్ నాయక్

ఎన్బీటీ నగర్‌లో...

బంజారాహిల్స్‌రోడ్ నెం. 12లోని ఎన్బీటీనగర్ బస్తీలో డెంగీతో బాధపడుతున్న కుటుంబాన్ని హెల్త్ డైరెక్టర్ పరామర్శించి స్థానిక పరిస్థితులను గురించి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న ఆశా వర్కర్లతో ఇంటింటి జ్వర సర్వే గురించి వాకబు చేశారు. ప్రతీరోజూ దోమల మందు పిచికారి చేయడంతో పాటు ఫాగింగ్ ఖచ్చితంగా చేయాలని ఎంటమాలజీ అధికారులు, సిబ్బందికి ఆయన సూచించారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్టులు రాంబాబు, రజిని, హెల్త్ సూపర్‌వైజర్లు అనీస్, హెల్త్ అసిస్టెంట్ మల్లేష్, ప్రభాకర్, రజిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం


మిఠాయిలు పంచుకుంటున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు


మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

బంజారాహిల్స్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎంతో సంతోషాన్నిచ్చిందని టీఎమ్మార్పీఎస్ యువజన విభాగం అధ్యక్షుడు నల్ల శివ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఆరుగురు జడ్జీలు వర్గీకరణ సరైనదేనని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీలో ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రజినీకాంత్, సురేష్, యాకరి గణేష్, రాము, రమేష్, నరహరి, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో...

జూబ్లీహిల్స్ డివిజన్ ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు బొప్పురం వేణుకుమార్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి గురువారం ఫిలింనగర్ విగ్రహాల చౌరస్తాలో పాలాభిషేకం చేశారు. గత 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేశారని, ఎట్టకేలకు సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి కండె రామ్ కుమార్‌మాదిగ, ఇనపనూరి వెంకటేష్ మాదిగ, సంధ్యా రాంబాబు మాదిగ, వంగలి వెంకటేష్ మాదిగ, సునీల్ మాదిగ, నడిమింటి కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్‌లో...

ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కన్వీనర్ చిట్యాల ఆనంద్ మాదిగ గుర్తు చేశారు. ఎస్పీఆర్ హిల్స్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకోసం గత ముప్పై ఏండ్లుగా మందకృష్ణ మాదిగ నేతృత్వంలో అలుపెరగని పోరాటం చేసిందని, దాని ఫలితంగానే నేడు సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. వర్గీకరణతో దేశంలోని దళితులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ సోదరులకు ఆనంద్ ధన్యావాదాలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తాం

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అగ్రకుల రాజకీయ పార్టీల కుట్ర అని తీర్పుకు వ్యతిరేకంగా త్వరలోనే సుప్రీంకోర్టులో మరో పిటిషన్ వేస్తామని మాల మహానాడు, మాల ప్రజా సంఘాల జేఏసీ తెలిపింది. గురువారం మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ గోపోజు రమేష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావులు మాట్లాడతూ భారతదేశంలో ప్రస్తుతం విభజించు పాలించు రాజకీయాలు నడుస్తున్నాయని వారి రాజకీయ లబ్ధికోసం ఎస్సీలను విభజించి రాజకీయాలు చేస్తున్నారని అలాంటి పార్టీలకు తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలే చేసుకోవచ్చు అని ఇచ్చిన తీర్పుపై మాల సంఘాలు అన్ని కలసి త్వరలోనే మరో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ వర్గీకరణ అవసరం లేదని, ఎస్సీ కులాలు ఐక్యంగా ఉండాలని విడిపోతే బలహీనపడతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు తా లూక రాజేష్, భంగి ఆనందరావు, గోకుల్ కళ్యాణ్, మర్రిపల్లి శ్రీకాంత్, ఎల్ల స్వామి, ఆదర్శ్, మారేడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మన్నె శ్రీధర్‌రావు

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 ఏళ్ల న్యాయపోరాటానికి ఫలితం దక్కిందన్నారు. వర్గీకరణ జరిగేంతవరకు ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మాదిగ జాతి మొత్తం నిర్వీర్యమై పోయే పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ప్రాణం పోసిందన్నారు. గత ఎన్నికల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఒక్క పార్లమెంట్ సీటు కూడా ఇవ్వలేదని, ఎమ్మెల్యేల టికెట్ల పంపిణీలోనూ అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా పాలకులు తప్పును సరిదిద్దుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణ చట్టం చేసి మాదిగల జీవితాల్లో వెలుగు నింపాలన్నారు.



జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న పిడమర్తి రవి

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తెలంగాణ మాదిగలకు ఎలాంటి ప్రయోజనం లేదని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. వర్గీకరణ చేస్తే మాదిగలకు కేవలం 7 శాతం రిజర్వేషన్లు వస్తాయని, జనాభా దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు వస్తేనే సరైన న్యాయం జరుగుతుందన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ .. జనాభా దామాషా ప్రకారం మాదిగ రిజర్వేషన్లను 7 నుంచి 12 శాతానికి పెంచాలని దీనిపై అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలన్నారు. మాదిగల సమష్టి పోరాట ఫలితంగానే సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు గడ్డ యాదయ్య, బాబూరావు, బాలరాజు, సురేష్, మహేష్, సాయన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి


షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

బంజారాహిల్స్: అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ నగర కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి వినతిపత్రాన్ని అందజేసింది. గురువారం బంజారాహిల్స్‌లోని షేక్‌పేట మండల కార్యాలయ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు, ఇతర అసంఘటిత కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులతో కూడిన కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఉచిత కరెంటు, రూ.500లకే గ్యాస్ దరఖాస్తు చేసుకున్న వారికి అవకాశం కల్పించాలన్నారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ గ్రేటర్ సెక్రటరీ హన్మేష్, ప్రొగ్రెసివ్ యూత్ లీగ్ స్టేట్ ప్రెసిడెంట్ ప్రదీప్, నారాయణ, నల్లన్న, ఎల్లప్ప, నాగరాజు, మల్లేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి భార్యకు వేధింపులు

యువకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: స్నేహితుడి భార్యను వేధిస్తున్న ఓ యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్ సమీపంలో నివసించే ఓ యువతి రెండేళ్ళ కిందట జూన్ 1న ఓ యువకుడిని వివాహం చేసుకుంది. ఎంతో అన్యోన్యంగా ఉంటున్న తరుణంలో గత ఏడాది డిసెంబరు 1న ఆమె భర్త స్నేహితుడు సనత్‌నగర్‌కు చెందిన నిఖిల్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. భర్త స్నేహితుడు కాబట్టి ఆమె అతనితో స్నేహంగా ఉంది. అయితే నిఖిల్ తరచూ కాల్స్, మెసేజ్‌లు చేస్తూ ప్రేమ ప్రపోజల్ చేశాడు. అప్పటి నుంచి నిఖిల్ ఆమెను వేధించడం ప్రారంభించాడు. అతని వేధింపులు భరించలేక యువతి గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ జాబ్ పేరుతో మోసం

వెంగళరావునగర్: ఆన్‌లైన్ జాబ్ పేరుతో మహిళ నుంచి నగదు తస్కరించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌కు చెందిన మహిళకు టెలిగ్రాం యాప్ ద్వారా మెసేజ్ వచ్చింది. నందిని అభయ్ అనే టెలిగ్రాం యాప్ ఉన్న వ్యక్తి ద్వారా కొన్ని వీడియోలను లైక్ చేస్తే నగదు వచ్చాయని తెలుసుకుంది. దీంతో ఆమె హెచ్‌డీ టెలిగ్రాం హ్యాండిల్ అలియాజ్ 'కుమారస్వామి 100' అనే టెలిగ్రాం యాప్‌కు రూ.10,323 చెల్లించాలని తెలపడంతో చెల్లించింది. ఆ తరువాత ఆమె ఖాతా స్తంభించిందని, మరో రూ. 34,511 చెల్లించాలని అడిగాడు. అది కూడా చెల్లించగా ఆమె ఖాతాను ఫ్రీజ్ చేసి మరికొంత చెల్లించాలని పేర్కొన్నాడు. తనకేమీ వద్దని తాను చెల్లించిన నగదు పూర్తిగా తిరిగి ఇవ్వాలని కోరగా ఆమెను టెలిగ్రాం యాప్ నుంచి తొలగించారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు పెట్టుబడుల పేరుతో మోసాలు జరుగుతున్నాయని అలర్టుగా ఉండాలని సూచించారు.

బస్సులో బంగారు ఆభరణాలు మాయం

వెంగళరావునగర్: బస్సులో బంగారు ఆభరణాలు చోరీ చేశారంటూ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... ఓల్డ్ అల్వాల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించే మహిళ బుధవారం రాత్రి తన తల్లితో కలసి కడప నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో బయలుదేరింది. ఉదయం ఎస్ఆర్‌నగర్ వచ్చిన తర్వాత తన బ్యాగ్‌ను చెక్ చేసుకుంది. బ్యాగ్‌లో ఉండాల్సిన గోల్డ్ చైన్, నెక్లెస్, నల్లపూసల దండ, రెండు చైన్లు, 5 రింగులు, రెండు సెట్ల చెవి రింగులు, చెవి జుంకాలు, మాటీలు, ముత్యాలహారం, కాసుల దండ తదితర బంగారు వస్తువులు కనబడలేదు. ఆందోళన చెందిన ఆమె డ్రైవర్, హెల్పర్స్‌లకు తెలియజేయగా, వారు తమకు తెలియదని సమాధానం చెప్పారు. దీంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై నిరసన సెగలు

వెంకటేశ్వరకాలనీ: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యల పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గురువారం బంజారాహిల్స్‌లోని కేన్సర్ ఆస్పత్రి వద్ద ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాజీ చైర్మన్ విప్లవ్‌కుమార్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేన్సర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి తెలంగాణ భవన్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా బంజారాహిల్స్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మహిళా మంత్రులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఫిలింనగర్‌లో..

ఫిలింనగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేపట్టారు. దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వీరిని ఫిలింనగర్‌పోలీస్ స్టేషన్‌కు తరలించి, సొంతపూచికత్తుపై వదిలేశారు.


నిరసన తెలుపుతున్న విప్లవ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ కవితారెడ్డి, కార్యకర్తలు

ఆయుర్వేద వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా రమాదేవి



వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సిహెచ్.రమాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయుష్ విభాగం ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ అనసూయ వరంగల్ ఆయుర్వేద కాలేజీకి బదిలీ అయ్యారు. కాగా రమాదేవి 1988లో మెడికల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. అనంతరం శాలక్య విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. ఎస్ఏస్పీ పీజీ ప్రొఫెసర్ ఇన్‌చార్జిగా కొనసాగారు. గత నెల 31వ తేదీన ఆమెను ప్రిన్సిపాల్‌గా అధికారులు నియమించారు.ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన తరుణంలో ప్రతి ఒక్కరూ ఆయుర్వేద వైద్యాన్ని అభ్యసించాలని సూచించారు. ఆయుర్వేదం ద్వారా విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు మెండుగా పొందవచ్చని తెలిపారు. స్థానిక కళాశాల అభివృద్ధికి తోటి సిబ్బంది సహకారంతో తన శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. మెరుగైన వైద్య విద్యను విద్యార్థులకు అందిస్తామని చెప్పారు.

జంక్షన్ల అభివృద్ధిపై అధికారుల సమీక్ష

బంజారాహిల్స్: పంజగుట్ట, ఎన్ఎఫ్‌సీఎల్ చౌరస్తాల్లో జంక్షన్ల అభివృద్ధిపై జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా చౌరస్తాల్లో అభివృద్ధి పనులపై చర్చించారు. ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేపట్టాలనే దానిపై సమీక్ష నిర్వహించారు.


ఎన్ఎఫ్‌సీఎల్ చౌరస్తాలో పర్యటిస్తున్న అనురాగ్ జయంతి తదితరులు

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం


పాలాభిషేకం నిర్వహిస్తున్న కైలాష్‌నాథ్, బంగారు ప్రశాంత్

శ్రీనగర్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు అనుకూల తీర్పును వెలువరించిన శుభసందర్భంగా గురువారం ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ సీనియర్ నేతలు బంగారు ప్రశాంత్, కైలాష్‌నాథ్‌లు పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీల చిరకాల స్వప్నం నెరవేరిందని, బీజేపీ అధికారంలో ఉండగా ఇలాంటి తీర్పురావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎ.ప్రశాంత్, చింతల శివ, సోమవారం సుధీర్, నాగిళ్ళ ఉదయ్, దేశ్‌పాండ చంద్రశేఖర్, నర్సింహస్వామి, గుడేపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, శుక్రవారం, 2, ఆగస్టు, 2024

వరల్డ్ అథ్లెటిక్స్ గుర్తింపుపై సీఎం హర్షం



సాక్షి, సిటీబ్యూరో: ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ నుంచి గుర్తింపు రావడంపై సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం మారథాన్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చ, తెలంగాణ స్పోర్ట్స్ ఫెడరేషన్ చైర్మన్ స్టాన్లీ జోన్స్, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ కమిటీ మెంబర్ రామ్ కటికనేని సీఎం రేవంత్‌రెడ్డిని సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 24న జరగనున్న ఈ కార్యక్రమానికి అవసరమైన మద్దతు ఇస్తామని, మారథాన్‌లో పాల్గొనే వారందరికీ సీఎం ఆల్ ది బెస్ట్ చెప్పారు.

అంతా స్మార్ట్..

- ఆరోగ్యంపై ముందస్తు సమాచారం
- క్రీడాకారులకు ప్రత్యేక యాప్స్
- రూ.వెయ్యి నుంచి రూ.90 వేల రేంజిలో

సాక్షి, సిటీబ్యూరో: వాచ్ రూపాంతరం చెంది స్మార్ట్ వాచ్‌గా మారింది. భిన్నమైన ఫీచర్లతో దూకుడు ప్రదర్శిస్తోంది. మార్కెట్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అద్భుతమైన పనితీరుకలిగిన స్మార్ట్ వాచ్‌లో అందుబాటులోకి వచ్చాయి. బ్లూటూత్ కనెక్ట్ చేసుకుని, మన ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు డేటా రూపంలో పొందుపరుచుకోవచ్చు. అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్ అవసరాలకు ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయి. యాపిల్, ఒప్పో, హువావే, ఫిట్ బిట్, నాయిస్, సామ్సంగ్, టైటాన్ మొదలైన కంపెనీలు స్మార్ట్ వాచ్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. సుమారు రూ.వెయ్యి నుంచి రూ.90 వేల వరకూ అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యంపై అలర్ట్స్..

ఇందులో గుండె పనితీరుకు సంబంధించిన నోటిఫికేషన్లు, రక్త ప్రసరణ, ఆక్సిజన్ స్థాయి, ఈసీజీ, ఇతర ఆరోగ్య వివరాల సమాచారం అందిస్తాయి. ఫాల్ డిటెక్షన్, క్రాష్ డిటెక్షన్ హార్డ్ ఫాల్, కార్ క్రాష్ సందర్భంలో అత్యవసర సేవలతో అనుసంధానం చేయగలవు. మహిళలకు భద్రత, రుతుచక్రం ట్రాకింగ్‌లోనూ ఈ స్మార్ట్ వాచ్ ఉపయుక్తం.

పిల్లల కోసం..

చిన్న పిల్లలను తల్లిదండ్రులు ట్రాక్ చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. జీపీఎస్ సాయంతో పిల్లల సమాచారాన్ని ట్రాక్ చేయొచ్చు.





మూడురోజుల పాటు దీప్‌మేళా!

దీప్‌శిఖా మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: దీప్‌శిఖా మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి భారీ మేళా జరగనుంది. దీప్‌మేళా పేరిట ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ మేళాను నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుంది. ఇందులో దాదాపు 200కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేళాలో వినూత్న, విభిన్న ఉత్పత్తులు లభిస్తాయి. మహిళలు సృజనాత్మకతతో ఇంట్లో తయారుచేసిన ఉత్పత్తులను ఈ మేళాలో ప్రదర్శించనున్నారు. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి ఈ మేళాలో పాల్గొనేందుకు వస్తుంటారు.



ఉదయాన్నే పాఠశాలకు వెళ్లే పిల్లలకు, ఉద్యోగ, వ్యాపార కార్యకలాపాలకు సిద్ధమయ్యే పెద్దవారికి లంచ్ బాక్సు కట్టడానికి ఇంట్లో రోజూ హడావుడి కనిపిస్తుంది. తక్కువ సమయంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నానికి భోజనం, బ్రేక్ సమయంలో స్నాక్స్ అన్నీ సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఇటువంటి సమయంలో ఆహారంలో కొద్దిగా ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా బాక్సు అలాగే తిరిగి ఇంటికి వచ్చేస్తుంది. నిత్యం రొటీన్ క్యారేజీ కడితే పిల్లలు తినడానికి అంతగా ఇష్టపడరు. ఈ నేపథ్యంలో అటు పిల్లలు ఇష్టపడేలా.. ఇటు పోషకాలు అధికంగా ఉండేలా.. ఆహార నిపుణుల సూచనలతో కొన్ని రెసిపీలు మీ కోసం..

- సాక్షి, సిటీబ్యూరో



నైస్.. రైస్..

రుచికరంగా.. కొత్తదనంగా..



వంటింట్లో టమాటా రైస్, ఎగ్ రైస్, జీరా రైస్, పుదీనా రైస్, పెరుగన్నం, అప్పుడప్పుడు వెజ్, నాన్‌వెజ్ ఫ్రైడ్ రైస్ వంటివి తెలిసిన వంటకాలు. అలాగే ఆరోగ్యం అందించే కరివేపాకు రైస్, ఉల్లి రైస్, కాలిఫ్లవర్ రైస్ వంటివి కూడా ట్రై చేయండి. తయారీకి తక్కువ సమయం, తినడానికి రుచికరంగా ఉంటాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల లంచ్ బాక్సుకు ఉపయోగకరంగా ఉంటాయి.



కరివేపాకు అన్నం..

జీర్ణశక్తిని పెంపొందించడంలో కరివేపాకు ఉపయోగపడుతుంది. అందుకే తరతరాలుగా అన్ని వంటల్లో కొంచెమైనా కరివేపాకు వేస్తారు. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయినా పిల్లలు, పెద్దల్లో కొంత మంది మాత్రం కరివేపాకులు కనిపిస్తే తీసి పక్కన పడేస్తారు. అటువంటి వారికోసం కరివేపాకు రైస్ చేసి పెడితే చకచకా తినేస్తారు. కరివేపాకుల వల్ల కలిగే లాభాలన్నీ వారికి అందుతాయి. వంట వేగంగా అయిపోతుంది. బియ్యం కడిగి, నీటిని వడపట్టి పక్కన పెట్టుకోవాలి. స్టవ్‌పై పాత్ర పెట్టి టీస్పూను నూనె, ఒకటిన్నర కప్పు కరివేపాకు ముక్కలు, కొబ్బరి తురుము కలిపి ఒక నిమిషం వేయించాలి. చల్లారిన తరువాత మిక్సీలో రుబ్బుకోవాలి. మరో పాత్రలో నూనె, లవంగాలు, పచ్చి మిర్చి ముక్కలు, ఉల్లి ముక్కలు, షాజీరా, అల్లం వెల్లుల్లి పేస్టు వేయించాలి. అప్పటికే కడిగి పెట్టుకున్న బియ్యాన్ని వేయాలి. అందులో కరివేపాకు పేస్ట్, ఉప్పు, నిమ్మరసం వేసి కలపాలి. బియ్యం పలుగ్గా ఉడికిన తరువాత సిమ్‌లో కొద్దిసేపు ఉంచాలి. అంతే కరివేపాకు అన్నం రెడీ.

కాలిఫ్లవర్ రైస్..

కాలిఫ్లవర్ ఆరోగ్యానికి మంచిది. కూరలు, ఫ్రై చేయడానికి, వెజ్ మంచూరియా వంటి వంటకాల్లో వాడుతుంటారు. కాలిఫ్లవర్ రైస్ ట్రై చేయాలనుకుంటే మాత్రం ఇలా చేయండి.. బియ్యం 80 శాతం ఉడికించి పక్కన పెట్టుకోవాలి. మరో పాత్రలో తరిగిన కాలిఫ్లవర్ ముక్కలను ఉప్పు, పసుపు వేసి 10 నిమిషాల పాటు ఉడికించాలి. అనంతరం నీటిని వడగట్టి ముక్కల్ని ఆరబెట్టుకోవాలి. జీలకర్ర, అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి, బఠానీలు వేసి తాలింపు సిద్ధం చేసుకోవాలి. అందులో కాలిఫ్లవర్ ముక్కలు వేసి, గరం మసాలా కలపాలి. వేగిన తరువాత ఉడకబెట్టిన అన్నం వేసి, అవసరమైనంత ఉప్పు వేసి కలపాలి. అన్నం పూర్తిగా ఉడికే వరకూ చూసుకోవాలి. చివరిగా కొత్తిమీర వేసుకుంటే కాలిఫ్లవర్ రైస్ సిద్ధమైనట్లే.



ఉల్లి రైస్..

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదని నానుడి. ఆరోగ్యపరంగా ఉల్లికి అంత ప్రాముఖ్యత ఉందన్నమాట. కూరలు, ఇతర రెసిపీలు తయారీలోనే కాదు, ఉల్లి రైస్‌ని ట్రై చేయాలనుకుంటే మాత్రం ఇది చూడండి. ఉల్లిని మనకు నచ్చిన రీతిలో (నిలువుగా, అడ్డంగా) ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. బియ్యం కడిగి ఉంచుకోవాలి. పొయ్యిపై పాత్ర పెట్టి నూనె వేడెక్కాక జీలకర్ర, ఆవాలు, మినపప్పు, శెనగపప్పు వేయించాలి. కరివేపాకులు వేసి వేగాక, తరిగిన ఉల్లి ముక్కలు, పచ్చి మిర్చి, యాలుకలు, లవంగాలు వేసి వేయించాలి. తరువాత కడిగి సిద్ధం చేసుకున్న బియ్యం వేసి బాగా కలపాలి. అవసరమైనంత ఉప్పు వేసుకోవాలి. అన్నం ఉడికిన తరువాత దించితే సరిపోతుంది.



3న యూకే 'వృత్తి, విద్యావకాశాల'పై సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ విదేశీ విద్యా కన్సల్టెన్సీ గ్లోబల్ ట్రీ, నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలుమ్ని–యూకే (ఎన్ఐఎస్ఏయూ–యూకే) సంయుక్తంగా ఆగస్టు 3న ఎన్ఐఎస్ఏయూ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థుల ఉపాధి, యూకే విశ్వవిద్యాలయ అవకాశాలపై అవగాహన కల్పించడం కోసం విల్లా మేరీ ఉమెన్ డిగ్రీ కాలేజ్ వేదికగా ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బేగంపేట్‌లోని గ్లోబల్ ట్రీ హెడ్ ఆఫీస్‌లో గురువారం ఆవిష్కరించారు. గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకులు శ్రీకర్ ఆలపాటి మాట్లాడుతూ.. విద్యార్థుల సామర్థ్యాలపైన సంపూర్ణ అవగాహన కల్పిస్తూ, విజయవంతమైన భవిష్యత్ నిర్మాణం కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్ఐఎస్ఏయూ–యూకే చైర్‌పర్సన్ సనమ్ అరోరా మాట్లాడుతూ.. నైపుణ్యాలకు అవకాశాల వేదికగా ఈ ఈవెంట్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. వివరాలకు 77310 63106 నెంబర్లో సంప్రదించవచ్చు.



7న 'పరమాత్ముని సందేశం' పుస్తకావిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ రచయిత ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదించిన 'పరమాత్ముని సందేశం' పుస్తకాన్ని ఈనెల 7న ఆవిష్కరించనున్నారు. శిల్పకళా వేదికలో ఈ సభ జరగనుంది. ముఖ్య అతిథిగా శాంతా బయోటిక్స్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత వరప్రసాద్ రెడ్డి హాజరుకానున్నారు. అలాగే ఫల్గుణీ పాఠక్ కూడా హాజరుకానున్నారు.

ఆ వందలో మనం!

- ప్రపంచ ప్రముఖ ప్రదేశాల లిస్టులో 'మనం' చాక్లెట్
- ఇటీవల జాబితా విడుదల చేసిన టైమ్ మ్యాగజైన్
- స్వదేశీ చాక్లెట్లకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చేలా కృషి

ఈ చాక్లెట్ తిన్నామంటే మైమరిచిపోవాలంతే..

సాక్షి, సిటీబ్యూరో: మీకు చాక్లెట్లంటే ఇష్టమా..? అసలు చాక్లెట్లు చూస్తేనే నోరూరుతుందా..? డిఫరెంట్ చాక్లెట్లను టేస్ట్ చేయడం మీకు అలవాటా? అయితే మీరు తప్పకుండా నగరంలోని 'మనం' చాక్లెట్ కార్ఖానాను ఒక్కసారైనా సందర్శించాల్సిందే. ఎందుకంటే ఇక్కడ దాదాపు 60కి పైగా వెరైటీ చాక్లెట్లు నోరూరిస్తుంటాయి. ఒకే దగ్గర పెరిగిన కోకో చెట్ల నుంచి తయారైన చాక్లెట్లను వీరు విక్రయిస్తున్నారు.

టైమ్ మ్యాగజైన్ జాబితాలో చోటు

ప్రతిష్టాత్మక టైమ్ మ్యాగజైన్ 'ప్రపంచంలోని గొప్ప ప్రదేశాల' జాబితాను ప్రచురించింది. ఆయా రంగాలతో పాటు ప్రపంచంలో ప్రత్యేకంగా నిలిచే 100 అద్భుతమైన ప్రదేశాలు, కంపెనీలను ఇందులో చేర్చింది. హోటళ్లు, క్రూజ్‌లు, రెస్టారెంట్స్, పర్యాటక స్థలాలు, మ్యూజియాలు, పార్కులను గుర్తించింది. పలు మార్గాల్లో స్వదేశీ పదార్థాలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేందుకు మనం చాక్లెట్ కార్ఖానా పనిచేస్తోందని కొనియాడింది.



అంతర్జాతీయ గుర్తింపు..

భారత్‌లో పండించిన కోకోతో చాక్లెట్ల తయారీకి 'మనం చాక్లెట్' ప్రసిద్ధి పొందింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న ఈ సంస్థ ఉత్పత్తులకు ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. ఇక్కడ తయారైన చాక్లెట్లకు అంతర్జాతీయంగా చాలా డిమాండ్ ఉంది. 2023 ఆగస్టులో మనం చాక్లెట్ కార్ఖానాను ముప్పల చైతన్య స్థాపించారు. ఆల్మండ్ హౌజ్ మిఠాయి దుకాణం వీరి కుటుంబానికి చెందినది కావడం విశేషం.

ఎన్నో రకాల వెరైటీలు..

డార్క్ చాక్లెట్లు, చాక్లెట్ ట్యాబ్లెట్స్, స్నాక్స్, ఒకే ప్రదేశంలో పండించినవి, అంతర్జాతీయంగా పండించిన కోకో నుంచి తయారైనవి, పాల మిశ్రమంతో చేసినవి ఇలా ఎన్నో రకాల వెరైటీ చాక్లెట్లు ఈ కార్ఖానాలో లభిస్తుంటాయి. పండ్లు, ప్లేన్, వీగన్ వంటి చాక్లెట్ల రకాలు కూడా తయారు చేస్తారు. ఇక్కడ తయారైన పది రకాల చాక్లెట్లను అవార్డులు కూడా వరించాయి.

వర్క్‌షాప్స్‌తో పిల్లలకు నేర్పిస్తూ..



చాక్లెట్ల తయారీలో మనం చాక్లెట్ కార్ఖానా అప్పుడప్పుడూ వర్క్‌షాప్స్ కూడా నిర్వహిస్తుంటుంది. సొంతంగా క్లస్టర్లు, కేక్ పాప్స్ తయారు చేసే విషయంలో పిల్లలకు శిక్షణ కూడా ఇస్తుంటుంది. కొన్నిసార్లు అసలు చాక్లెట్లు ఎలా తయారు చేస్తారో తెలుసుకునేలా టూర్ కూడా ఏర్పాటు చేస్తుంటారు. చాక్లెట్ కుకీస్, చాక్లెట్ ఇంక్లూజన్ స్లాబ్స్ తయారీలో 5–10 ఏళ్ల పిల్లలకు మెళకువలు నేర్పిస్తుంటారు.

వాస్తు చిత్రలేఖనం!

శిల్పశాస్త్రం, రూపం కలయికే వాస్తు పెయింటింగ్



సాక్షి, సిటీబ్యూరో: ప్రాచీన ఆలయాలు, గోపురాలు, గృహాలు వాస్తు శాస్త్రం ప్రకారమే నిర్మించారని భారతీయ వాస్తు శాస్త్రం చెబుతుంది. వాస్తు అంటే బలం, విశ్వాసం! అందుకే ఇల్లు కొంటున్నామంటే చాలు వాస్తు చూడనిదే నిర్ణయం తీసుకోరు. ఈ వాస్తుకు శిల్ప శాస్త్రాన్ని, చిత్రలేఖనాన్ని జోడించిన వాస్తు చిత్రలేఖనానికి కూడా ప్రాధాన్యం పెరిగిపోయింది. గృహాలు, కార్యాలయాలు, హోటళ్లు వంటి అన్ని రకాల భవన నిర్మాణాల్లో వాస్తు పెయింటింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. చూపరులను ఆకట్టుకునే ఈ వాస్తు చిత్రలేఖనం ఇప్పుడొక ట్రెండ్! దేవాలయానికి, శిల్పకళకు అవినాభావ సంబంధం ఉంది. విశ్వఖ్యాతి గాంచిన భారతీయ శిల్ప కళకు రెండువేల ఏళ్ల నాటి చరిత్ర ఉంది. ఇక్ష్వాకులు మొదలుకొని విజయనగర చక్రవర్తుల వరకూ వేర్వేరు కాలాల్లో శిల్ప–చిత్రకళాభివృద్ధికి దోహదం చేశారు. వాస్తు, శిల్పశాస్త్రం, చిత్రలేఖనం మూడు వేర్వేరు కళలను మిళితం చేసి.. నేటి తరానికి, అవసరాలకు అనుగుణంగా అందుబాటులోకి వచ్చిందే వాస్తు పెయింటింగ్.

ఎన్ని రోజులు పడుతుందంటే..

ఒక పెయింటింగ్ పూర్తవడానికి నక్షత్రాన్ని బట్టి 41 నుంచి 108 రోజుల సమయం పడుతుంది. వీటి ధర నక్షత్రాన్ని బట్టి రూ.10 వేల నుంచి ప్రారంభమవుతుంది. యాక్రాలిక్, మిక్స్‌డ్ కలర్లను వినియోగిస్తారు. నక్షత్ర బలాన్ని బట్టి వీటిని పూజ గదిలో, హాల్‌లో ఇంటిలోపల పెట్టే చోటును నిర్ణయిస్తారు.



బ్రహ్మ ముహూర్తంలోనే..

ఒక కుటుంబంలోని అందరి వ్యక్తుల జాతకం, నక్షత్రం ప్రకారం ఆ ఇంటిలో ఎవరి నక్షత్రం బలంగా ఉంటుందో వారు పూజించాల్సిన దేవుడిని నిర్ణయిస్తారు. ఆ ఇంటి వాస్తు, నక్షత్రం తిథి ప్రకారం బ్రహ్మ ముహూర్తం నిర్ణయిస్తారు. దేవుడిని స్మరిస్తూ, ధాన్యంతో వస్త్రం మీద ఈ పెయింటింగ్‌ను వేస్తారు. ఈ చిత్రలేఖనం జరిగినన్ని రోజులు ఆ నక్షత్రానికి బలం చేకూర్చేందుకు జరగాల్సిన అన్ని రకాల హోమాలు, యోగాలు, క్రతువులు ఆగమ శాస్త్రం ప్రకారం చిత్రకారుడే పూర్తి చేస్తాడు. నరఘోష నివారణకూ పెయింటింగ్ వేస్తుంటారు.

ఇళ్లు, ఆఫీసుల్లో..





రాజకీయ నేతలు, ప్రముఖులు, సెలెబ్రిటీల గృహాలు, విల్లాలు, ఫామ్ హౌస్‌లలో ఈ వాస్తు పెయింటింగ్‌లను వేయిస్తున్నారు. ఆఫీసులు, హోటళ్ల, కార్పొరేట్ కార్యాలయాల్లో కూడా చూపరులను ఆకట్టుకునే ఈ చిత్రలేఖనాలు కనిపిస్తున్నాయి. దక్షిణామూర్తి, అభయ హనుమాన్, యంత్రోద్ధారక హనుమాన్, నందీశ్వర, కలియుగ వేంకటేశ్వర్లు, ఇష్టకామేశ్వరి దేవి, ఆగమనం (పుణ్యపురుషులు), నరదృష్టి నారాయణ యంత్రం, తాండవ గణపతి, నయన దర్శనం, శృంగార దేవి, కొలువు శ్రీనివాసమూర్తి, నర్తకి, అభయ సూర్యనారాయణమూర్తి వంటి దేవుళ్ల పెయింటింగ్స్ వేస్తుంటారు.



వాస్తు పెయింటింగ్‌తో మనశ్శాంతి

వాస్తు పెయింటింగ్ ఉన్న ఇళ్లలో సానుకూల భావాలను కలిగిస్తుంది. మనశ్శాంతి లభిస్తుంది. చేసే పని మీద ఏకాగ్రత పెరుగుతుంది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునే వివేకం కలుగుతుంది.

– కంభంపాటి, ప్రముఖ వాస్తు చిత్రకారుడు

అడ్డంకులు అధిగమించాం..

విజయం సాధించాం

సాక్షి, న్యూఢిల్లీ

'మాదిగల 30 ఏళ్ల పోరాటానికి తెర పడింది. వర్గీకరణ పోరాటంలో అడుగడుగునా అరెస్టులు.. ఉద్యమాలను అడ్డుకున్నా, పట్టు వీడకుండా న్యాయమైన పోరాటానికి అడుగులు వేశాం. ఉద్యమం ప్రారంభించిన తొలిరోజుల్లో ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటన్నింటినీ ఎదుర్కొని నిలబడి ఈ రోజు వర్గీకరణ సాధించాం. మాదిగల్లో పోరాట స్ఫూర్తిని నింపాం. గ్రామస్థాయి నుంచి నగరస్థాయి వరకు రిజర్వేషన్లపై చైతన్యం తెచ్చాం' అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై గురువారం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మంద కృష్ణమాదిగను 'సాక్షి' పలకరించింది. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే....

- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం
- ఈ తీర్పు ఎమ్మార్పీఎస్ కార్యకర్తల పోరాట ఫలితమే
- వర్గీకరణకు మద్దతు పలికిన వారే వ్యతిరేకించారు

'సాక్షి'తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



ఎమ్మార్పీఎస్ కార్యకర్తల పోరాటం వల్లే..

మాదిగల హక్కుల కోసం 1994 జూలై 7న 'మాదిగ పోరాట సమితి'ని స్థాపించాను. గ్రామ, మండలస్థాయిలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు..రాజకీయపార్టీల కార్యకర్తలకు దీటుగా నిలబడ్డారు. ఎంతోమంది మాదిగలు వర్గీకరణ కోసం బలిదానాలు చేసుకున్న సంఘటనలు నన్ను ప్రతిరోజూ కలచివేస్తుండేవి. 'అన్నా మేం చనిపోతున్నాం..అయినా సరే పోరాటం ఆపొద్దు. మీరు ముందుండి ఉద్యమాన్ని నడపండి...ఏదో ఒకరోజు రిజర్వేషన్లు కచ్చితంగా సాధిస్తాం'అంటూ చనిపోయే ముందు కొందరు కార్యకర్తలు నాతో మాట్లాడిన మాటలు ప్రతిరోజూ నేను గుర్తు చేసుకుంటూ పోరాటాలకు పిలుపునిచ్చేవాడిని. వారి కన్నీళ్ల ప్రతిఫలమే ఈరోజు సుప్రీంకోర్టు తీర్పు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు బలంగా ఉంటూ, పోరాటాలు చేశారు. ఎంతో మంది నాయకులు మా కార్యకర్తలపై భౌతికంగా దాడులు చేసినా, వేధించినా, కేసులు పెట్టినా భయపడకుండా ధైర్యంగా నిలబడ్డారు. ఎమ్మార్పీఎస్ పోరాటస్ఫూర్తి వల్లనే ఈరోజు విజయం సాధించాం.

ఎంతో మంది సహకరించారు

మేం చేసిన ఈ పోరాటానికి ఎంతోమంది మద్దతు పలికారు. అనేక పర్యాయాలు ఆర్థికపరమైన సాయం, మాట సాయం, న్యాయపరమైన సాయాలు ఎందరో చేశారు. వారందరికీ ఈ సందర్భంగా హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

ఆ ఐదుగురు అలా..ఈ ఐదుగురు ఇలా

2004లో జస్టిస్ సంతోష్‌హెగ్డే నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం రిజర్వేషన్లు చెల్లవు అంటూ రద్దు చేసింది. ఆ తర్వాత 2020లో అరుణ్‌మిశ్రాతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం రాష్ట్రప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేయొచ్చని తీర్పు ఇచ్చింది. ఇదే సందర్భంలో ఏడుగురు సభ్యుల ధర్మాసనం దీనిపై న్యాయం చెప్పాలని సూచనలు చేసింది. ఆ సూచనల కారణంగానే తాజాగా రిజర్వేషన్లపై తీర్పు రావడం ఆనందంగా ఉంది. ముందేమో ఐదుగురు సభ్యులున్న ధర్మాసనం వ్యతిరేకించింది, ఆ తర్వాతే మరో ఐదుగురు సభ్యులున్న ధర్మాసనం సానుకూలంగా స్పందించింది.

ఉమ్మడి ప్రయోజనాల కోసం పోరాడుదాం

వర్గీకరణ కోసం మేం పోరాటాలు చేస్తుంటే మా మాల సోదరులు రోడ్డెక్కి అడ్డుచెప్పేవారు. కానీ, కొంతకాలంగా వారి మనసులు మారాయి, మా పోరాటాలకు ఎవరూ అడ్డు పడలేదు. ఇకపై ఉమ్మడి ప్రయోజనాల కోసం ఎస్సీలందరం కలిసి పోరాడాల్సిన అవసరముంది. 2004లో తెచ్చిన చట్టాన్నే ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తే సరిపోతుంది. ఇక తెలంగాణలో కొన్ని నిర్ణయాలు తీసుకొని వాటిని అమలు చేయాల్సి ఉంది. వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నా.



దప్పు దరువులతో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

సీఎంకు మాదిగ ఎమ్మెల్యేల స్వీట్లు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డికి మిఠాయిలు తినిపించారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో డప్పు చప్పుళ్లతో సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో కడియం శ్రీహరి, కాలె యాదయ్య, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్య నారాయణ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శామేలు, తోట లక్ష్మీకాంతరావు తదితరులున్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు చారకొండ వెంకటేశ్, గజ్జెల కాంతం, దేవని సతీశ్, మాజీ మంత్రి పుష్పలీల కూడా సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణ అమల్లో ముందుంటాం

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును దేశంలోనే అందరికన్నా ముందు భాగాన నిలబడి అమలు చేసే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు అమల్లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లలోనూ వర్గీకరణ అమలుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. దీని కోసం అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉపకులాల యువకులు 27 ఏళ్లుగా పోరాటం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో గురువారం రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న ఉద్యోగ నోటిఫికేషన్లకూ వర్తింపు

- అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తాం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటన
- మాదిగలకు ద్రోహం చేసిందే కాంగ్రెస్: హరీశ్‌రావు
- వర్గీకరణ వెంటనే చేయాలని 2014లోనే తీర్మానం చేశాం
- కేసీఆర్ స్వయంగా తీర్మానం కాపీని ప్రధానికి అందజేశారు

వర్గీకరణపై గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

'వర్గీకరణ కోసం గతంలో ఇదే శాసనసభలో వాయిదా తీర్మానం ఇచ్చాం. ఆ సందర్భంగా అప్పటి ప్రభుత్వం కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, సంపత్‌కుమార్‌నూ సభ నుంచి బహిష్కరించింది. వర్గీకరణపై గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఈ అంశంపై ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఈ దిశగా ఏ ప్రయత్నమూ చేయకుండా మాదిగ సోదరులను మోసం చేసింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచన మేరకు మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో శాసనసభ్యులు, అడ్వొకేట్ జనరల్‌ను ఢిల్లీకి పంపాం. న్యాయ కోవిదులతో చర్చించి వర్గీకరణపై సుప్రీంకోర్టులో బలమైన వాదన విన్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. ఈ నేపథ్యంలో మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం హర్షణీయం..'అని సీఎం పేర్కొన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల వర్గీకరణకు సంపూర్ణ సహకారం అందించాలని అన్ని పక్షాలను కోరారు. రాజ్యాంగ ధర్మాసనానికి సభా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ ప్రకటన నేపథ్యంలో పలువురు కాంగ్రెస్ సభ్యులు ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

50 ఏళ్ల కల నెలవేరింది: రాజనర్సింహ

ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపడంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో హర్షం వ్యక్తం చేశారు. యాభై ఏళ్ల కల నెరవేరిందని, ఇది చారిత్రక దినమని అన్నారు. వర్గీకరణ అంటే మరో వర్గానికి వ్యతిరేకం కాదని చెప్పారు.

వర్గీకరణకు వైఎస్సార్ మద్దతిచ్చారు

కాంగ్రెస్ సభ్యుడు వేముల వీరేశం మాట్లాడుతూ.. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. మంద కృష్ణమాదిగను జైల్లో పెట్టించింది కేసీఆరే అన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. మాదిగ బిడ్డ స్పీకర్ అవడంతో కేసీఆర్ సభకు రావడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ తరఫున అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మందుల సామ్యూల్ కూడా మాట్లాడారు. సుప్రీం తీర్పును బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ స్వాగతించారు. ఈ దిశగా ప్రధాని నరేంద్రమోదీ కృషి చేశారని తెలిపారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ కూడా తీర్పును స్వాగతించారు. కంభంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సీఎల్పీ నాయకుడిగా గతంలో భట్టి విక్రమార్కను నియమిస్తే, ఆయన నాయకత్వంలో పనిచేయలేక సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లిపోయారని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులకు సుప్రీంకోర్టు తీర్పు పట్ల వ్యతిరేకత ఉన్నట్లుగా భావించాల్సి వస్తోందని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు ద్వారా దళిత జాతులకు సమన్యాయం చేసే చక్కటి అవకాశం లభించిందన్నారు. 'తీర్పునకు అనుగుణంగా రాబోయే నోటిఫికేషన్లలో వర్గీకరణను అమలు చేస్తామని, ఆర్డినెన్స్ తెస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినందుకు దళిత జాతుల పక్షాన ధన్యవాదాలు' అని ఆయన అన్నారు. అంతకుముందు ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ మనఃస్ఫూర్తిగా స్వాగతిస్తోంది: హరీశ్‌రావు



అసెంబ్లీ కౌరవ సభను తలపిస్తోందని, ఏది ఏమైనా అంతిమ విజయం పాండవులదేనని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏదైనా ఒక ముఖ్యమైన అంశంపై ప్రధాన ప్రతిపక్షం నుంచి ఎవరు మాట్లాడతారని అడిగి అవకాశం ఇచ్చే సాంప్రదాయం సభలో ఉందని.. అయితే అధికార పక్షం సభా సాంప్రదాయాలను తుంగలో తొక్కడంపై తాను నిరసన వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. సమయం వచ్చినప్పుడు ప్రజలే కాంగ్రెస్ పార్టీకి సరైన బుద్ధి చెబుతారని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును తాము స్వాగతిస్తున్నామంటూ.. మాదిగలకు ద్రోహం చేసింది కాంగ్రెస్సేనని విమర్శించారు. గతంలో తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆనాటి సీఎం కేసీఆర్ 2014 నవంబర్ 29న వర్గీకరణ వెంటనే చేయాలని సభలో తీర్మానం ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆనాటి ఉప ముఖ్యమంత్రులు, దళిత నాయకులతో కలిసి వెళ్లి కేసీఆర్ స్వయంగా తీర్మానం కాపీని ప్రధానికి అందజేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా వర్గీకరణ ప్రాధాన్యతను ప్రధానికి కేసీఆర్ వివరించారని.. ప్రధాని కూడా చాలా స్పష్టంగా ఇది న్యాయమైన డిమాండ్ అని, దీన్ని తప్పకుండా పరిష్కరిస్తామంటూ సానుకూలంగా స్పందించారని చెప్పారు. వర్గీకరణ పోరాటం సుదీర్ఘమైనదని, ఎన్నో త్యాగాలు జరిగాయని, ఎంతోమంది ప్రాణాలు అర్పించిన సంగతి మనకు తెలుసని అన్నారు. అమరులైన కుటుంబాలను కేసీఆర్ ప్రభుత్వమే ఆదుకున్నదని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ద్రోహం చేసిందని చెప్పారు. గాంధీభవన్ దగ్గర పెట్రోల్ పోసుకుని కొందరు మాదిగలు ఆత్మాహుతికి పాల్పడితే.. అప్పటి ప్రభుత్వం కనీసం వాళ్లను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఏదిఏమైనా ఇది చాలా సంతోషకరమైన సందర్భమని, దశాబ్దాల కల నెరవేరిన రోజని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున సుప్రీంకోర్టు తీర్పును మనఃస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కిల్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లుకు కూడా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని చెప్పారు.

ప్రతి కులానికి రిజర్వేషన్ ఫలం!

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఫలితం

ఇప్పటివరకు లబ్ధి పొందని కులాలకు ఇకపై ప్రత్యేక కోటాతో న్యాయం

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎస్సీ, ఎస్టీల్లోని ఉపకులాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాల కల నెరవేరిందని ఆయా వర్గాల నేతలు చెబుతుండగా.. వాస్తవంగా ఏమేరకు లబ్ధి జరుగుతుందనే చర్చ మరోవైపు మొదలైంది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అమలవుతున్నప్పటికీ అభివృద్ధిలో ఉన్న కులాలే ఎక్కువ లబ్ధి పొందుతున్నాయనే వాదన తీవ్రంగా ఉంది. ఎస్సీల్లో మాలలే ఎక్కువగా రిజర్వేషన్ల ఫలాలు అందుకుంటున్నారని, మాదిగలకు సరైన కోటా దక్కడం లేదనే వాదన ఉండగా.. ఎస్టీల్లో లంబాడాలే రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందుతున్నారంటూ ఆదివాసీ తెగలు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తున్నాయి. ఈ క్రమంలోనే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), తుడుం దెబ్బ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి పేరిట ఉద్యమాలు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. ఇందులో అత్యంత చురుకుగా ఎమ్మార్పీఎస్ ముందు వరుసలో ఉంది. దాదాపు 30 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ ఉద్యమాలకు సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పరిష్కారం లభించినట్లైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు...

రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల కేటగిరీలో 60 ఉప కులాలున్నాయి. అదే విధంగా షెడ్యూల్డ్ తెగల (ట్రైబ్స్) కేటగిరీలో 32 ఉప కులాలు



న్నాయి. గిరిజన కేటగిరీలో పర్టిక్యులర్లీ వల్నరెబుల్ (అత్యంత బలహీన) ట్రైబల్ గ్రూప్స్ (పీవీటీజీ) విభాగం కింద మరో 5 కులాలున్నాయి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో ప్రధానంగా నాలుగైదు కులాల్లోనే అత్యధిక జనాభా ఉండగా.. మిగిలిన కులాల్లో మాత్రం వెయ్యిలోపు నుంచి పదివేల లోపు జనాభా ఉన్నవే ఎక్కువ. కాగా ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లను వర్గీకరించేందుకు అనుమతించడంతో పాటు అన్ని కులాలకు సమానంగా అందించేవిధంగా వర్గీకరణ చేపట్టాలని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా తీర్పునిచ్చింది. ఈ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకోవాలని సూచించింది. దీంతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ ఏవిధంగా జరుగుతుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్ర జనాభా, అందులో ఎస్సీ, ఎస్టీ జనాభా వివరాలు

కేటగిరీ	జనాభా (2011 సెన్సెస్)	జనాభా (2014 సమగ్ర కుటుంబ సర్వే)
రాష్ట్ర జనాభా	3,50,03,674	3,68,76,544
ఎస్సీ జనాభా	54,08,800	64,44,584
ఎస్టీ జనాభా	31,77,940	36,44,453

ఎస్సీ, ఎస్టీల్లోని ప్రతి కులానికి రిజర్వేషన్ ఫలాలు

సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ జరిగేందుకు మార్గం సుగమమైంది. మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు సంఘాలు తీవ్రస్థాయిలో చేసిన ఉద్యమానికి ఇప్పుడు ఫలితం దక్కింది. ఎస్సీ, ఎస్టీల్లోని ప్రతి కులానికి ఇప్పుడు రిజర్వేషన్ ఫలాలు అందుతాయి. ఇప్పటివరకు రిజర్వేషన్ల అమల్లో స్పష్టత లేకపోవడంతో కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు దక్కించుకున్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. జనాభా ప్రాతిపదికన అన్ని కులాలకు వర్గీకరణ ద్వారా న్యాయం జరగనుంది.

- వలిగి ప్రభాకర్ ఎరుకల, ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు

ఎస్సీ కేటగిరీలో అత్యధిక జనాభా ఉన్న కులాలు (2011 జనగణన ప్రకారం)

కులం	జనాభా
బేడ(బుడగ) జంగం	111710
గోసంగి	23351
మాదిగ	3233642
మహర్	31938
మాల, మాల అయవారు	1527143
నేతకాని	133072
మన్నె	29656

ఎస్టీ కేటగిరీలో అత్యధిక జనాభా ఉన్న కులాలు (2011 జనగణన ప్రకారం)

కులం	జనాభా
లంబాడ	2046117
కోయ	486391
గోండ్	297846
ఎరుకల	144128
కొలాం	44805

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

- ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణపై పలు పార్టీల స్పందన
- ధర్మమే గెలుస్తుందనేది రుజువు అయ్యింది: మందకృష్ణ మాదిగ

సాక్షి, న్యూఢిల్లీ / హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పలువురు స్వాగతించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమాన్ని దెబ్బ తీయడానికి ఎన్నో కుట్రలు జరిగాయని, అయినా సహనం కోల్పోకుండా పట్టుదలతో పోరాటం చేస్తూ విజయం సాధించినట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవ తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఏనాటికైనా ధర్మమే గెలుస్తుందనేది రుజువు అయ్యిందని చెప్పారు.

మోదీ పలుమార్లు మద్దతు పలికారు: ఈటల

ఎస్సీ వర్గీకరణ విషయంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే పలుమార్లు మద్దతు తెలిపారని మల్కాజగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సుప్రీం తీర్పుతో ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. మందకృష్ణతో పాటు వర్గీకరణ కోసం పోరాడిన ప్రతి ఒక్కరికీ అభినందనలు చెప్పారు.

అన్యాయం జరిగిందనేది వాస్తవం : నారాయణ

మాదిగలకు అన్యాయం జరిగిందనేది వాస్తవమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సుప్రీం ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు.

క్రెడిట్ పూర్తిగా బీజేపీదే : డీకే అరుణ

ఎస్సీ వర్గీకరణ క్రెడిట్ పూర్తిగా బీజేపీదే.. ఈవిషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసిందేమీ లేదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవతోనే ఎస్సీల 30 ఏళ్ల కల నెరవేరిందని చెప్పారు.


- ఎస్సీ వర్గీకరణపై తొలినుంచి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.
- సుప్రీం తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని ఎంపీ, రఘునందనరావు చెప్పారు.
- వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ హక్కుల దండోర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ అన్నారు.
- టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం ఆధ్వర్యంలో పలువురు ఎస్సీసెల్ కార్యకర్తలు గాంధీభవన్‌లో టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు.
- తెలంగాణలో వర్గీకరణ ఇంప్లిమెంటేషన్ జరగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆశాభావం వ్యక్తం చేశారు
- వచ్చే నోటిఫికేషన్‌ల నుంచి వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి మాదిగల పక్షాన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.
- మొట్టమొదటిగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు పలికిన జాతీయపార్టీ సీపీఐ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.

స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్ష జరపొచ్చు

స్పీకర్‌ను ట్రిబ్యునల్ చైర్మన్‌గా పరిగణించాలి

- న్యాయస్థానాలకు ఆ అధికారం ఉంది
- 'అనర్హత'పై 3 నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి
- గతంలో సుప్రీంకోర్టు తీర్పులో ఇదే తేల్చిచెప్పింది
- 'ఫిరాయింపు' పిటిషన్లపై హైకోర్టులో పిటిషనర్ల వాదనలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ స్పీకర్ నిర్ణయాలపై న్యాయసమీక్ష జరిపే అధికారం ధర్మాసనాలకు ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం హైకోర్టులో వాదనలు వినిపించారు. స్పీకర్‌ను ట్రిబ్యునల్ చైర్మన్‌గా పరిగణించాలని.. స్పీకర్‌కు కాకపోయినా, ట్రిబ్యునల్ చైర్మన్‌కు న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేయవచ్చన్నారు. ఇదే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు ఓ కేసు విచారణ సందర్భంగా తేల్చిచెప్పిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌ను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ.వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎల్పీనేత మహేశ్వర్‌రెడ్డి మూడు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు, మాజీ ఏఏజీ రామచంద్రరావు హాజరయ్యారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపిస్తూ.. 'ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి పార్టీ మారడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆయన్ను ప్రజలు ఓడించారు. మహారాష్ట్ర, మణిపూర్ కేసులలో సుప్రీంకోర్టు వెలువరించిన రెండు తీర్పులను పరిశీలిస్తే.. తమ ముందు పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రూల్ 6, 7ను ప్రకారం స్పీకర్ నడుచుకోవడం లేదు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలి. అని విజ్ఞప్తి చేశారు.



ప్రజాస్వామ్యానికి ముప్పన్న సుప్రీంకోర్టు

'పదవ షెడ్యూల్‌ను ఉల్లంఘించిన వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే రాజ్యాంగ లక్ష్యానికి కట్టుబడి ఉండాలంటే, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో స్పీకర్ ముందు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలి. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల జీవితకాలం ఐదేళ్లు మాత్రమే. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుకోకుండా సరైన సమయంలో తీర్పు వెలువరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. మెజారిటీ ఉన్న పార్టీ తరఫు వ్యక్తి స్పీకర్ అవుతారని, అధికార పార్టీకి వ్యతిరేకంగా ఆయన నిర్ణయం తీసుకోకుండా పదవీకాలం ముగిసేవరకు పెండింగ్‌లో ఉంచడం సరికాదని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. కైశమ్ మేఘచంద్రసింగ్ వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్.. కేసులో స్పీకర్ రాజకీయ విధేయత కారణంగా పక్షపాత వైఖరిని సుప్రీంకోర్టు ప్రస్తావించింది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పుగా పేర్కొంది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని.. ఒక పార్టీ నుంచి ఎన్నికవుతున్న స్పీకర్ వద్ద ఉంచాలా.. వద్దా.. అనేది పార్లమెంట్ పునరాలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు సూచించింది'అని ఆర్యామ సుందరం వివరించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను హైకోర్టుకు నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేశారు.

సుప్రీంకోర్టు తీర్పుతో రిజర్వేషన్లకు భంగం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



సాక్షి, హైదరాబాద్/పాల్వంచ: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు భంగం కలిగించడమే కాక ఆర్టికల్ 341కు విరుద్ధంగా, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. దళితులు, గిరిజనులకు అమలు చేస్తున్న రిజర్వేషన్లలో రాజకీయ ప్రమేయాన్ని జోడించే విధంగా తీర్పు ఉందని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచలోని కేటీపీఎస్ గెస్ట్ హౌజ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. న్యాయనిపుణులతో చర్చించిన అనంతరం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. అంతేకాక ఈనెల 8, 9, 10వ తేదీల్లో ఢిల్లీలో నిరసన తెలపనున్నట్లు చెప్పారు. అలాగే, మాల మహానాడు ఆధ్వర్యంలో దేశంలో వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలు, సంఘాలను ఏకీకృతం చేసి పోరాడతామని వెల్లడించారు. మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రిజర్వేషన్లలో వర్గీకరణ మళ్లీ సూక్ష్మ వర్గీకరణకు దారి తీస్తుందని, తద్వారా రిజర్వేషన్లకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీం తీర్పుపై న్యాయపోరాటం'

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయపోరాటానికి సిద్ధమని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. ఇది దళితులను విచ్ఛిన్నం చేసి రాజ్యాంగానికి దూరం చేసే కుట్ర అని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. దీనిపై ఎవరూ ఉద్రేకాలు, ఉద్వేగాలకు లోనుకావొద్దని, సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని మాల సంఘాలు ఏకమయ్యే సందర్భం వచ్చిందని పేర్కొన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో ఢిల్లీలో సామాజిక చైతన్య దీక్షలను యథాతథంగా నిర్వహిస్తామని సుధాకర్ స్పష్టం చేశారు.

1 ఒకే ఒలింపిక్స్ ఒకే క్రీడాంశంలో భారత్‌కు మూడు పతకాలు రావడం ఇదే తొలిసారి. గతంలో రెజ్లింగ్‌లో రెండుసార్లు రెండు పతకాల చొప్పున రాగా... షూటింగ్‌లో ఒకసారి, అథ్లెటిక్స్‌లో ఒకసారి రెండేసి పతకాలు లభించాయి. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో బ్రిటిష్ ఇండియా అథ్లెట్ నార్మన్ ప్రిచర్డ్ 200 మీటర్లు, 200 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకాలు గెలిచాడు. 2012 లండన్ ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో సుశీల్ కుమార్ రజతం, యోగేశ్వర్ దత్ కాంస్యం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్ షూటింగ్‌లో విజయ్ కుమార్ రజతం, గగన్ నారంగ్ కాంస్యం సొంతం చేసుకున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో రవి కుమార్ దహియా రజతం, బజరంగ్ పూనియా కాంస్యం సాధించారు.

“ ఈవెంట్‌కు ముందు గుండెవేగం పెరిగింది. దేవుడిని ప్రార్థిస్తూ నన్ను నేను నియంత్రించుకోవడానికి ప్రయత్నించాను. కొత్తగా ఏమీ ప్రయత్నించకుండా నాకు తెలిసిన ఆటనే ప్రదర్శించాను. పోటీ జరుగుతున్న సమయంలో స్కోరుబోర్డు వైపు అస్సలు చూడలేదు. ఇన్నేళ్ల నా కష్టం మాత్రం గుర్తుకొచ్చింది. తల్లిలాంటి కోచ్ దీపాలీతో పాటు ఇతర సహాయక సిబ్బంది నన్ను మానసికంగా దృఢంగా ఉంచారు. ఒత్తిడిని తట్టుకుంటూ ప్రశాంతంగా ఉండటం నా ఆటలో కీలకం. ఈ విషయంలో నేను ఎమ్మెస్ ధోనిని అభిమానిస్తాను. కాంస్యం గెలవడం సంతృప్తినిచ్చింది. అయితే నాకు నేను ఒక మాట (స్వర్ణం గెలవడం కావచ్చు) ఇచ్చుకున్నాను. అది మాత్రం ఇంకా పూర్తి కాలేదని అనుకుంటున్నా. -స్వప్నిల్ కుసాలే

స్వప్నం సాకారం



50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన స్వప్నిల్ కుసాలే

ఈ ఘనత సాధించిన తొలి భారత షూటర్‌గా గుర్తింపు ● ఫైనల్లో 451.4 పాయింట్లతో మూడో స్థానం


గత రియో, టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లో మూగబోయిన భారత తుపాకీ 'పారిస్'లో మాత్రం గర్జిస్తోంది. తమపై పెట్టుకున్న అంచనాలను వమ్ముచేయకుండా షూటర్లు భారత్‌కు మూడో పతకాన్ని అందించారు. గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో స్వప్నిల్ కుసాలే కాంస్య పతకాన్ని సాధించాడు. క్వాలిఫయింగ్‌లో నిలకడగా లక్ష్యంపై గురి పెట్టి పాయింట్లు గెలిచిన స్వప్నిల్ పతకాన్ని ఖరారు చేసే ఫైనల్స్‌లోనూ దానిని కొనసాగించాడు. ఫలితంగా గతంలో ఏ క్రీడాంశంలోనూ నమోదుకాని అద్భుతాన్ని భారత షూటర్లు నిజం చేసి చూపించారు. ఒకే ఒలింపిక్స్‌లో ఒకే క్రీడాంశంలో భారత్‌కు మూడు పతకాలు రావడం ఇదే ప్రథమం. 'పారిస్'లో ఇప్పటికే రెండు కాంస్యాలు సాధించిన మనూ భాకర్ మరో ఈవెంట్‌లో పోటీపడనుండటంతో భారత్ ఖాతాలో నాలుగో పతకం చేరే అవకాశాలున్నాయి.

పారిస్: గతంలో భారత్ నుంచి ఒలింపిక్స్‌లో ఎవరూ ఫైనల్‌కు చేరని ఈవెంట్‌లో స్వప్నిల్ కుసాలే తొలిసారి ఫైనల్‌కు అర్హత సాధించాడు. తీవ్రమైన పోటీఉండే విశ్వ క్రీడల్లో క్వాలిఫయింగ్‌తో పోలిస్తే అసలు సిసలు సత్తా ఫైనల్లో చూపిస్తేనే పతకాలు ఖరారవుతాయి. తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతుండటంతో స్వప్నిల్ పతకం సాధిస్తాడని పెద్దగా అంచనాలు పెట్టుకోలేదు. కానీ తన నైపుణ్యంపై అపార నమ్మకమున్న స్వప్నిల్ అందరినీ ఆశ్చర్యపరిచే ప్రదర్శన చేశాడు. షూటింగ్‌లో ఎంతో క్లిష్టమైన ఈవెంట్‌గా పేరున్న 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో (నీలింగ్, ప్రోన్, స్టాండింగ్) స్వప్నిల్ తొలి ప్రయత్నంలోనే ఒలింపిక్ పతకాన్ని గెలిచి తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు. గురువారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో 28 ఏళ్ల స్వప్నిల్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్ 451.4 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్టేజ్-1లో త్రీ పొజిషన్స్‌లో భాగంగా నీలింగ్ స్టేజ్ ముగిశాక స్వప్నిల్ 153.3 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత ప్రోన్ స్టేజ్ పూర్తయ్యాక స్వప్నిల్ 310.1 పాయింట్లతో ఐదో స్థానానికి చేరుకున్నాడు. ఎలిమినేషన్‌ను నిర్ణయించే చివరి స్టేజ్ స్టాండింగ్‌లో స్వప్నిల్ నిలకడగా పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. 2012 నుంచి అంతర్జాతీయస్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న స్వప్నిల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలిసారే పతకాన్ని గెలిచి తన కెరీర్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు. లియు యుకున్ (చైనా; 463.6 పాయింట్లు) స్వర్ణం, సెర్హీ కులిష్ (ఉక్రెయిన్; 461.3 పాయింట్లు) రజతం సాధించారు.

సిఫ్ట్ కౌర్, అంజుమ్ విఫలం

మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో ప్రపంచ రికార్డు తనే పేరిట లిఖించుకున్న భారత యువ షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా, సీనియర్ షూటర్ అంజుమ్ మౌద్గిల్ ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. 32 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో సిఫ్ట్ కౌర్ 575 పాయింట్లు స్కోరు చేసి 31వ స్థానంలో నిలువగా... అంజుమ్ 584 పాయింట్లు సాధించి 18వ స్థానాన్ని దక్కించుకుంది. కేవలం టాప్-8లో నిలిచిన షూటర్లే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

'ఒక్కడే' గెలిచి చూపించాడు!



కాంస్య పతకంతో స్వప్నిల్ కుసాలే



వెన్నెముకపై మహా మృత్యుంజయ మంత్రంతో స్వప్నిల్

ఈతరం కుర్రాళ్లు, స్టార్ ఆటగాళ్లు ఒంటిపై టాటూస్ ముద్రించుకుంటే వాటిపై ఏం రాసి ఉంటుంది? తమకు ఆత్మీయులైన వారి పేర్లు గానీ ఆసక్తికర పంచింగ్ లైన్‌లు గానీ ఎక్కువగా కనిపిస్తాయి. ఎక్కడో ఒక చోట దేవుడి బొమ్మలు కూడా ఉంటాయి. స్వప్నిల్ కుసాలే తన వెన్నెముక భాగం మొత్తం 'మహా మృత్యుంజయ మంత్రం' టాటూగా ముద్రించుకున్నాడు. మానసికంగా తనకు కావాల్సిన బలాన్ని, కష్టాల్లో ఉన్నప్పుడు కూడా చలించని దృఢత్వాన్ని ఆ రుగ్వేద మంత్రం తనకు ఇస్తుందని అతను బలంగా నమ్ముతాడు. అందుకే కావచ్చు సుదీర్ఘకాలం పాటు షూటింగ్ సర్క్యూట్‌లో ఉంటూ గొప్ప ఫలితాలు రాకపోయినా అతను ఎప్పుడూ స్థైర్యాన్ని కోల్పోలేదు. నిజంగా కూడా కుసాలే కెరీర్‌ను చూస్తే చాలా ఆలస్యంగా గుర్తింపు వచ్చినట్లుగా కనిపిస్తుంది. 14 ఏళ్ల వయసులో షూటింగ్‌ను కెరీర్‌ను ఎంచుకున్న స్వప్నిల్ మూడేళ్ల తర్వాత తన తొలి అంతర్జాతీయ పోటీలో బరిలోకి దిగాడు. కానీ అతను తొలి ఒలింపిక్స్ ఆడేందుకు 12 సంవత్సరాలు పట్టింది. 2016 రియో ఒలింపిక్స్ సమయంలో అతని పేరు కనీసం పరిశీలనలో కూడా లేకపోగా... 2020 టోక్యో ఒలింపిక్స్‌కు కొన్నాళ్ల ముందు చెప్పుకోదగ్గ ప్రదర్శన లేకపోవడంతో టీమ్‌లోకి ఎంపిక చేయలేదు. అయితే స్వప్నిల్ సుదీర్ఘ కాలం పాటు తన ఆటనే నమ్ముకున్నాడు. అవకాశం వచ్చిన ప్రతీసారి విజయాన్ని అందుకుంటూ తనేంటో నిరూపించుకుంటూనే వచ్చాడు. ఎట్టకేలకు ఈసారి 28 ఏళ్ల వయసులో అతను మొదటిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగడమే కాకుండా కాంస్యంతో చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు.

అవరోధాలను దాటి...

మహారాష్ట్రలోని కొల్హాపూర్ సమీపంలోని కంబల్‌వాడి స్వప్నిల్ స్వస్థలం. తండ్రి సురేశ్ కుసాలే పాఠశాలలో ఉపాధ్యాయుడు. తల్లి అనిత ప్రస్తుతం సర్పంచ్‌గా పని చేస్తోంది. షూటింగ్ సర్క్యూట్‌లో ఉన్న చాలా మందితో పోలిస్తే స్వప్నిల్ నేపథ్యం సామాన్యమైనదే. తండ్రికి ఆటలపై ఆసక్తి ఉండటంతో కొడుకు స్కూల్‌లో ఉండగానే మహారాష్ట్ర ప్రభుత్వ పథకం 'క్రీడా ప్రబోధిని'లో చేర్పించాడు. నిబంధనల ప్రకారం వారంతా ఒకే తరహాలో ఫిట్‌నెస్ శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏదైనా క్రీడాంశం ఎంచుకునే అవకాశం ఇస్తారు. అందులో స్వప్నిల్ షూటింగ్‌ను ఎంచుకున్నాడు. నాసిక్‌లోని భోన్సాలా మిలిటరీ స్కూల్‌లో ఉన్న షూటింగ్ రేంజ్‌లో ఓనమాలు నేర్చుకున్న స్వప్నిల్ ఆ తర్వాత మరింత రాటుదేలాడు. అయితే సహజంగానే ఖర్చుతో కూడుతున్న క్రీడ కావడంతో వేర్వేరు దశల్లో ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. తండ్రి బ్యాంకులో అప్పు చేసి మరీ సొంత రైఫిల్ కొనివ్వాల్సి వచ్చింది. దీంతో పాటు ప్రాక్టీస్‌లో వాడే బుల్లెట్‌లు కూడా చాలా ఖరీదైనవి కావడం వల్ల చాలా జాగ్రత్తగా వాడుకుంటూ సాధన చేయాల్సి వచ్చేది.

గగన్ నారంగ్‌ను ఓడించి...

18 ఏళ్ల వయసులో స్వప్నిల్ ప్రతిభను 'లక్ష్య స్పోర్ట్స్' సంస్థ గుర్తించింది. వారి ఆర్థిక సహాయంతో పరిస్థితి మెరుగైంది. ఈ క్రమంలో భారత జాతీయ క్యాంప్‌లో అవకాశం దక్కింది. ఆ తర్వాత జాతీయ స్థాయిలో చూపించిన ప్రదర్శనకుగాను భారత రైల్వేలో టికెట్ కలెక్టర్ ఉద్యోగం లభించడంతో పరిస్థితి మరింత మెరుగైంది. 2015లో ఆసియా జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ 3లో కేటగిరీలో స్వర్ణం గెలుచుకోవడంతో తొలిసారి అతనికి గుర్తింపు దక్కింది. రెండేళ్ల తర్వాత జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో స్వప్నిల్ తన ఆటతో అందరి దృష్టిలో పడ్డాడు. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో తన ఆరాధ్య షూటర్, 2012 లండన్ ఒలింపిక్స్ కాంస్యపతక విజేత గగన్ నారంగ్, మరో సీనియర్ చయన్ సింగ్‌లను దాటి స్వర్ణం గెలుచుకున్న స్వప్నిల్ సంచలనం సృష్టించాడు. అతని ఎదుగుదలలో కోచ్‌గా భారత మాజీ షూటర్ దీపాలీ దేశ్‌పాండే కీలకపాత్ర పోషించింది.

సందేహాలను పటాపంచలు చేస్తూ...

చాలా కాలం క్రితమే 2022 అక్టోబరులోనే కైరోలో జరిగిన వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలవడంతో స్వప్నిల్ పారిస్ ఒలింపిక్స్‌లో 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ కేటగిరీలో భారత్‌కు కోటా ఖాయం చేశాడు. కొన్నాళ్ల క్రితం నిర్వహించిన ట్రయల్స్‌లో కూడా రాణించడంతో ఈ విభాగంలో భారత్ తరఫున పోటీ పడేందుకు అతనికే అవకాశం దక్కింది. అయినా సరే... స్వప్నిల్ పతకం సాధించడంపై పెద్దగా ఆశలు లేవు. దానికి కారణం ఉంది. ఈ ఒలింపిక్స్‌కు ముందు అతను వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, వరల్డ్ కప్‌లో స్వర్ణం, ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచాడు. ఇవన్నీ కూడా టీమ్ ఈవెంట్లలో గెలిచిన పతకాలే! వ్యక్తిగత విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో అతను చెప్పుకోదగ్గ ప్రదర్శన ఏదీ నమోదు చేయలేదు. దాంతో గెలుపుపై సందేహాలు. కానీ స్వప్నిల్ తన పట్టుదలతో వాటన్నింటినీ పటాపంచలు చేశాడు. అంచనాలను తలకిందులు చేస్తూ అనూహ్య ఆటతో ఒలింపిక్స్ పతకాన్ని సాధించి సగర్వంగా నిలిచాడు. - సాక్షి క్రీడా విభాగం

“ కాంస్యం గెలిచిన స్వప్నిల్ కుసాలేకు హృదయపూర్వక అభినందనలు. షూటింగ్‌లో ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలు గెలిచి షూటర్లు భారత్ గర్వపడేలా చేశారు. స్వప్నిల్ మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలి.
-ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

స్వప్నిల్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అతనికి శుభాకాంక్షలు. పోటీలో చక్కటి ఆటతో పాటు ఎంతో పట్టుదల కనబర్చిన అతను ప్రతీ భారతీయుడిని సంతోషంలో ముంచెత్తాడు.
-నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

ఈ విభాగంలో భారత షూటర్లెవరూ ఎందుకు పతకం సాధించడం లేదని ఆశ్చర్యపోయేవాడిని. ఇప్పుడు స్వప్నిల్ దానిని చేసి చూపించాడు. అతడిపై అంచనాలు లేకపోయినా బాగా ఆడగలడని నేను నమ్మేవాడిని. ఈ కాంస్యం బంగారం కంటే విలువైంది. -గగన్ నారంగ్

ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం అందించిన స్వప్నిల్ కుసాలేకు అభినందనలు. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో పతకం గెలిచిన తొలి భారతీయుడిగా స్వప్నిల్ దేశవాసులందరూ గర్వపడేలాచేశాడు.
-వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం

స్వప్నిల్‌కు ప్రమోషన్

ముంబై: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత షూటర్ స్వప్నిల్ కుసాలేకు రైల్వే శాఖ పదోన్నతి కల్పించింది. సెంట్రల్ రైల్వేలోని పుణె డివిజన్‌లో 2015లో కమర్షియల్-కమ్-టికెట్ క్లర్క్‌గా చేరిన కుసాలే ప్రస్తుతం ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ)గా పనిచేస్తున్నారు. ఒలింపిక్ పతక విజేతకు ప్రోత్సాహకంగా అతన్ని టీటీఈ నుంచి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమిస్తూ ప్రమోషన్ ఆర్డర్‌ను జారీ చేసినట్లు సెంట్రల్ రైల్వే తెలిపింది. ఇకపై కుసాలే ముంబైలోని స్పోర్ట్స్ సెల్‌కు ఓఎస్‌డీగా వ్యవహరిస్తాడు. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం స్వప్నిల్‌కు రూ. 1 కోటి నజరానా ప్రకటించింది.

'మగ' బాక్సర్ చేతిలో మహిళ ఓటమి!



ఒలింపిక్స్‌లో కొత్త వివాదం మొదలు

ఇటలీకి చెందిన ఏంజెలా కెరీనీ ఎన్నో ఆశలతో ఒలింపిక్స్ బాక్సింగ్ రింగ్‌లోకి అడుగు పెట్టింది. టోక్యో ఒలింపిక్స్‌లో విఫలమైన ఆమె ఈసారి తండ్రికిచ్చిన మాట కోసం మళ్లీ పతకం కోసం పోరాడేందుకు తీవ్ర సాధన చేసింది. 66 కేజీల విభాగంలో ఆమె బరిలోకి దిగగా... ప్రత్యర్థిగా అల్జీరియాకు చెందిన ఇమాన్ ఖలీఫ్ నిలబడింది. అయితే 46 సెకన్లలోనే ఏంజెలా ఆట నుంచి తప్పుకుంది. ప్రత్యర్థి కొట్టిన తీవ్రమైన పంచ్‌లను ఆమె తట్టుకోలేకపోయింది. ఇలాంటి బాక్సింగ్ తన జీవితంలో చూడలేదంటూ భోరున ఏడ్చేసింది. ఖలీఫ్ పంచ్‌లలో ఒక మగాడి తరహాలో తీవ్రత ఉండటమే అందుకు కారణం! ఖలీఫ్ పురుష లక్షణాలు ఉన్న 'బయోలాజికల్ మ్యాన్' కావడమే సమస్య. తాను మహిళగా చెప్పుకుంటున్నా... మగాళ్లలో ఉండే xy క్రోమోజోమ్‌లు ఆమెలో కనిపించాయి. గత ఏడాది ఢిల్లీలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పరీక్షల తర్వాత ఆమెపై నిషేధం కూడా విధించారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఖలీఫ్‌కు మళ్లీ మహిళల విభాగంలో ఒలింపిక్స్‌లో పోటీ పడే అవకాశాన్ని కల్పించారు. తొలి పోరుకు ముందే ఇది అన్యాయమని, ఆడ బాక్సర్‌పై మగాడిని పోటీలో నిలపడం ప్రమాదకరం అంటూ అన్ని వైపుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చివరకు అదే నిజమైంది. ఖలీఫ్ పంచ్‌ల దెబ్బకు ఏంజెలా కన్నీళ్ల పర్యంతమైన తీరు అందరినీ కదిలించింది. ఖలీఫ్ తరహాలో లక్షణాలే ఉన్న లిన్ యు టింగ్ (తైపీ) 57 కేజీల కేటగిరీలో బరిలోకి దిగుతోంది. అప్పుడు ఏం జరుగుతుందో చూడాలి.

కంటిచూపుతో...



టీ షర్ట్‌తో క్యాజువల్ లుక్... ఎడమ చేయి ప్యాంట్ జేబులో... లక్ష్యాన్ని స్పష్టంగా చూసేందుకు ఎలాంటి ప్రత్యేకమైన లెన్స్‌లు లేవు, ఐ కవర్ లేదు, పక్కనుంచి వచ్చే కాంతి నుంచి తప్పించుకునేందుకు వైజర్ పెట్టుకోలేదు, ఇయర్ ప్రొటెక్షన్ లేదు. లక్ష్యంపై గురి...ట్రిగ్గర్‌పై వేలు... నొక్కితే దేశానికి రజత పతకం వచ్చేసింది! టర్కీ షూటర్ యూసుఫ్ డికెక్ ఒక్కసారిగా పారిస్ ఒలింపిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాడు. సాధారణంగా షూటర్లు పోటీలో దిగినప్పుడు తమతో పాటు ధరించే సరంజామా ఏదీ అతను వాడలేదు. ఏదో అలా వ్యాహ్యాళికి వెళుతూ బొమ్మ తుపాకీతో సంతలో బెలూన్లను కొట్టినంత అలవోకగా అతను బుల్లెట్‌లను దించేయడం విశేషం. టర్కీ ఆర్మీలో సైనికుడైన 51 ఏళ్ల యూసుఫ్ హాలీవుడ్ సినిమాల స్టయిల్‌ను గుర్తుకు తెచ్చేలా షూటింగ్ చేశాడంటూ కామెంట్లు రావడం విశేషం. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్లో తర్హాన్‌తో కలిసి యూసుఫ్ రజతం సాధించాడు. షూటింగ్‌లో టర్కీకి ఇదే తొలి మెడల్.

భారత్‌కు 'బ్యాడ్'మింటన్

- రెండు పతకావకాశాలకు తెర
- నిష్క్రమించిన సింధు, సాత్విక్ -చిరాగ్ జోడీ
- క్వార్టర్స్ చేరి ఆశలు నిలిపిన లక్ష్య సేన్



సింధు

పారిస్ ఒలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో గురువారం భారత్‌కు కలిసి రాలేదు. కచ్చితంగా పతకాలు సాధిస్తారనుకున్న పీవీ సింధు... సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ ఓటమి చవిచూసి రిక్తహస్తాలతో రానున్నారు. పురుషుల సింగిల్స్‌లో సహచరుడు ప్రణయ్‌ను ఓడించి లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరి భారత్ ఆశలను నిలబెట్టాడు.

పారిస్: 'రియో'లో రజత పతకం. 'టోక్యో'లో కాంస్యం... 'పారిస్'లో మాత్రం నిరాశ... గత రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి వరుసగా మూడో ఒలింపిక్ పతకం లక్ష్యంగా 'పారిస్'కు వచ్చిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ప్రస్థానం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు 19-21, 14-21తో ప్రపంచ 9వ ర్యాంకర్ హి బింగ్‌జియావో (చైనా) చేతిలో ఓడిపోయింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో హి బింగ్‌జియావోను ఓడించి కాంస్య పతకాన్ని గెల్చుకున్న సింధు ఈసారి అలాంటి ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయింది.

పోరాడినా...

పురుషుల డబుల్స్‌లో ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ కూడా ముందంజ వేయలేకపోయింది. స్వర్ణ పతకంతో తిరిగి వస్తారనుకున్న సాత్విక్-చిరాగ్ ద్వయం క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ప్రపంచ మూడో ర్యాంక్ జోడీ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంక్ ద్వయం సాత్విక్-చిరాగ్ 21-13, 14-21, 16-21తో పరాజయం పాలైంది. ఆరోన్ చియా-సో వుయ్ యిక్‌లతో తలపడిన గత మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన సాత్విక్-చిరాగ్ ఈసారి పోరాడినా విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ రెండు టైటిల్స్ గెలిచి, నాలుగు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచారు. అంతేకాకుండా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను కూడా అందుకున్నారు. కానీ వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకం గెలవలేకపోయారు.

ప్రణయ్ అవుట్

సింధు, సాత్విక్-చిరాగ్ నిష్క్రమించడంతో భారత పతక ఆశలన్నీ లక్ష్య సేన్‌పై ఉన్నాయి. భారత నంబర్‌వన్, సహచరుడు హెచ్‌ఎస్ ప్రణయ్‌తో జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-12, 21-6తో అలవోకగా గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరాడు. పారుపల్లి కశ్యప్ (2012 లండన్), కిడాంబి శ్రీకాంత్ (2016 రియో) తర్వాత ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన మూడో భారత ప్లేయర్‌గా లక్ష్య సేన్ నిలిచాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్ తలపడతాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే లక్ష్య సేన్ సెమీఫైనల్ చేరి పతకం రేసులో ఉంటాడు.

నిఖత్ అవుట్

ప్రిక్వార్టర్స్‌లో చైనా బాక్సర్ చేతిలో ఓటమి



భారీ అంచనాల మధ్య పారిస్ ఒలింపిక్స్ బరిలోకి దిగిన భారత స్టార్, తెలంగాణ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు షాక్ తగిలింది. మహిళల 50 కేజీల ప్రిక్వార్టర్స్‌లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ 0-5తో ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత వూ యూ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా విజయాలు సాధిస్తున్న నిఖత్.. ఒలింపిక్స్‌లో అదే జోరు కనబర్చలేకపోయింది. పురుషుల 71 కేజీల విభాగంలో నిశాంత్ దేవ్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిశాంత్ 3-2తో రోడ్రిగ్జ్ (ఈక్వెడార్)పై నెగ్గాడు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	11	7	5	23
2	ఫ్రాన్స్	8	11	8	27
3	జపాన్	8	3	5	16
4	అమెరికా	7	14	13	34
5	ఆస్ట్రేలియా	7	6	4	17
6	బ్రిటన్	6	7	7	20
7	దక్షిణ కొరియా	6	3	3	12
44	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
2-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	126	81,868
నిఫ్టీ ▲	60	25,010

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,123	▽ 476
డోజోన్స్	40,210	▽ 633
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,283	▽ 85
డాక్స్	18,083	▽ 426
షాంఘై	2,932	▽ 6
నికాయ్	38,126	▽ 975

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	69,721	▲ 412
బంగారం (99.5 స్వచ్ఛత)	69,442	▲ 411
వెండి (కేజీ)	83,464	▲ 490

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.32	84.34
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.45	109.03
€	యూరో	ఎస్‌బీఐ	89.60	91.97
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.25	55.47
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.59	55.52
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.32	65.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.73	12.55

జీఎస్‌టీ వసూళ్లు @ 1.82 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: భారత్ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జూలైలో గత ఏడాది ఇదే కాలంతో పోల్చిచూస్తే, 10.3 శాతం పెరిగి రూ.1.82 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2017 జూలై 1వ తేదీన కొత్త పరోక్ష పన్ను వసూళ్ల వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఇవి మూడవ అతిపెద్ద భారీ వసూళ్లు. విభాగాల వారీగా చూస్తే మొత్తం వసూళ్లు రూ.1,82,075 కోట్లు. ఇందులో సెంట్రల్ జీఎస్‌టీ రూ.32,386 కోట్లు. స్టేట్ జీఎస్‌టీ రూ. 40,289 కోట్లు. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.96,447 కోట్లు. సెస్ రూ.12,953 కోట్లు. 2024 ఏప్రిల్‌లో 2.10 లక్షల కోట్లు రికార్డు జీఎస్‌టీ వసూలయ్యాయి. అంతక్రితం 2023 ఏప్రిల్‌లో వసూళ్లు రూ.1.87 లక్షల కోట్లు. ఆ రెండు నెలల తర్వాత ఈ స్థాయి వసూళ్లు ఇదే తొలి సారి కావడం గమనార్హం.

పీఎన్‌బీ రుణ రేటు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రుణ రేటు అన్ని కాలపరిమితులపై స్వల్పంగా 5 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెరిగింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్‌ఆర్) రుణ రేటు 0.05 శాతం పెరగడంతో దీనికి అనుసంధానమైన అన్ని కాల పరిమితుల రుణరేట్లు పెరగనున్నాయి. మారిన రేట్లు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఆటో, వ్యక్తిగత రుణాలుసహా దాదాపు కన్జూమర్ లోన్లు అన్నింటికి అనుసంధానమయ్యే ఏడాది కాలపరిమితి ఎంసీఎల్‌ఆర్ రుణరేటు 8.85 శాతం నుంచి 8.90 శాతానికి ఎగసింది.

జూలైలో 'తయారీ' నెమ్మది




న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం జూలైలో నెమ్మదించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూన్‌లో 58.3 వద్ద ఉంటే, జూలైలో 58.1 వద్దకు తగ్గింది. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి తగ్గడం దీనికి కారణం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
అదానీ ఎంటర్‌ప్రైజెస్ హైజంప్
ట్రావెల్ ఆపరేటర్లకు అనుకూలం

నిఫ్టీ.. సిల్వర్ జూబ్లీ!

- ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త రికార్డులు
- సూచీలకు అయిదో రోజూ లాభాలు
- ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు సంకేతాల ప్రభావం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో గురువారం ఓ మరపురాని అద్భుతం చోటు చేసుకుంది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ ఎన్‌ఎస్‌ఈ తొలిసారి 25,000 పాయింట్ల శిఖరాన్ని అధిరోహించింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. సెప్టెంబర్‌లో వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలతో ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా సెన్సెక్స్ 126 పాయింట్లు పెరిగి 81,868 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 25 వేల స్థాయిపైన 25,011 వద్ద నిలిచింది. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 388 పాయింట్లు బలపడి 82,129 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు ఎగసి 25,078 వద్ద జీవితకాల గరిష్టాలు అందుకున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంతో మిడ్ సెషన్ నుంచి గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, యుటిలిటీ, టెక్ షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. దీంతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి స్వల్ప లాభాలతో ముగిశాయి. కాగా అమెరికా మార్కెట్లు భారీ నష్టాలతో ట్రేడవుతున్నాయి.





25,000 ప్రయాణం ఇలా..

➤ 1996, ఏప్రిల్ 22న 13 కంపెనీల లిస్టింగ్‌తో నిఫ్టీ సూచీ 1000 పాయింట్ల వద్ద ప్రయాణం ప్రారంభించింది. తొలినాళ్లలో దేశంలో తీవ్ర రాజకీయ అస్థిరత (1996-98), తర్వాత ఆసియా ఆర్థిక సంక్షోభం, డాట్‌కామ్ బబుల్, ప్రపంచ ఆర్థిక సంక్షోభం(2007) ప్రతికూల ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ తొలిసారి 5,000 పాయింట్లను చేరేందుకు 11 ఏళ్లు పట్టింది.

➤ సత్యం కుంభకోణం, యూరోపియన్ రుణ సంక్షోభం, ట్యాపర్ తంత్రం, జీఎస్‌టీ అమలు సవాళ్ల ఆటుపోట్లను ఎదుర్కొని 25 జూలై 2017న 10,000 మైలురాయిని చేరింది.

➤ ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం, కార్పొరేట్ పన్ను, కోవిడ్ మహమ్మారి సూచీని పట్టి కుదిపాయి. కరోనా తొలి వేవ్ సమయంలో 7,600కు పడిపోయిన నిఫ్టీ కేవలం 220 రోజుల్లోనే రెండింతలకు కోలుకోవడం విశేషం. ఈ క్రమంలో 5 ఫిబ్రవరి 2021న 15,000 స్థాయిని అందుకుంది.

➤ కరోనా వేళ పెంచిన వడ్డీరేట్లను తగ్గించేందుకు, పెరిగిన ద్రవ్యోల్బణ కట్టడికి ఆర్‌బీఐ, ఫెడ్ రిజర్వ్‌తో పలు దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల పెంపు ప్రారంభం ప్రక్రియ ప్రారంభించాయి. ఇదే సమయంలో ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధ భయాలు తెరపైకి వచ్చాయి. ఈ సవాళ్లను ధీటుగా ఎదుర్కొని గతేడాది (2023) సెప్టెంబర్ 11న 20,000 స్థాయికి చేరింది.

➤ ఇక 20,000 స్థాయి నుండి 25000 పాయింట్లు చేరేందుకు 220 ట్రేడింగ్ సెషన్ల సమయం తీసుకుంది. సూచీకి ఇదే అత్యంత వేగవంతమైన 5,000 పాయింట్ల లాభం.

టాటా మోటార్స్ లాభం జంప్

క్యూ1లో రూ. 5,556 కోట్లు; 74 శాతం అప్

న్యూఢిల్లీ: దేశీ వాహన దిగ్గజం టాటా మోటార్స్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2024-25, క్యూ1)లో బంపర్ ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 74 శాతం జంప్ చేసి రూ. 5,566 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ. 3,204 కోట్లుగా నమోదైంది. ముఖ్యంగా దేశీ వాహన వ్యాపారంతో పాటు జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్‌ఆర్) పటిష్టమైన పనితీరు ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,03,597 కోట్ల నుంచి రూ. 1,09,623 కోట్లకు వృద్ధి చెందింది. స్టాండెలోన్ ప్రాతిపదికన (దేశీ కార్యకలాపాలు) క్యూ1లో కంపెనీ రూ. 2,190 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది క్యూ1లో రూ. 64 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. స్టాండెలోన్ ఆదాయం రూ. 16,132 కోట్ల నుంచి రూ. 18,851 కోట్లకు పెరిగింది. ఇక జూన్ క్వార్టర్‌లో జేఎల్‌ఆర్ ఆదాయం కొత్త రికార్డులను తాకింది. 5 శాతం వృద్ధితో 7.3 బిలియన్ పౌండ్ల ఆదాయాన్ని ఆర్జించింది.



టాటా మోటార్స్ షేరు ధర 1 శాతం లాభపడి రూ.1,145 వద్ద ముగిసింది.

కంపెనీ విభజనకు బోర్డు ఓకే...

టాటా మోటార్స్‌ను రెండు వేర్వేరు లిస్టెడ్ కంపెనీలుగా విడగొట్టే ప్రతిపాదనను కంపెనీ బోర్డు ఆమోదించింది. దీని ప్రకారం, టాటా మోటార్స్ లిమిటెడ్ (టీఎంఎల్) నుంచి వాణిజ్య వాహన వ్యాపారాన్ని టాటా మోటార్స్ సీవీగా విభజిస్తారు. ప్రస్తుత పీవీ వ్యాపారం టీఎంఎల్‌లో విలీనం అవుతుంది. విభజన తర్వాత టీఎంఎల్‌సీవీ, టీఎంఎల్ పేర్ల మార్పుతో పాటు రెండు వేర్వేరు లిస్టెడ్ కంపెనీలుగా కొనసాగుతాయని కంపెనీ తెలిపింది. ఇది పూర్తయ్యేందుకు 12-15 నెలలు పట్టొచ్చని వెల్లడించింది.

వాహన అమ్మకాలకు బ్రేకులు



ముంబై: వినియోగదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో జూలైలో వాహన విక్రయాలు నెమ్మదించాయి. దిగ్గజ ఆటో కంపెనీలైన మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్స్, టాటా మోటార్స్, అమ్మకాలు తగ్గాయి.

కంపెనీ	జూలై 2024	జూలై 2023	(%ల్లో)
మారుతీ సుజుకీ	1,75,041	1,81,630	(-)4
హ్యుందాయ్ మోటార్స్	64,513	66,701	(-)3
టాటా మోటార్స్	71,996	80,633	(-)11
ఎంఅండ్ఎం	66,444	66,124	(+)0.5
హోండా కార్స్	4,624	4,864	(-)5
టయోటా కిర్లోస్కర్	31,656	21,911	(+)44
కియా మోటార్స్	20,507	20,002	(2)%
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,54,169	3,19,747	(+)11
టీవీఎస్ మోటార్స్	3,54,140	3,25,977	(+)9
రాయల్ ఎన్‌ఫీల్డ్	67,265	73,117	(-)8
హెచ్‌ఎంఎస్‌ఐ	4,83,100	338,310	(+)43%
వాణిజ్య వాహనాలు			
అశోక్ లేలాండ్	13,928	15,068	(-)8

ఐటీసీ లాభం ఫ్లస్

క్యూ1లో రూ. 5,177 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్రంగా తగ్గి రూ. 5,177 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 5,190 కోట్లు ఆర్జించింది. స్థూల ఆర్థిక పరిస్థితులు, నిర్వహణ వాతావరణం సవాళ్లు విసరడం ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం 7.5 శాతం పుంజుకుని రూ. 20,030 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 18,639 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఇతర ఆదాయంతో కలిపితే మొత్తం టర్నోవర్ 7 శాతం అధికంగా రూ. 20,724 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగి రూ. 13,791 కోట్లకు చేరాయి.

విభాగాలవారీగా..: ప్రస్తుత సమీక్షా కాలంలో ఐటీసీ మొత్తం ఎఫ్‌ఎంసీజీ విభాగం అమ్మకాలు 6 శాతం పుంజుకుని రూ. 14,341 కోట్లను తాకాయి. సిగరెట్ల బిజినెస్ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ. 8,842 కోట్లను దాటింది. హోటళ్ల విభాగం నుంచి 14 శాతం అధికంగా రూ. 713 కోట్ల ఆదాయం లభించింది.

ఐటీసీ షేరు 0.3 శాతం నీరసించి రూ. 494 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



జెంగ్ కిన్‌వెన్

నంబర్‌వన్ స్వియాటెక్‌కు షాక్

పారిస్ ఒలింపిక్స్ మహిళల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో కచ్చితంగా స్వర్ణ పతకం సాధిస్తుందనుకున్న ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌కు ఊహించని పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన సెమీఫైనల్లో జెంగ్ కిన్‌వెన్ (చైనా) 6-2, 7-5తో స్వియాటెక్ (పోలాండ్)ను కంగుతినిపించింది. యేటా ఫ్రెంచ్ ఓపెన్ జరిగే క్లే కోర్టులోనే విశ్వక్రీడలకు సంబంధించిన టెన్నిస్ పోటీలు జరుగుతున్నా... ఇక్కడ ఎదురులేని పోలాండ్ స్టార్ వరుస సెట్‌లలోనే పరాజయం చవిచూసింది. దీంతో ఒలింపిక్స్‌లో చైనాకు తొలి సింగిల్స్ పతకాన్ని జెంగ్ కిన్‌వెన్ ఖాయం చేసింది. గత ఐదేళ్లలో నాలుగు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన స్వియాటెక్ ఇప్పుడిక కాంస్యం కోసం ఆడుతుంది. పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్ సెమీఫైనల్ చేరుకున్నాడు. క్వార్టర్స్‌లో అల్‌కరాజ్ 6-3, 7-6 (7/5)తో టామీ పాల్ (అమెరికా)పై గెలుపొందాడు.





భారత హాకీ జట్టుకు తొలి ఓటమి

పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకున్న హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం గురువారం పూల్ 'బి' మ్యాచ్‌లో 1-2 గోల్స్ తేడాతో డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ బెల్జియం చేతిలో ఓడింది. ఆట 18వ నిమిషంలో అభిషేక్ తొలి గోల్ నమోదు చేసి టీమిండియాకు ఆధిక్యం అందించగా... మూడో క్వార్టర్‌నుంచి చెలరేగిన బెల్జియం రెండు గోల్స్ చేసి గెలిచింది. ఆ జట్టు తరఫున స్టాక్‌బ్రోక్స్ (33వ నిమిషంలో), జాన్ దోమెన్ (44వ ని.లో) చెరో గోల్ కొట్టారు. తొలి క్వార్టర్‌లో జోరు కనబర్చిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆ తర్వాత దాన్ని కొనసాగించడంలో విఫలమైంది. గత మ్యాచ్‌లతో పోలిస్తే బెల్జియంతో పోరులో భారత జట్టు రక్షణపంక్తి నిరాశ పర్చింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ప్రత్యర్థికి 11 పెనాల్టీ కార్నర్‌లు సమర్పించుకోగా... బెల్జియం కేవలం మూడు పెనాల్టీ కార్నర్‌లే ఇచ్చింది. గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ అద్వితీయ ప్రదర్శన కారణంగానే బెల్జియం రెండు గోల్స్‌తో సరిపెట్టుకుంది. అంతకుముందు న్యూజిలాండ్‌పై (3-2 గోల్స్ తేడాతో), ఐర్లాండ్‌పై (2-0 గోల్స్ తేడాతో) గెలిచిన టీమిండియా... అర్జెంటీనాతో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో నేడు ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది.

ఇక వన్డే సమరం

- నేడు భారత్, శ్రీలంక మధ్య తొలిపోరు
- మ్యాచ్‌కు వర్షం ముప్పు
- మరో క్లీన్‌స్వీప్‌పై రోహిత్ సేన దృష్టి
- కోహ్లి రాకతో మరింత పటిష్టం
- లంకకు కొత్తగా గాయాల బెడద
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



రోహిత్, కోహ్లి చేరడంతో...

కొలంబో: ఓ పరిమిత ఓవర్ల సమరాన్ని వైట్‌వాష్ చేసిన భారత జట్టు ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో మరో ఫార్మాట్‌నూ క్లీన్‌స్వీప్ చేసేందుకు సిద్ధమైంది. ఆతిథ్య శ్రీలంకతో శుక్రవారం నుంచి మూడు వన్డేల సిరీస్ ఆరంభమవుతోంది. పొట్టి ఫార్మాట్‌లో సూర్య కుమార్, కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ కాంబినేషన్ విజయవంతమైంది. ఇప్పుడు రోహిత్-గంభీర్‌ల వంతు వచ్చింది. తొలి మ్యాచ్‌లో శుభారంభం చేయడం ద్వారా సిరీస్‌పై పట్టుసాధించాలని టీమిండియా భావిస్తోంది. టి20 ప్రపంచకప్ విజయానంతరం రోహిత్, కోహ్లి ఆడుతున్న తొలి సిరీస్ ఇదే. వీరిద్దరి రాకతో పెరిగిన బ్యాటింగ్ బలం భారత జైత్రయాత్రకు కచ్చితంగా దోహదం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. మరోవైపు సొంతగడ్డపై మూడు టి20ల్లో ఓడిన శ్రీలంక జట్టు కనీసం వన్డే ఫార్మాట్ లోనైనా పుంజుకోవాలని ఆశిస్తోంది. మారిన ఫార్మాట్‌లో ఓటమి రాతను మార్చుకోవాలని గంపెడాశలతో బరిలోకి దిగుతోంది.

భారత టాప్‌స్టార్లు రోహిత్‌శర్మ, కోహ్లిలు లేని భారత జట్టు టి20 ఫార్మాట్‌లో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి పోరు అయితే హైలైట్! ఓటమి కోరల్లోంచి సూపర్ విజయం దాకా సూర్యకుమార్ సేన పోరాటం ఆకట్టుకుంది. అలాంటి జట్టుకు ఇప్పుడు రోహిత్, కోహ్లిలు కలవడంతో బ్యాటింగ్ దుర్భేద్యంగా మారింది. దీంతో 20 ఓవర్లకే ఆపసోపాలు పడిన లంక బౌలర్లకు వన్డేల్లో మరింత కష్టాలు తప్పవేమో! హార్దిక్, సూర్య వన్డే జట్టులో లేకపోవడంతో హిట్టర్లు దూబే, పరాగ్‌కు లక్కీ చాన్స్ కానుంది. మూడు వన్డేల్లో వీరిలో ఎవరికి ఎక్కువ అవకాశాలొస్తాయో చూడాలి. భారత్ ఇద్దరు స్పిన్నర్లు అక్షర్, కుల్దీప్‌లతో పాటు ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగాలనుకుంటే ఖలీల్ అహ్మద్ లేదంటే హర్షిత్ రాణాల్లో ఒకరు సిరాజ్, అర్ష్‌దీప్‌లతో బంతిని పంచుకుంటారు.

అయ్యో... కష్టాల లంక!

టి20 ఫార్మాట్‌లో చేతులెత్తేసిన శ్రీలంక ఇప్పుడు వన్డేల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గత సిరీస్ ఫలితాన్ని పక్కనబెట్టి కొత్త ఫార్మాట్‌ను తాజాగా ఆరంభించాలనుకుంటుంది. ఓపెనర్లు నిసాంక, కుశాల్ మెండీస్ ఫామ్‌లో ఉన్నప్పటికీ... తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌లో వచ్చేవారిలో కెప్టెన్ చరిత్ అసలంక సహా ఎవరికి నిలకడే లేదు. ఇదే లంక బ్యాటింగ్ దళానికి శాపంగా మారింది. ఇప్పుడున్న కష్టాలు చాలవన్నట్లు వన్డేలకు ముందు గాయాల బెడద లంకను పీడిస్తోంది. 50 ఓవర్ల మ్యాచ్‌లకు కీలకమైన పేసర్లు పతిరణ, మదుశంక గాయాల కారణంగా దూరమయ్యారు. ఆఖరి టి20లో క్యాచ్ కోసం డైవ్ చేసిన పతిరణ కుడి మోచేతికి గాయమైంది. ఫీల్డింగ్ ప్రాక్టీస్‌లో మదుశంక ఎడమకాలి తొడ కండరాలు పట్టేయడంతో ఇద్దరు మొత్తం వన్డే సిరీస్‌కే అందుబాటులో లేకుండా పోయారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌ను ఎదుర్కోవడమంటే ఏటికి ఎదురీదడమే తప్ప ఏమాత్రం సులువు కానేకాదు.




పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. భారీస్కోరు ఆశించొచ్చు. అలాగే స్పిన్నర్లకు తిప్పేసే చాన్స్ ఉంది. కానీ మ్యాచ్‌కు శుక్రవారం వానముప్పు ఉంది. రోజంతా భారీవర్షం కురిసే అవకాశముందని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, కేఎల్ రాహుల్/పంత్, దూబే/పరాగ్, కుల్దీప్, అక్షర్, సిరాజ్, అర్ష్‌దీప్, హర్షిత్. శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండీస్, సమరవిక్రమ, కమిందు, జనిత్, కురణరత్నే, హసరంగ, తీక్షణ, షిరాజ్/ఇషాన్ మలింగ, ఫెర్నాండో.

ప్రవీణ్ తొలి రౌండ్‌లోనే...




పారిస్ ఒలింపిక్స్ ఆర్చరీ పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత్ పోరాటం ముగిసింది. ఇప్పటికే తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్, సీనియర్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్ నాకౌట్ మ్యాచ్‌ల్లో పరాజయం పాలవగా... బరిలో మిగిలిన ఏకైక భారత ఆర్చర్ ప్రవీణ్ జాధవ్ కూడా ఇంటిదారి పట్టాడు. వ్యక్తిగత రికర్వ్ తొలి రౌండ్‌లో ప్రవీణ్ 0-6 (28-29, 29-30, 27-28)తో వెన్‌చావో (చైనా) చేతిలో ఓడాడు. ఇక మహిళల వ్యక్తిగత విభాగంలో దీపిక కుమారి, భజన్ కౌర్ శనివారం ప్రిక్వార్టర్స్ బరిలో దిగనున్నారు.

నడకలో నిరాశ



పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీల తొలి రోజు భారత్‌కు నిరాశ తప్పలేదు. 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో మన అథ్లెట్లు ఆకట్టుకోలేక పోయారు. మహిళల విభాగంలో ప్రియాంక గోస్వామి 1 గంటా 39 నిమిషాల 55 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 41వ స్థానంతో సరిపెట్టుకుంది. ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించి ఆశలు రేపిన ప్రియాంక... 'పారిస్' క్రీడల్లో అదే ప్రదర్శన కనబర్చలేకపోయింది. 28 ఏళ్ల ప్రియాంక తన అత్యుత్తమ ప్రదర్శన (1 గంట 28 నిమిషాల 45 సెకన్లు) కంటే 11 నిమిషాలు వెనుకబడింది. పురుషుల విభాగంలో వికాస్ సింగ్ 30వ స్థానంతో, పరమ్‌జీత్ సింగ్ 37వ స్థానంతో రేసును ముగించారు. మరో వాకర్ అక్షదీప్ అనారోగ్యం కారణంగా రేసు పూర్తి చేయలేకపోయాడు.

పోరాడి ఓడిన శ్రీజ



పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల సింగిల్స్‌లో సంచలన ప్రదర్శనతో ప్రిక్వార్టర్స్‌కు చేరిన భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ.. ప్రపంచ నంబర్‌వన్ చేతిలో పోరాడి ఓడింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ 10-12, 10-12, 8-11, 3-11తో సన్ యింగ్‌షా (చైనా) చేతిలో పరాజయం పాలైంది. తొలి రెండు గేమ్‌ల్లో మొదట ఆధిక్యం కనబర్చిన శ్రీజ.. చివరి వరకు దాన్ని కొనసాగించలేకపోయింది.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ
మిక్స్‌డ్ టీమ్ ఎలిమినేషన్ రౌండ్: భారత్ (బొమ్మదేవర ధీరజ్-అంకిత) X ఇండోనేసియా (ఆరిఫ్-దియానంద) (మధ్యాహ్నం గం. 1:19 నుంచి)

హాకీ
భారత్ X ఆస్ట్రేలియా (గ్రూప్ మ్యాచ్) (సాయంత్రం గం. 4:45 నుంచి)

జూడో
మహిళల ప్లస్ 78 కేజీల ఎలిమినేషన్ రౌండ్: తులికా మాన్ X ఓర్టిజ్ (క్యూబా) (మధ్యాహ్నం గం. 2:12 నుంచి)

అథ్లెటిక్స్
మహిళల 5000 మీటర్ల తొలి హీట్: అంకిత (రాత్రి గం. 9:40 నుంచి). మహిళల 5000 మీటర్ల రెండో హీట్: పారుల్ (రాత్రి గం. 10:06 నుంచి). పురుషుల షాట్‌పుట్ క్వాలిఫికేషన్ రౌండ్: తజిందర్(రాత్రి గం. 11:40 నుంచి)

సెయిలింగ్
మహిళల డింగీ రేసులు: నేత్ర (మధ్యాహ్నం గం. 3:45 నుంచి), పురుషుల డింగీ రేసులు: విష్ణు (రాత్రి గం. 7:05 నుంచి).

గోల్ఫ్
పురుషుల వ్యక్తిగత ఫైనల్స్ (రెండో రౌండ్): గగన్‌జీత్ భుల్లర్, శుభాంకర్ శర్మ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).

షూటింగ్
మహిళల 25 మీటర్ల పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్: ఇషా సింగ్, మనూ భాకర్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). పురుషుల స్కీట్ క్వాలిఫికేషన్: అనంత్‌జీత్ సింగ్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి).

బ్యాడ్మింటన్
పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్: లక్ష్యసేన్ X చో టిన్ చెన్ (చైనీస్ తైపీ) (సాయంత్రం గం. 6:30 నుంచి)

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కేసు పూర్వాపరాలివీ..

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఏపీ సమయంలో 1999లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) ఆర్డినెన్స్- 1999ను జారీ చేసింది. దానిని సవాల్ చేస్తూ ఈవీ చిన్నయ్య, మరికొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. అది విచారణలో ఉన్న సమయంలోనే ఆర్డినెన్స్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం-2000 చేసింది. ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించింది. గ్రూప్ ఏకు 1 శాతం, గ్రూప్ బీకి 7 శాతం, గ్రూప్ సీకి 6 శాతం, గ్రూప్ డీకి 1 శాతంగా రిజర్వేషన్‌ను విభజించింది. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈవీ చిన్నయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర శాసనసభకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని రూపొందించే అధికారం లేదని వాదించారు. ఇది ఆర్టికల్ 341 (2), ఆర్టికల్ 14లను ఉల్లంఘించడంతోపాటు రాష్ట్రపతి జాబితాతోనూ ముడిపడిందని వివరించారు. పార్లమెంట్ మాత్రమే రాష్ట్రపతి జాబితాలో మార్పులు చేయగలదని పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు.. రిజర్వేషన్ల వర్గీకరణ కుదరదంటూ 2004లో తీర్పు ఇచ్చింది.

పంజాబ్ కేసు విచారణతో మళ్లీ తెరపైకి..

1975లో పంజాబ్‌లో 25శాతంగా ఉన్న ఎస్సీ రిజర్వేషన్లను రెండు ఉప వర్గాలుగా విభజిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొదటి వర్గంలో ఆర్థికంగా, విద్యాపరంగా బాగా వెనుకబడిన వాల్మీకి, మజాబీ సిక్కులకు రిజర్వేషన్ ఇచ్చింది. ఆ నోటిఫికేషన్ మూడు దశాబ్దాలపాటు అమల్లో ఉంది. అయితే దీనిపై కేసులు నమోదవడంతో.. పంజాబ్-హరియాణా హైకోర్టు 2010లో ఈ నోటిఫికేషన్‌ను కొట్టివేసింది. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమంటూ 'ఈవీ చిన్నయ్య వర్సెస్ ఏపీ ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దీనికి ఆధారంగా తీసుకుంది. దీనిపై పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 'ఈవీ చిన్నయ్య' కేసు తీర్పును తప్పుపట్టింది. ఈ వ్యవహారంలో ముఖ్యమైన అంశాలను నాడు పరిగణనలోకి తీసుకోలేదని అభిప్రాయపడింది. తీర్పును పునర్విచారణ చేయాల్సిన అవసరం ఉందంటూ.. ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. రాజ్యాంగ ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విని.. తాజాగా తీర్పు వెలువరించింది.

'వర్గీకరణ'పై కేంద్ర కమిటీ పరిస్థితేమిటి?


రాజీవ గౌబా

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పరిష్కరించేందుకు లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో.. ఆ కమిటీ కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది. సుప్రీం తీర్పును సమగ్రంగా అధ్యయనం చేశాక.. కేంద్రం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ గౌబా నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో హోం, సామాజిక న్యాయం, గిరిజన వ్యవహారాలు, న్యాయ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ తెలంగాణ, ఏపీలతోపాటు కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వివిధ వర్గాల ప్రతినిధులతో భేటీ అయి.. అభిప్రాయాలు సేకరించింది. ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ వర్గీకరణకు మద్దతుగా మాట్లాడారు. ఇందుకు అనుగుణంగానే సుప్రీంకోర్టుకు కేంద్రం సమర్పించిన అఫిడవిట్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సమ్మతి తెలిపింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ క్రమంలో కమిటీని రద్దు చేస్తారా, కొనసాగిస్తారా అన్న సందేహాలు వెలువడుతున్నాయి. వర్గీకరణ అంశంలో రాష్ట్రాలకు సిఫార్సులు చేసే బాధ్యతను కమిటీకి అప్పగించే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్

చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సుప్రీం ధర్మాసనం

రాష్ట్రాలు రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయవచ్చు • తగిన మార్గదర్శకాలు రూపొందించుకోవచ్చని సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం పచ్చజెండా ఊపింది. అత్యంత వెనుకబడిన ఉప కులాలకు ఊతమిచ్చేందుకు వీలుగా రాష్ట్రాలు ఆయా రిజర్వేషన్లను వర్గీకరణ చేసుకోవచ్చని తెలిపింది. రాజ్యాంగంలోని 14వ, 341వ ఆర్టికల్‌లు ఈ ఉప కోటాకు అడ్డంకి ఏమీ కాదని తేల్చింది. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. దీనితో విద్య, ఉద్యోగాలలో అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను సబ్‌క్లాస్‌లుగా వర్గీకరించి.. ఆయా వర్గాల్లో అత్యంత వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు మార్గం సుగమం కానుంది.

25 ఏళ్లుగా నానుతున్న వర్గీకరణ!

దేశంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఆయా వర్గాల్లోని కొన్ని కులాల వారే పొందుతున్నారని.. అందువల్ల ఈ రిజర్వేషన్లను వర్గీకరించాలని చాలా కాలం నుంచి డిమాండ్లు ఉన్నాయి. దీనికి సంబంధించి 2000వ సంవత్సరంలో ఉమ్మడి ఏపీలో చేసిన రిజర్వేషన్ల చట్టం, దానిని కొట్టివేస్తూ 2004లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్ల చట్టాన్ని ఈ తీర్పు ఆధారంగా పంజాబ్-హరియాణా హైకోర్టు కొట్టివేయడం తదితర పరిణామాలతో ఈ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. తొలుత దీనిపై (పంజాబ్ వర్సెస్ దేవీందర్‌సింగ్ కేసు) విచారణ జరిపిన ఐదుగురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం.. పూర్తిస్థాయిలో పునర్విచారణ నిమిత్తం చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ఏడుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. ఈ ధర్మాసనం ''రాజ్యాంగం నిర్దేశించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయడం 14, 15, 16 ఆర్టికల్‌లకు భంగం కలిగిస్తుందా? షెడ్యూల్డ్ కులాలు/తెగలు సజాతీయమేనా (ఒకేవర్గం కింద పరిగణించవచ్చా?) లేక భిన్నమైన వర్గాల సమూహమా? ఆర్టికల్ 341కు ఇవి భిన్నమా? ఉప వర్గీకరణ పరిధిలో ఏమైనా పరిమితులు ఉన్నాయా?'' అన్న అంశాలను లోతుగా పరిశీలించింది. ఈ కేసుకు సంబంధించి అన్ని వర్గాల వాదనలు విని.. ఈ ఏడాది ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేసింది. తాజాగా గురువారం తీర్పు వెలువరించింది.

నెహ్రూ వ్యాఖ్యలను కోట్ చేస్తూ..

''మతపరంగా, కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కొనసాగితే భారతదేశం రెండో లేదా మూడో గ్రేడ్ దేశంగా మారుతుంది. ఈ మార్గం మూర్ఖత్వం మాత్రమే కాదు. విపత్తు కూడా. కానీ వెనుకబడిన వర్గాలకు అన్ని విధాలుగా సహాయం చేయాల్సి ఉంది..'' అన్న మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను ధర్మాసనం తమ తీర్పులో ఉటంకించింది. మన తొలితరాల వారు, న్యాయమూర్తులతోపాటు మాజీ ప్రధాని కూడా.. ఏ వర్గం లేదా కులానికి చెందినవారికి పూర్తిగా కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని వ్యతిరేకించారని.. మెరిట్ ప్రాతిపదికన దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరుకున్నారని పేర్కొంది. ఈ విధమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ వెనుకబడిన తరగతుల్లో కొంతమంది ముందుకుసాగడంలో ఇబ్బంది పడుతున్నారని.. వారికి చేయూతనివ్వడం ఎంతో అవసరమని తెలిపింది. ఈ నేపథ్యంలోనే రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు ధర్మాసనం అనుమతిస్తోందని వెల్లడించింది. ఈ మేరకు 565 పేజీల తీర్పు వెలువరించింది. ఈ తీర్పునకు అనుగుణంగా రాష్ట్రాలు తదుపరి మార్గదర్శకాలు రూపొందించుకోవచ్చని సూచించింది.

ఆరుగురు అనుకూలం.. ఒకరు వ్యతిరేకం

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఇందులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ ఉన్నారు. వీరిలో జస్టిస్ బేలా త్రివేదీ వర్గీకరణను విభేదించగా.. మిగతా ఆరుగురు న్యాయమూర్తులు సమర్థించారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా కలిపి ఒకే తీర్పు ఇవ్వగా, మిగతా జడ్జీలు వేర్వేరుగా తమ తీర్పులు ఇచ్చారు. దీనితో మొత్తం ఆరు తీర్పులు వెలువడ్డాయి. మెజారిటీ న్యాయమూర్తులు అనుకూలంగా ఉండటంతో.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు ధర్మాసనం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు అయింది.

కేంద్ర ఉద్యోగాలు, విద్యాసంస్థలకు 'వర్గీకరణ' వర్తించనట్లే!

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్రాల పరిధిలోని విద్యా సంస్థలు, ఉద్యోగాలు, పదోన్నతులకు మాత్రమే వర్తిస్తుందని న్యాయ నిపుణులు, ఎమ్మార్పీస్ నేతలు చెప్తున్నారు. సుప్రీం తీర్పు కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సంస్థల్లోని ఉద్యోగాలు, విద్యా సంస్థలపై ప్రభావం చూపదని అంటున్నారు. రాష్ట్రాలు చేసిన చట్టాలపైనే సుప్రీంకోర్టులో విచారణ జరిగిందని.. కోర్టు కూడా రాష్ట్రాలు ఉప వర్గీకరణ చేసుకోవచ్చనే దానిపైనే తాజా తీర్పు ఇచ్చిందని వివరిస్తున్నారు. ఇందులో జాతీయ స్థాయిలో, కేంద్ర సంస్థల్లో రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించిన అంశమేదీ లేదని స్పష్టం చేస్తున్నారు. అంతేగాకుండా రాష్ట్రాల వారీగా ఎస్సీ, ఎస్టీ వర్గాలు, కులాలు, తెగలు విభిన్నంగా ఉంటాయని.. వాటిని కేంద్ర స్థాయిలో వర్గీకరించడం సాధ్యమయ్యే పనికాదని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఎస్సీల్లోని మాదిగ వర్గం కేంద్ర సంస్థల్లో రిజర్వేషన్ల వర్గీకరణ గురించి ఇప్పటివరకు ఎలాంటి డిమాండ్ చేయలేదని, దేశవ్యాప్తంగా ఎలాంటి ఉద్యమం జరగలేదని తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీస్ అధ్యక్షుడు నరేశ్ చెప్పారు. కేంద్ర ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో వర్గీకరణపై ఇప్పటివరకు తాము దృష్టి పెట్టలేదన్నారు.

వెనుకబాటు ఆధారంగా ఉప వర్గీకరణ

''షెడ్యూల్డ్ కులాలు సజాతీయ తరగతి (ఒకే వర్గానికి చెందిన సమూహం) కాదని సూచించే చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కింద పొందుపరిచిన సమానత్వ సూత్రాన్ని గానీ.. ఆర్టికల్ 341(2)ను గానీ ఉల్లంఘించదు. ఆర్టికల్ 15, ఆర్టికల్ 16లలో కూడా రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయకుండా రాష్ట్రాలను నిరోధించేది ఏమీ లేదు. ఉప వర్గీకరణ అయినా, మరేదైనా నిశ్చయాత్మక చర్య అయినా.. వాటి లక్ష్యం వెనుకబడిన తరగతులకు సమాన అవకాశాలు కల్పించడమే. కొన్ని కులాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉప వర్గీకరణ చేయవచ్చు. అయితే ఏదైనా కులం /ఉప వర్గానికి ప్రాతినిధ్యం అందకపోవడానికి దాని వెనుకబాటుతనమే కారణమని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించుకోవాలి. ఆ కులం/ ఉప వర్గానికి ప్రాతినిధ్యం అందకపోవడంపై డేటాను సేకరించాలి. అందుకు అనుగుణంగా ఉప వర్గీకరణ చేయాలి..''

– జస్టిస్ డీవై చంద్రచూడ్,
జస్టిస్ మనోజ్ మిశ్రా

ఉప వర్గీకరణకు అనుకూలం

షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణకు అనుమతి వీలుకాదన్న 'ఈవీ చిన్నయ్య' కేసులోని తీర్పు సరికాదన్న చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయిల అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తున్నాను. క్రీమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయడం మరింత సమానత్వానికి తోడ్పడుతుంది.

– జస్టిస్ విక్రమ్‌నాథ్

తగిన డేటా సేకరించి అమలు చేయాలి

రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు రాజ్యాంగ చెల్లుబాటు ఉందన్న చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయిల అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాను. రాష్ట్రాలు తగిన డాటా సేకరించి ఉప వర్గీకరణ అవసరాన్ని నిర్ధారించాలి. ఇందు లో క్రీమీలేయర్ గుర్తింపునకు కూడా ఆవశ్యకత ఉండాలి.

– జస్టిస్ సతీశ్‌చంద్ర

రిజర్వేషన్లు ఒక తరానికే పరిమితం చేయాలి

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను సమర్థిస్తున్నాను. అయితే ఏ రిజర్వేషన్లు అయినా మొదటి తరానికి లేదా ఒక తరానికి మాత్రమే వర్తింపజేయాలి. కుటుంబంలోని ఏదైనా తరం రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితిని సాధిస్తే.. రిజర్వేషన్ల ప్రయోజనం లాజికల్‌గా రెండో తరానికి అందుబాటులో ఉండరాదు. రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకుని సాధారణ వర్గంతో కలసిన కుటుంబాలను.. తర్వాత రిజర్వేషన్లు పొందకుండా మినహాయించడానికి కాలానుగుణ కసరత్తు చేపట్టాలి.

– జస్టిస్ పంకజ్ మిత్తల్

క్రీమీలేయర్ వర్తింపజేయాలి

వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం రాష్ట్రాల విధి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో కొద్ది మంది మాత్రమే రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి వాస్తవాలను తిరస్కరించలేం. శతాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న కులాలు ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఉన్నాయి. అయితే ఉప వర్గీకరణ సమయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని క్రీమీలేయర్ (అధికాదాయం ఉన్నవారిని) గుర్తించాలి. నిజమైన సమానత్వం సాధించాలంటే ఇదొక్కటే మార్గం. ఇందుకోసం రాష్ట్రాలు ఒక విధానాన్ని రూపొందించాలి. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల క్రీమీలేయర్ మినహాయింపు ప్రమాణాలు ఇతర వెనుకబడిన కేటగిరీలకు వర్తించే ప్రమాణాలకు భిన్నంగా ఉండవచ్చు. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఏపీ ప్రభుత్వం కేసులో ప్రాథమిక లోపం ఏమిటంటే.. ఆర్టికల్ 341 రిజర్వేషన్లకు ప్రాతిపదిక అని అర్థం చేసుకొని ముందుకు వెళ్లడమే! ఆర్టికల్ 341 అనేది రిజర్వేషన్ల ప్రయోజనాల నిమిత్తం కులాల గుర్తింపు కోసం మాత్రమే.

– జస్టిస్ బీఆర్ గవాయి

రాష్ట్రాలకు ఉప వర్గీకరణ అర్హత లేదు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ అర్హత రాష్ట్రాలకు లేదు. షెడ్యూల్డ్ కులాల పరిణామ చరిత్ర, నేపథ్యానికి తోడు రాజ్యాంగంలోని 341 కింద ప్రచురించిన రాష్ట్రపతి ఉత్తర్వులు కలసి షెడ్యూల్డ్ కులాలు ఒక సజాతీయ తరగతిగా మారాయి. దీని ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, జాతులు లేదా తెగలను విభజించడం /ఉప వర్గీకరణ చేయడం/ పునర్విభజన చేయడం తద్వారా నిర్దిష్ట కులం/కులాలకు రిజర్వేషన్లు కల్పించడానికి చట్టాన్ని రూపొందించే శాసన అధికారం రాష్ట్రాలకు లేదు. రిజర్వేషన్లు కల్పించే ముసుగులో, బలహీనవర్గాలకు మంచి చేస్తున్నామన్న నెపంతో రాష్ట్రాలు రాష్ట్రపతి జాబితాను మార్చకూడదు, ఆర్టికల్ 341తో విభేదించకూడదు. రాష్ట్ర ప్రభుత్వ చర్య సదుద్దేశంతో ఉన్నా, రాజ్యాంగంలోని నిర్దిష్ట నిబంధనలను ఉల్లంఘించినట్లయితే.. ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టు తన అధికార పరిధిని ఉపయోగించి ధ్రువీకరించడం కుదరదు. సదుద్దేశ చర్య, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ రెండూ సమసమాజం లక్ష్యంగా ఉన్నా.. న్యాయబద్ధత, రాజ్యాంగ బద్ధతను పాటించాలి.

– జస్టిస్ బేలా ఎం త్రివేది

సమాజాన్ని ప్రభావితం చేసేలా ఏబీకే రచనలు


సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కుటుంబ సభ్యుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఏబీకే ప్రసాద్. చిత్రంలో దాసు కేశవరావు, సంజయ్ బారు, కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

జ్ఞానవంతమైన సమాజానికి పుస్తకపఠనం ఎంతో అవసరం

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మీడియా సలహాదారు డాక్టర్ సంజయ్ బారు

పంజగుట్ట (హైదరాబాద్): సీనియర్ సంపాదకుడు ఏబీకే ప్రసాద్ మంచి జర్నలిస్టే కాకుండా మంచి రచయిత అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మీడియా సలహాదారుడు, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ మాజీ సంపాదకుడు సంజయ్ బారు అన్నారు. ప్రజలను ఆకట్టుకునేలా, సమాజాన్ని ప్రభావితం చేసేలా ఆయన రచనలు ఉంటాయన్నారు. వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏబీకే ప్రసాద్ 89 ఏళ్లు పూర్తిచేసుకుని 90వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జీవన సాఫల్య అభినందన సభ, 'అలుపెరుగని అక్షరాయుధుడు – ఏబీకే'పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షుడు దాసు కేశవరావు.. అలుపెరగని అక్షరాయుధుడు పుస్తకాన్ని ఏబీకే ప్రసాద్‌కు అంకితం ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ బారు మాట్లాడుతూ .. జ్ఞానవంతమైన సమాజానికి పుస్తకపఠనం ఎంతో అవసరమని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో పఠనాసక్తి లోపించడం బాధాకరమని అన్నారు. ఏబీకే వేల పుస్తకాలు చదివారని, నిబద్ధతగల గొప్ప ఎడిటర్ అని ప్రశంసించారు. తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏబీకే ఒకతరం జర్నలిస్టులను ప్రభావితం చేశారని అన్నారు. కొత్త జర్నలిస్టులను ప్రోత్సహించడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. తెలుగు జర్నలిజంలో ఏబీకే పేరు ఎప్పటికీ ఉంటుందన్నారు. అనంతరం ఏబీకే ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాష నిలబడటానికి, అధికారభాషగా గుర్తింపు రావడానికి కారణమైన వారిలో అత్యంత ముఖ్యుడు సంజయ్ బారు అని అన్నారు. సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. ఏబీకే 90వ ఏట అడుగు పెడుతున్నా, ఇప్పటికీ పత్రికల్లో కాలమ్స్ రాస్తున్నారని అన్నారు.

టుడేస్ గ్రాఫిక్



హ్యాండ్ బ్రేక్ కింద 3.5 కిలోల బంగారం



- కారులోని ప్రత్యేక అరలో దాచి తరలింపు
- బంగారం విలువ రూ.2.51కోట్లుగా నిర్ధారణ
- ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు

చౌటుప్పల్ : అక్రమంగా కారులో తరలిస్తున్న మూడున్నర కేజీల బంగారం పోలీసులకు పట్టుబడింది. తమిళనాడులోని చెన్నైకి చెందిన ముగ్గురు వ్యక్తులు 3కిలోల 577 గ్రాముల విదేశీ బంగారాన్ని ఐదు కడ్డీలుగా మార్చారు. ఆ బంగారాన్ని కర్ణాటకలోని బీదర్‌కు తీసుకెళ్లేందుకు ప్రణాళిక వేసుకున్నారు. బంగారు కడ్డీలను కారులోని హ్యాండ్ బ్రేక్ ఉన్న ప్రాంతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో దాచి పైనుంచి యథావిధిగా సీల్ వేశారు. ఈ విషయమై అప్పటికే పక్కా సమాచారం ఉండటంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) పోలీసులు బుధవారం రాత్రి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ క్రమంలో అటుగా వచ్చిన కారులో సోదా చేయగా...హ్యాండ్ బ్రేక్ వద్ద దాచిన బంగారం బయటపడింది. దీంతో బంగారాన్ని స్వాధీనం చేసుకుని కారులోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆ బంగారు విలువ రూ.2,51,46,310 ఉంటుందని అధికారులు వెల్లడించారు.


కారులోని హ్యాండ్ బ్రేక్ వద్ద దాచిన బంగారు కడ్డీలు

మాఫీపై రైతుల 'ఆరా'టం



రాజాపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన నేపథ్యంలో.. ఆ వివరాలు తెలుసుకునేందుకు రైతులు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద గురువారం ఉదయం రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. తమకు ఎంత మాఫీ అయింది?, మొత్తం చెల్లిస్తే మళ్లీ కొత్త రుణం ఇస్తారా..? తదితర వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. అయితే, రైతులు ఎక్కువగా వస్తుండడంతో బ్యాంకు సిబ్బంది వారికి టోకెన్లు అందజేసి ఒక్కొక్కరిని లోపలికి అనుమతిస్తున్నారు.

స్వామి నారాయణ్ ట్రస్ట్‌కు 13.07 ఎకరాలు



రఘునాథపాలెంలో గురుకులం
మార్కెట్ ధరకు భూమి
మంత్రి తుమ్మల వెల్లడి

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో స్వామి నారాయణ్ ట్రస్ట్ ఆధ్వర్యాన అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన గురుకుల విద్యాలయం ఏర్పాటు కానుంది. ఇందుకోసం రఘునాథపాలెంలోని జింకలతండా రోడ్డులో గ్రీన్ కాలనీ ఎదురుగా 13.07 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ ధరకు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మంత్రి తుమ్మలను కలవగా.. ఆయన మాట్లాడారు. అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటయ్యే ఈ పాఠశాలలో ఇతర విద్యాసంస్థల కన్నా తక్కువ ఫీజు ఉంటుందని తెలిపారు. భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా 500 మంది విద్యార్థులకు బోధన కొనసాగుతుందని వివరించారు. ఖమ్మం జిల్లాలో గురుకులం ఏర్పాటు కానుండడం విద్యార్థులకు వరమే కాక స్థానికులకు ఉద్యోగావకాశాలు దక్కుతాయని తుమ్మల పేర్కొన్నారు.

దివ్యాంగ ప్రయాణికులకు సన్‌ఫ్లవర్ ట్యాగ్

- శంషాబాద్ విమానాశ్రయంలో ప్రారంభం
- ప్రయాణికులకు మెరుగైన సేవల్లో భాగంగానే...



శంషాబాద్: పైకి కనిపించని వైకల్యాలతో ఉన్న ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంలో భాగంగా జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు సన్‌ఫ్లవర్ ట్యాగ్‌ను ప్రారంభించారు. తక్కువ దృష్టి, ఆటిజం, మేధోవైకల్యం, చిత్తవైకల్యం, వినికిడి లోపం ఉన్న ప్రయాణికులకు విమానాశ్రయంలోని సిబ్బంది, అధికారులు వారి అవసరాలను గుర్తించి మరింత మెరుగైన ప్రయాణ సౌలభ్యాన్ని కలిగించేందుకు ఈ ట్యాగ్ దోహదపడుతుందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 200 విమానాశ్రయాల్లో ఇప్పటికే సన్‌ఫ్లవర్ ట్యాగ్ సేవలున్నాయని తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించిన వెబ్‌సైట్‌లతో పాటు ఎయిర్‌పోర్టులో ఇందుకు సంబంధించిన సమాచార డెస్క్‌లో ఫారం పూర్తి చేసి ఇస్తే వారికి ట్యాగ్ లభిస్తుందని చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.